సంపుటి: 23
సంచిక: 3

ఫోన్ నెం.
36959

అపరాధ పరిశోధన

డిటెక్టివ్ కథల మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 39 రూపాయలు
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 250 రూపాయలు.

ఏప్రిల్, 1977

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి
అసిస్టెంట్ ఎడిటర్ :
మిస్. మంజుల
సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
కంచర్ల రమణ
ఏ. వీ. మోహన్రావ్

తొలిమాట

నమస్కారము. మేము అందిస్తున్న 'అజ్ఞాత దీవులు' కథలు పాఠకులకు ఎందుకో తృప్తిని కలిగించటములేదు. తీవ్ర అసంతృప్తిని తెలియజేస్తున్నారు. పాఠకుల కోరిక ప్రకారం ఆ శీర్షికను నిలిపివేస్తున్నాము.

అపన ఫ్రెండ్స్ క్లబ్, పరిశోధన గ్రంథమాల గురించి కొంతమంది మాకు వుత్తరాలు వ్రాస్తున్నారు. వాటితో "అపరాధ పరిశోధన"కు ఎట్టి సంబంధము లేదు. వాటిని గురించి వుత్తరాలు మాకు వ్రాయవద్దని మనవి.

గతనెల "సప్లిమెంట్"లో నిర్వహించిన బ్యాలెట్‌లో శ్రీ ఎల్. రామగోపాల్‌గారి 'ముప్పది ముగ్గురు బానిసలు' నవల అత్యధిక మెజారిటీతో ఉత్తమ నవలగా ఎన్నికైనదని తెలుపుటకు సంతోషిస్తున్నాము. రచయితకు బహుమతి రు. 116/-లు త్వరలో అందజేయబడుతుంది.

'సప్లిమెంట్ పోటీ'ని కూడా తీసివేయమని కొందరు పాఠకులు సూచిస్తున్నారు. దానికి బదులుగా ఎటువంటి పోటీ వుండాలో తెలియజేయండి. మంచి సూచన అందితే పోటీని మార్చే విషయం ఆలోచించగలము. సెలవా మరి—

మీ

శ్యామ దామోదర్ రెడ్డి

ఈ నెలలో....

కథలు (మాసపత్రిక)

4. విస్కీ—విషం—రంకిరెడ్డిరాము.
13. మిలటరీ అనుభవాలు—వసుంధర.
21. నిర్మాత వొస్తున్నాడు—యం. కె. వి. శాస్త్రి.
39. కోకిల—శశిభూషణ్.
55. అబ్బాయి అపహరణ—ఎల్. రామగోపాల్.
68. నడచి వచ్చిన సాక్ష్యం—అజీజ్.
77. ఉత్తమ రచయిత—శ్యాంబాబు.
93. ఫోన్ కాల్—పి. గోపాలరావు.
101. రెండు సున్నాలు—హుస్సేన్ బాషా.
122. అపరిచితులు—శశిభూషణ్.
132. గూండా చేసిన పెళ్ళి—వసుంధర.
164. కైలాస నగరం (సీరియల్)—శ్యాంబాబు.

నవలలు (సప్లిమెంట్)

3. గుండెలు ఆగిన శవాలు—కె. బి. యస్. కుమార్.
54. నేరస్తులోపాఖ్యానం—యం. కె. వి. శాస్త్రి.
84. రహస్య నగరం—సంపత్.
133. శవాలు చెప్పిన కథలు—అజీజ్.
171. శాన్యోరా (సీరియల్)—ముద్దా సురేష్.

ఇవికాక—అపరాధ పరిశోధన పోటీ, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, సప్లిమెంట్ పోటీ, జోక్స్, చెప్పుకోండి చూద్దాం, క్రైమ్‌లో తమాషాలు, మరెన్నో ఆకర్షణలు!

విస్కీ-విషం

రంకిరెడ్డి రాము

మిస్ రమోలా స్టేజిమీద తన అంగాంగాలనూ ప్రదర్శిస్తూ నాట్యం చేస్తోంది. ఆ డ్యాన్స్ చూస్తున్న ప్రేక్షకులు వెర్రెక్కిపోతున్నారు. రమోలా వొళ్ళు క్లబ్ లైట్ల వెలుగులో బంగారంలా మెరిసిపోతోంది. చక్రాల్లాంటి కళ్ళు గిరగిరా తిప్పుతూ, మెరుపు తీగలా మ్యూజిక్ కి అనువుగా స్టెప్స్ వేస్తోంది.

నేను ముఖర్జీగారికి దూరంగా - ఆయనకు కనిపించని విధంగా ఓ మూలగా వున్న టేబుల్ దగ్గర కూర్చుని చేతిలో వున్న గ్లాసులోని విస్కీని కొద్దికొద్దిగా పెదాలతో సిప్ చేస్తూ, రమోలా అందాన్ని కళ్ళతో సిప్ చేస్తున్నాను.

ముఖర్జీగారి ఫ్రండ్ పరమశివం అన్న కూతురు సుజాత పెళ్ళి జరిగింది నిన్న. ఆ సందర్భంగా 'త్రీ ఏసెస్ క్లబ్'లో జరుగుతున్న విందు ఇది. నేను కూర్చున్న టేబుల్ కి కొంచెం దూరంగా వున్న టేబుల్ వైపు చూసాను. అక్కడ

కూర్చున్న వ్యక్తిని చూస్తుంటే - అసూయతో నా గుండె మండిపోతోంది. గంటనుంచి తినేసేలా చూస్తున్నాను అతన్ని.

అతణ్ని చూస్తే నాకు అసూయ కలగటానికి కారణం- అతడు సుజాత భర్త కావటమే! అందంతో మిలమిలా మెరిసిపోయే సుజాతకు ఇతడు తగిన వరుడు కాదేమోనని నా అనుమానం.

సుజాత చలాకీగా తన భర్తతో ఏదో మాట్లాడుతోంది. నా దృష్టి అటునుంచి స్టేజివైపు మరల్చాను. డ్యాన్స్ చివరిదశకు వచ్చిందేమో- రమోలా పిచ్చెత్తినట్టు గెంతు తోంది. ఆమె గెంతుతున్నప్పుడల్లా బరువైన వక్షోజాలు పైకి, క్రిందికి తమాషాగా వూగుతున్నాయి.

అప్రయత్నంగా నా దృష్టి క్లబ్ ముఖద్వారం వైపు సారించాను.

యూనిఫామ్‌లో వున్న తన భారీ శరీరాన్ని మోసుకుంటూ లోపలికి వచ్చాడు క్రైమ్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సెల్వరాజ్. తనకు ఎదురొచ్చిన పరమశివాన్ని ఏదో అడిగాడు సెల్వ రాజ్. అతడి పెదాలు కదిలిన తీరునిబట్టి ముఖర్జీగారిని అడిగాడని అర్థమయింది. వెంటనే లేచి బాస్ కూర్చున్న టేబిల్‌వైపు కదిలాను; ఇన్‌స్పెక్టర్ సెల్వరాజ్ వెనుకే.

సెల్వరాజ్ తిన్నగా బాస్ కూర్చున్న టేబుల్ దగ్గరకు వెళ్ళాడు. ఒంగి బాస్ చెవిలో ఏదో చెప్పాడు. బాస్ లేచి నిల్చుని నావైపు చూసారు. నేను 'రెడీ' అన్నట్టు తలా డించాను. ముగ్గురం కలిసి 'త్రీ ఏసెస్ క్లబ్' బయటకు వచ్చాం.

సెల్వరాజ్ చెబుతున్నాడు బాస్‌తో. "వాళ్ళ ఆత్మహత్య

అని ఫోన్‌చేశారు. కానీ వ్యక్తిగతంగా ఆనందరావుతో నాకున్న పరిచయంతో - అతడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని నిశ్చయంగా చెప్పగలను. అందుకే- ఎందుకైనా మంచిదని మీ కోసం వచ్చాను."

నేను మా కారు పార్క్ చేసివున్న వైపు వెళ్ళాను. కారు స్టార్ట్‌చేసి తీసుకొచ్చి సెల్వరాజ్, ముఖర్జీగారల ముందాపాను. వెనుక డోర్ తెరుచుకుని ముఖర్జీగారు ఎక్కి కూర్చున్నారు. సెల్వరాజ్ బయట తన సిబ్బందితో ఆగి వున్న జీప్ ఎక్కారు.

జీప్ వెనుకనే కారుని పోనిచ్చాను.

రోడ్డు సరిగా కనపడకుండా మిస్ రమోలా నా కళ్ళ ముందు నాట్యం చేస్తోంది. ఇన్‌స్పెక్టర్‌మీద పీకలదాకా కోపంగా వుంది నాకు, రమోలా డ్యాన్స్ సరిగా చూడనివ్వ కుండా శవం దగ్గరకు తీసుకుపోతున్నాడని.

జీప్ ఓ బంగ్లాముందు ఆగింది. కారుని జీప్ వెనుకే ఆపాను. జీప్‌నుంచి పోలీస్ డాక్టర్ వేలిముద్రల నిపుణుడు, ఫొటోగ్రాఫర్, నల్గురు పోలీస్‌లు దిగారు, సెల్వరాజ్‌తోసహా.

అందరం ఆ బంగ్లా వరండాలోకి వెళ్ళేసరికి దాదాపు 25 ఏళ్ళ వయసున్న యువకుడు కంగారుగా మాకు ఎదు రొచ్చాడు. అప్పటివరకూ ఏడ్చినట్టుగా అతడి కళ్ళు ఎర్రగా, ఉబ్బి వున్నాయి.

"శవం ఎక్కడ?" తన సహజ గంభీరస్వరంతో అడిగాడు ఇన్‌స్పెక్టర్ సెల్వరాజ్. అతనా విధంగా మాట్లాడి నప్పుడల్లా నాకు పగలబడి నవ్వాలనిపిస్తుంది.

"రండి చూపిస్తాను" అంటూ లోపలకు దారితీసాడు ఆ యువకుడు.

లోపల అంతా అధునాతనంగా వుంది. ఖరీదైన ఫర్నిచర్, గోడలకు అందమైన పెయింటింగ్స్‌తో అంతా శోభాయమానంగా వుంది. ఆ యువకుడు మమ్మల్ని గదిలోకి తీసుకెళ్ళాడు.

ఆ గదిలో ఈజీఛైర్‌లో వెనక్కివాలి పడివున్నాడు ఓ నడివయసు వ్యక్తి. చూసేవాళ్ళు అతడా కుర్చీలో నిద్రపోతున్నాడనుకునే అవకాశం వుంది. ఆ కుర్చీముందు ఓ టీపాయ్ వుంది. దానిమీద బ్లాక్‌నైట్ విస్కీ బాటిల్ మూత తెరిచి వుంది. ఆ బాటిల్ పక్కనే ఓ గాజు గ్లాస్ వుంది. అందులో అడుగున కొద్దిగా విస్కీ వుంది. మొత్తం గదంతా నీట్‌గా వుంది.

ఇన్‌స్పెక్టర్ సెల్వరాజ్ పోలీస్ డాక్టర్‌కి,ఫొటోగ్రాఫర్‌కి, ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్‌కి సైగచేసాడు. వాళ్ళంతా ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు.

బాస్ తల పంకిస్తూ బయటకు నడిచారు. సెల్వరాజ్, నేను ఆయన్ను అనుసరించాం.

బయట ఇంతకుముందు మమ్మల్ని గదిలోకి తీసుకువచ్చిన యువకుడు, మరో ఇద్దరు నిలబడి వున్నారు. అందులో ఒకడు ఇంటి నౌఖరని అతడి వేషధారణ చెబుతోంది. రెండో అతను సిల్క్ లాల్చీ, పైజమా ధరించి, హుందాగా వున్నాడు. పక్క గదిలోంచి కాబోలు ఎవరో ఆడవాళ్ళ ఏడుపు సన్నగా వినిపిస్తోంది.

బాస్ పాకెట్‌లోంచి చూయింగ్‌గమ్ తీసి నోట్లో వేసుకుని నముల్తూ "చనిపోయిన వ్యక్తి నీకేమవుతారు?" అన్నారు యువకుడి నుద్దేశించి.

ఆ యువకుడు "వారు మా నాన్నగారు. నా పేరు

సుధాకర్" అన్నాడు.

"మాకు ఫోన్ చేసిందెవరు?" అడిగాడు సెల్వరాజ్.

"నేనే!"

"చూస్తుంటే ఆయనది సహజ మరణంలా అనిపిస్తోంది. మరి నీకెలా అనుమానం కలిగిం దబ్బాయ్!" అన్నారు బాస్.

ఆ యువకుడు చిన్నగా దగ్గి చెప్పాడు "అసలు జరిగిం దంతా మొదట్నుంచీ చెబితేనేగాని సిట్యుయేషన్ మీ కర్థం కాదు" అని తన పక్కనున్న సిల్కు లాల్చీ, పైజమా వ్యక్తి వైపు తిరిగి "మొదట్నుంచీ జరిగిందంతా నువ్వే చెప్పు మామయ్యా! రండి. ఈ గదిలో కూర్చుని మాట్లాడు కుందాం" అంటూ పక్క గదిలోకి తీసుకెళ్ళాడు.

అంతా కూర్చున్నాక ఆ వ్యక్తి గొంతు సవరించుకుని చెప్పసాగాడు: "నా పేరు కోదండరామయ్య. చనిపోయిన ఆనందరావు భార్య తమ్ముడిని నేను. సుధాకర్, నా కూతురు లీల ప్రేమించుకున్నారు. పెళ్ళికూడా చేసుకోవాలనుకున్నా రట. ఆ విషయం మా అమ్మాయి నాతో నిన్ననే చెప్పింది. నాకు చాలా సంతోషం కలిగింది. మేం ఒకరికొకరం కావలసిన వాళ్ళం. పిల్లలద్వారా మా బంధుత్వం మరింత బలపడుతుందనుకోగానే నాకు ఆకాశంలోకి ఎగిరినట్లనిపిం చింది. మంచిరోజు చూసి వచ్చి ఆ విషయం మా బావతో మాట్లాడుదామనుకున్నాను.

"కానీ, ఈరోజు ఉదయం సుధాకర్ విచారంగా మా ఇంటికి వచ్చి వాళ్ళ వివాహానికి బావ ఒప్పుకోవటం లేదనే విషయం చెప్పాడు. నేనా మాటలు వినగానే నిర్ఘాంత పోయాను.

"మేం మరీ పేదవాళ్ళం కాదు. బావ కున్నంత ఆస్తి

లేకపోయినా, నాకున్న దాంట్లో నా ఒక్కగానొక్క కూతురికి ఏ లోపం లేకుండా పెళ్ళి చేయగలను. సుధాకర్‌కి ఇష్టమని చెప్పినా, సుధాకర్ తల్లి కూడా దీనికి అంగీకరించినా బావ మొండిగా వీల్లేదని భీష్మించుకుని కూర్చున్నాడట. ఏది ఏమైనా తాను లీలను చేసుకు తీరుతానని గట్టిగా చెప్పి వచ్చాడట సుధాకర్. ఈ విషయాలన్నీ వినగానే నేను నీరుగారిపోయాను."

కొద్ది క్షణాలాగి తిరిగి చెప్పసాగాడు కోదండరామయ్య: "బావ ఈ విషయంలో అంత మొండిపట్టుదల ఎందుకు పట్టాడో, తన ఏకైక పుత్రుడి కోరికను అంత నిర్దాక్షిణ్యంగా ఎలా కాదనగలిగాడో- నా కెంత ఆలోచించినా అంతుపట్ట లేదు. ఈ విషయమై బావతో మాట్లాడదామని రాత్రి 9 గంటలకు ఇక్కడకు వచ్చాను. బావ ఫ్యాక్టరీనుంచి వచ్చి భోజనంచేసి విశ్రాంతి తీసుకునే సమయం అదేనని తెలిసే ఆ టైమ్‌కి వచ్చాను. నేను బావ గదిలో అడుగుపెట్టేసరికి, బావ ఇప్పుడు పడుకున్న కుర్చీలోనే పడుకుని వున్నాడు విచారంగా.

"నన్ను చూడగానే కళ్ళల్లో నీళ్ళు నిలుపుకుని 'చూశావా బావా! సుధ ఏమన్నాడో! నామాట వాడికి లెక్కలేదట. ఈ ఆస్థిలో వాడికి చిల్లిగవ్వకూడా అక్కరలేదట' అన్నాడు.

"నేను నెమ్మదిగా అసలు విషయం బావ నుంచి రాబట్టాను. బావ తన స్నేహితుడి కూతుర్ని సుధాకర్‌కి చేసుకుంటానని మాటిచ్చాడట. ఇప్పుడా మాట తప్పవలసి వస్తుందని బావ చాలా బాధపడ్డాడు. నువ్వు అంతమాటన్నాక నాకీ జీవితంమీదే విరక్తి పుట్టింది. అటు సుధను దూరం చేసుకుని బ్రతకలేను. ఇటు స్నేహితుడి కిచ్చిన మాట

నిలబెట్టుకోలేక జీవించలేను' అన్నాడు బావ కన్నీళ్ళతో.

"నేను బావను ఊరడించాను. ఇంతలో బావ లేచి అల్మైరాలో వున్న గాజుగ్లాస్, విస్కీ-బాటిల్ తీసుకొచ్చి టీపాయ్‌మీద పెట్టాడు. బాటిల్ ఓపెన్‌చేసి అందులో విస్కీ పోసుకున్నాడు. ఆ తర్వాత జేబునుంచి ఏదో పొట్లంతీసి అందులోవున్న పౌడర్ విస్కీలో కలుపుకున్నాడు.

"నాకు అనుమానం వచ్చి 'ఏమిటిది?' అన్నాను. బావ నవ్వి 'ఈ ప్రాణం అంత తేలికగా పోదులేబావా! గుండెల్లో అప్పుడప్పుడు నొప్పి వస్తుందంటే డాక్టర్ ఇది వ్రాసిచ్చాడు' భోజనంచేసి పడుకోబోయేముందు ఈ పౌడర్ విస్కీలో కలిపి తాగమన్నాడు' అంటూ గ్లాస్ పట్టుకుని అందులో విస్కీ తాగేసాడు.

"నేను బావ చెప్పింది నిజమనుకుని నమ్మాను. కానీ, బావ అప్పుడు 'సుధ అంతమాటన్నాక నేను బ్రతకలేను బావా! నేనిప్పుడు విస్కీలో కలుపుకుతాగింది విషం. సుధను నా గురించి బాధపడొద్దని....ని....చె....ప్పు" అంటూ కుర్చీలో వెనక్కి వాలిపోయాడు."

"నేను వెంటనే బయటకువచ్చి సుధాకర్‌తో విషయం చెప్పాను. ఇది ఆత్మహత్య అయినా పోలీస్‌లకు తెలియ జేయటం మనకర్తవ్యం అంటూ మీకు ఫోన్‌చేసాడు" అని ముగించాడు కోదండరామయ్య.

"మీకెవరిమీదైనా అనుమానంగావుందా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ సెల్వరాజ్; సుధాకర్‌ని.

సుధాకర్ ఆశ్చర్యంగా చూశాడు ఇన్‌స్పెక్టర్‌వైపు. "అనుమానమా? ఇందులో అనుమానించటానికేముంది?" అన్నాడు.

సెల్వరాజ్ నవ్వి "ఇలా అడగటం కేవలం ఫార్మాలిటీ కోసం. మీరేమీ అనుకోకండి," అన్నాడు.

బాస్ లేచి "మైడియర్ ఇన్‌స్పెక్టర్! ఇక మన మిక్కడ చేసేదేంలేదు. శవాన్ని పోస్ట్‌మార్టమ్‌కి పంపించే ఏర్పాట్లు చెయ్!" అన్నారు.

సెల్వరాజ్‌ని చూస్తోంటే మండిపోతోంది నాకు. అందమైన రమోలాడ్యాన్స్‌ని పూర్తిగా చూడకుండా ఇక్కడేదో మునిగిపోయినట్టు తీసుకొచ్చాడు. ఇలా ప్రతి ఆత్మహత్య కేస్‌కూ హాజరౌతుంటే ఇక మాకు తినటానికి కూడా టైముండదు. అసలు దీనికంతటికీ కారణం బాస్. సెల్వరాజ్ ప్రతిచిన్న కేస్‌కూ బాస్‌ని ఆహ్వానించటం—ఈయన బయలు దేరటం చూస్తుంటే నాకు చిర్రెత్తుకొస్తోంది.

"సెల్వరాజ్ భాయ్! రేపు పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్, ఫోరెన్సిక్ రిపోర్ట్ వచ్చాక నన్ను కలుసుకో!" అంటూ బయటకు నడిచారు బాస్.

నేను ఆయన్ను అనుసరించాను.

* * *

"ఇది పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్. ఇది ఫోరెన్సిక్ రిపోర్ట్" అంటూ అందించాడు ఇన్‌స్పెక్టర్ సెల్వరాజ్.

బాస్ అందుకుని పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ పరిశీలిస్తున్నారు. ఈలోగా నేను ఫోరెన్సిక్ రిపోర్ట్ తీసుకుని చూసాను.

గది అల్మైరా మీద, టీపాయ్‌మీద ఆనందరావు వేలిముద్రలున్నాయి. విస్కీబాటిల్ మీద, టీపాయ్‌మీద ఆనందరావు కుడిచేతి వేలిముద్రలు రెండుచోట్లపడ్డాయి. గ్లాస్‌మీద కూడా ఆనందరావుదే కుడిచేతి వేలిముద్రలు ఒకచోట వున్నాయి. వీటిమీద మరెవ్వరి వేలిముద్రలు లేవు. గదిలో

మాత్రం చాలామందివి అడుగుజాడలు వున్నాయి. ఎక్కడా వేలిముద్రలు చెరిపిన గుర్తులులేవు.

ఆ రిపోర్ట్ చదివాక కొత్తగా తెలిసిన విషయాలేమీ లేవు. నిస్సందేహంగా ఇది ఆత్మహత్యే అని నిరూపిస్తోందా రిపోర్ట్. బాస్ పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ అందుకున్నాను.

'మరణం రాత్రి సరిగా 9-22 ని॥కు జరిగింది. ఆర్సెనిక్ విస్కీతో కలిపి తీసుకోవటంవలన మరణం సంభవించింది!' ఇదే పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ సారాంశం.

రిపోర్ట్ చదివి బాస్ తలపైకెత్తి "మైడియర్ ఇన్‌స్పెక్టర్! ఇది ఆత్మహత్యకాదు. హత్య! వెంటనే వెళ్ళి ఆనందరావు బావ కోదండరామయ్యను అరెస్ట్‌చెయ్!" అన్నారు.

అదిరిపడ్డాను. సెల్వరాజ్ చేష్టలుడిగి చూస్తున్నాడు బాస్ వైపు. ఇది నిజంగానే హత్య అయివుంటుంది. బాస్ అంత కరెక్ట్‌గా చెప్పారంటే ఎప్పుడూ తప్పలేదు ఆయన అయిడియా. ఎక్కడుంది మెలిక?

"ఎలా చెప్పగలిగారు?" గొంతు పెగల్చుకుని అడిగాడు సెల్వరాజ్.

బాస్ ఫోరెన్సిక్ రిపోర్ట్ సెల్వరాజ్ చేతికిచ్చి "అంతా ఇందులోనేవుంది. మైడియర్ ఇన్‌స్పెక్టర్! దీన్ని జాగ్రత్తగా చదివితే మొత్తమంతా బోధపడుతుంది" అన్నారు.

సెల్వరాజ్ ఓ పావుగంట దాన్ని తిరగేసి నాచేతికిచ్చాడు. దానితో అతడికేమీ అర్థంకాలేదని అతడి మొహమే చెబుతోంది.

నేనూ ఆ రిపోర్ట్ పరిశీలనగా చూసాను. ఏమీ అర్థం కాలేదు. మరింత తీవ్రంగా— జాగ్రత్తగా చూసాను.

అల్మైరా.... టీపాయ్.... విస్కీసీసా.... గ్లాస్.... వేలిముద్రలు వీటి చుట్టూ నా బుర్ర వేగంగా తిరగసాగింది. ఎక్కడుంది కిటుకు? ఎక్కడో వుందని తెలుస్తూనేవుంది! అది నా బుర్రకు అందీ అందకుండా ఏడిపిస్తోంది. ఎక్కడ?....ఏమిటి? ప్చ్! లాభంలేదు. నిరాశగా పెదవి విరుస్తూ రిపోర్ట్ బాస్‌చేతి కిచ్చాను.

బాస్ చూయింగ్‌గమ్ నములుతూ, చిన్నగా నవ్వి మొదలు పెట్టారు.

"కోదండరామయ్య కథనం ప్రకారం....ఆనందరావు లేచివెళ్ళి అల్మైరా తెరిచి విస్కీబాటిల్, గ్లాస్ తీసుకొచ్చి టీపాయ్‌మీద పెట్టాడు. విస్కీబాటిల్ ఓపెన్‌చేసి గ్లాస్‌లో విస్కీ వొంపుకుని అందులో విషంకలిపి గ్లాస్ ఎత్తిపట్టుకుని తాగారు. అంటే—అల్మైరాలోంచి గ్లాస్ తీసేటప్పుడు ఓసారి, విస్కీపోసుకున్నాక తాగేటప్పుడు మరోసారి గ్లాస్ మీద ఆనందరావు వేలిముద్రలు రెండు సెట్లు పడాలి!

కానీ రిపోర్ట్ ప్రకారం ఒక్కసెట్టు వేలిముద్రలేవున్నాయి. అంటే ఆ గ్లాస్‌మీద కోదండరామయ్య వేలిముద్రలు కూడా పడివుండాలి. అతడే అందులో విషంకలిపి ఆనందరావుకి ఇచ్చివుంటాడు. అతడు చనిపోయాక గ్లాస్ మీద వేలి ముద్రలు తుడిచేసి....ఆనందరావు చేత్తో ఓసారి గ్లాస్ పట్టించి అతడి వేలిముద్రలు దానిమీద పడ్డాక కర్చీఫ్‌తో దాన్ని పట్టు కుని మళ్ళీ టీపాయ్‌మీద పెట్టివుంటాడు...." అంటున్నారు బాస్.

సెల్వరాజ్ ఒక్కసారిగా కుర్చీలోంచి లేచి బయటకు పరుగెత్తాడు, హంతకుడ్ని అరెస్టుచేసేందుకు. ***

మిలిటరీ అనుభవాలు?

వసుంధర

ఆయన పూర్తి పేరెందరికి తెలుసో నాకు తెలియదు కానీ అందరూ ఆయన్ని రాయుడుగారంటారు. ఆయన ఇంటి పేరు కూడా క్లుప్తంగా కలిపి—కె. రాయుడు అని పిలుస్తారు చాలామంది. అలా పిలవడానికి అసలు కారణమది కాదనీ ఆయన కోతలు కోయడంలో స్పెషలిస్టనీ—అందుకే కోతలరాయుడని స్ఫురించేలా కె. రాయుడు అంటారనీ చాలామంది అనుకుంటూంటారు. ఈ కోతలరాయుడుగారు నాతో కబుర్లాడ్డానికి వచ్చినప్పుడల్లా చుట్టుపక్కలనుంచి నలుగురైదుగురు నిరుద్యోగులు కూడా మా ఇంటికొస్తూంటారు. అందుకు కొన్ని కారణాలున్నాయి.

రాయుడుగారు కోతలు కోసేమాట నిజమే కానీ ఆయన ఆ విద్యలో సిద్ధహస్తుడు. ఆయన ఎన్ని అబద్ధాలు చెప్పినా అతికినట్లుంటాయి. అందువల్ల ఆయన మాటలు నమ్మినా నమ్మకపోయినా—అబద్ధం అని ముఖంమీద అనడం కష్టం.

అయితే సునిశిత పరిశీలన నాకు వెన్నతోపెట్టిన విద్య. వృత్తిరీత్యా లాయర్ని కాకపోయినప్పటికీ ఎదుటివారిమాటల్లో ఏమాత్రం లోపమున్నప్పటికీ వెంటనే పట్టేసుకోవడం నా ప్రత్యేకత. కోతల రాయుడుగారు నా దగ్గరకు వచ్చి కోతలు కోసినప్పుడల్లా—అంతా వినడమయ్యేక—ఆయన చెప్పినదబద్ధమని సకారణంగా ఋజువు చేసి చూపించే వాణ్ణి. నాకు దొరకని విధంగా అబద్ధమాడాలన్న పట్టుదలతో రాయుడుగారు రోజూ ఇంటికి వస్తే—ఆయన్ను నేనెలా దొరకపుచ్చుకుంటానో చూడడం కోసం ఆ నిరుద్యోగులు మా ఇంటికి వస్తూంటారు.

సాయంత్రం నేనాఫీసునుంచి తిరిగిరాగానే టిఫిన్ తిని పేపరు చూసే సమయానికి రాయుడుగారు మా ఇంటికి వస్తారు. ఆయన రావడం చూస్తూనే చుట్టుపక్కల నిరుద్యోగులు కూడావస్తారు. వాళ్ళు రాగానే రాయుడుగారిలో ఉత్సాహం వస్తుంది.

ఎప్పటిలాగే ఆ రోజు రాయుడుగారు ఉత్సాహంగా తన కథ మొదలుపెట్టారు.

"మిమ్మల్ని చూస్తే జాలేస్తోందయ్యా—రోజూ ఎంత ఆశగా ఉత్తరాల కోసం ఎదురు చూస్తారు. సాధారణంగా మీ వుత్తరమే వుండదు. ఉన్నా అది ఏ రిగ్రెట్ లెటరో అయుంటుంది. ఆ బాధ పగవాడికున్కూడా వద్దు. అంతకంటే మిలటరీలో ప్రయత్నించి...." అని ఆగాడాయన శ్రోతల ముఖంలో భావాలను పరిశీలించడానికి.

"చెప్పడం సులువే కానీ, ఆచరణలో కష్టమండి. ఏ క్షణంలోనైనా యుద్ధం వచ్చేలావున్న ఈ రోజుల్లో మిలటరీ సర్వీస్ గురించి ఆలోచించడం ప్రాణాంతకమే"

అన్నాడు సుదర్శనం అనే పేరుగల నిరుద్యోగి.

"అందరి సంగతీ తెలియదు కానీ, నేను మాత్రం స్వానుభవంలోంచే సలహాలనిస్తాను. నా చిన్నతనంలో ఉద్యోగం దొరక్క నేనూ ఇబ్బంది పడ్డాను. ఇబ్బందిల్లోనూ ఇలాంటలాంటివి కాదు" రాయుడుగారు పడక్కుర్చీలో వెనక్కి జార్లగిలపడి "మిలటరీ సర్వీస్‌లో జాయినయ్యే వరకూ నా ఇబ్బందులు తీరలేదు" అన్నాడు.

"మీరు మిలటరీ పని చేశారా" అన్నాడు రంగారావు ఆశ్చర్యంగా. అప్రయత్నంగా అందరమూ ఆయన్ను పరిశీలించి చూశాం. వదులువదులుగావున్న ఆయన శరీరం— ఎప్పుడూ కూర్చునే వాడికుండేంత పెద్ద బొజ్జ, ఆయనకూ మిలటరీకీ చాలాదూరమని స్ఫురింపజేస్తోంది.

"ఏం నన్ను చూపి నమ్మలేకపోతున్నారా" అనడిగేడు రాయుడు నవ్వుతూ "ఎల్లకాలం మనిషి మీకులాగే తుళ్ళుతూ వుంటారనుకోకండి. రేపు మీకు ఏభై ఏళ్ళు దాటనివ్వండి అవతారాలెలా తయారౌతాయో చూడవచ్చు."

"అవుననుకోండి, కానీ, నాకు తెలిసిన మిలటరీ ఆఫీసరొకాయనున్నారు. ఆయన వయస్సు యాభై అయిదేళ్ళుంటుందేమో నాకంటే చలాకీగా వుంటాడు. నాకున్నపాటి బొజ్జకూడా వుండదు" అన్నాడు కృష్ణమోహన్.

రాయుడుగారు నవ్వి "ఆయన సర్వీస్ వదిలేసినా వ్యాయామం మానివుండడు. ఎప్పుడూ వ్యాయామం చేసేవాడు హఠాత్తుగా మానేస్తే మనిషిరూపం చాలా అసహ్యంగా అయిపోతుంది" అన్నాడు.

"సరేలెండి మీమిలిటరీ అనుభవాలు చెప్పండి" అన్నాను రాయుడుగారిని పట్టడానికింకా సమాచారం కావాలని గ్రహిం

చినవాడనై.

రాయుడుగారు నవ్వేడు. ఆ నవ్వులో నా ఉద్దేశ్యం గ్రహించిన అభిప్రాయం వ్యక్తపరిచేడాయన. "చెప్పడానికేముందీ అందరకూ ఉన్నలాంటనుభవాలే, మిలిటరీ సర్వీసులో నేను నేర్చుకొన్నదేమిటంటే క్రమశిక్షణ" అన్నాడాయన.

మేమెవ్వరమూ ఆయన మాటలను ఖండించదల్చుకోలేదు. మేము పూర్తిగా మౌనం వహిస్తేతప్ప ఆయన అసలు విషయంలోకి రాడని అనుభవంమీద మాకు తెలుసు.

రాయుడుగారు మళ్ళీ మొదలెట్టాడు. "క్రమశిక్షణంటే అలాంటిదిలాంటిది కాదు. ఐరన్ డిసిప్లిన్ అన్నమాట. ఒకసారేమయిందంటే—" రాయుడుగారికి దగ్గువచ్చినట్లుంది చిన్నగా దగ్గి మళ్ళీ మొదలెట్టాడు. "అయిదారు నెలల సర్వీసులో వున్నాక ఇంటికి కాస్త డబ్బు పంపగలిగాను. నేనేమైపోయానో తెలియని పరిస్థితుల్లోఉన్న నాతలిదండ్రులకీ దెబ్బతో నా ఆచూకీ తెలిసిపోయింది. బహుశా ఆనందంలోనే అయుంటుంది. ఒక వుత్తరం రాశారు. అది చదువుకోబోతున్నాను. నాకూ ఆరాటంగా వుంది. ఇంటి దగ్గర నన్ను గురించి ఏమనుకుంటున్నారో పరిస్థితులెలాగున్నాయోనని వెంటనే కవరు చింపి లోపలి కాగితం బయటకు తీశాను. చదవబోతుండగా నాచేతులు వణికాయి. చేతిలోని వుత్తరం క్రిందపడింది. గాలిబాగా ఎక్కువగా వుండడంవల్ల అది ఎగిరిపోయే అవకాశముంది. అందుకని వెంటనే వంగుని కాగితాన్ని తీయబోయాను. కానీ ఇంతలో ఏమయిందంటే నా పై అధికారి వచ్చాడు. అంతే చటుక్కున తిన్నగా నిల

బడి అటెక్షన్ ఫోజులో ఆయనకు సెల్యూట్ చేశాను. నా ప్రియమైన పుత్తరం ఎగిరిపోయింది.

"మిలిటరీలో వచ్చిన తంటాయే ఇది— మనిషి మనిషిగా బ్రతకలేడు. పై ఆఫీసరంటే సింహానికో, పులికో భయపడినట్లుండాలి" అన్నాడు రంగారావు నిట్టూర్చి.

"అలా అనేయకు. మీరంతా మనుషుల్లా బ్రతకడం కోసం మిమ్మల్నందర్నీ పులుల్నించీ, సింహాల్నించీ రక్షించడంకోసం మిలిటరీ వుంది. అదొక త్యాగపూరిత జీవితం. ఎన్ని కష్టాలుపడినప్పటికీ నా అయిదేళ్ళ మిలటరీ అనుభవాలు నాకంతులేని సంతృప్తినిచ్చాయి—" అన్నాడు రాయుడు.

"మిలటరీకి సంబంధించినంతవరకూ మీకు మిగిలినవి అనుభవాలొక్కటేనా — లేక...." అని భావగర్భితంగా నవ్వాను.

నా అభిప్రాయం రాయుడుగారి కర్థమైంది. "ఆ ధైర్యం, ఆ పరాక్రమం ఇప్పటికీ నా దగ్గరున్నాయి. అన్నిటికీమించి క్రమశిక్షణ అది మాత్రం వదులుకోలేను. మొన్న ఒకరోజు హఠాత్తుగా నిద్రలోలేచి సెల్యూట్ చేశానట. నా భార్య కంగారు పడి నన్ను కుదిపి మెలకువతెప్పించి విషయమేమిటని అడిగింది. కంగారు పడకు, కలలో మిలటరీ ఆఫీసరు వచ్చేడని చెప్పాను."

కృష్ణమోహన్—"ఇది ఇటీవలే జరిగిందంటున్నారు. మీ మిలిటరీ సర్వీసు చాలా పాతకాల విషయం. అప్పట్నించీ ఇప్పటివరకూ మీ కలలోకి ఏ మిలిటరీ ఆఫీసరూ రాలేదా? రాలేదనుకోవాలి. ఎందుకంటే మీఆవిడ కంగారుపడ్డారంటే" అని ఆగిపోయాడు.

"భలేవాడివయ్యా" అని నవ్వేశాడు రాయుడు. "రామాయణాన్ని నేను నమ్మకపోవడానికి ఒకే కారణముండేది. అందుక్కారణం కుంభకర్ణుడు. అంత నిద్రపోయే వాడేజాతిలోనూ ఉండడని నాకు బాగా నమ్మకం. మా ఆవిణ్ణి పెళ్ళి చేసుకున్నాకనే నేను రామాయణాన్ని నమ్మడం ప్రారంభించాను" రాయుడు క్షణం ఆగి "మొన్నమొన్న కాదనుకో ఓ ఏడాది క్రితం జరిగిందిది. మావైవాహిక జీవితంలో మొట్టమొదటిసారిగా నేను నా భార్యకంటే ముందర నిద్రపోయాను. బహుశా అదే ఆఖరుసారికూడా అనుకుంటాను" అన్నాడు.

"అందుకేకూడా మిలిటరీ ఆఫీసరుకూడా కలలోకి వచ్చివుంటాడు" అన్నాను నేను నవ్వుతూ "ఏదైనా మీకా ఆఫీసరంటే భయమో, లేక క్రమశిక్షణో నాకు తెలీకుండా ఉంది."

"ఆఫీసరంటే నాకు భయమా?" రాయుడు చాలా గట్టిగా నవ్వాడు. ఆ నవ్వు ఎంత భయంకరంగా ఉందంటే లోపల్నుంచి చేత్తో బుల్‌బుల్‌తో నా తమ్ముడు వచ్చాడు.

నా తమ్ముడి పేరు రాంబాబు. వాడి వయస్సు పధ్నాలుగేళ్ళు.

"ఎవరూ? రాయుడుగారా నవ్వింది?" అన్నాడు రాగానే.

ఏదో వంకపెట్టుకుని మా మధ్యకు రావాలనుంటుంది వాడికి. రాయుడుగారి కబుర్లు వినడానికి వాడికంత ఉత్సాహం లేదు—హఠాత్తుగా వచ్చినట్లు చేత్తో బుల్‌బుల్‌తో వస్తే—మాలో ఎవరైనా ఓ పాట వాయించమంటామేమోనని వాడి ఆశ. మొహమాటానికైనా వాణ్ణి వాయించమనడానికి నాకు భయం. ఎందుకంటే నాకు అన్నిరకాల పాటలూ ఇష్టమే.

ఇష్టంలేని పాటంటూ ఉండదు. వీడు బుల్‌బుల్ మీద న్యాయం చేకూర్చిన పాటంటూ ఒక్కటికూడా లేదు.

"అవునోయ్—నవ్వి అలిసిపోయాను. ఏదైనా పాట వాయించు" అన్నాడు రాయుడు. ఆయన నోట్లోంచి ఆ మాట ఊడిపడకుండానే రాంబాబు ఒక పాట వాయించాడు. తమ్ముడిని పరాయివాళ్ళ ముందు చిన్నబుచ్చడం ఇష్టంలేక నేను చెవులు మూసుకోలేదు. కళ్ళయితే చేతు లుపయోగించకుండా మూసుకోవచ్చు. చెవులకూ్కడా అలాంటి ఏర్పాటుంటే ఎంత బాగుండేది—అనుకున్నాను.

అలా వరసగా నాలుగు పాటలు ఖూనీ చేయడమయ్యేక అంతా మొహమాటాన్ని వదలుకుని "నీకు బాగా వచ్చిన పాట లేదా?" అన్నారు.

"అయితే ఇంక జనగణమనే" అంటూ ఆ పాట వాయించాడు. అదీ తప్పే వాయించాడు. ఎటొచ్చీ పాట ఫలానా అని తెలుస్తూనే ఉంది.

"చాలా బాగా వాయించావోయ్" అన్నాడు రాయుడు. తమ్ముడింక లేచి వెళ్ళిపోయాడు. వాడి పని అయిపోయింది కదా! వాడు వెళ్ళిపోగానే "నాకు పాటలంటే అట్టే ఆసక్తి లేదు. మిలిటరీలో పనిచేసిన మూలాన జనగణమన మాత్రం బాగా వంటబట్టింది. బాగా వాయించాడు మీ తమ్ముడు" అన్నాడు రాయుడు.

"నిజంగానే అంటున్నారా?" అన్నాను.

"మెప్పుకోలు మాటలు నా కిష్టముండవు" అన్నాడు రాయుడు.

"వాడు ట్యూను తప్పు వాయించాడండీ—పాట ఇది అని తెలుస్తోంది కానీ—వాడు సరిగ్గా వాయించలేదు. అది మీకు బాగా వంటబట్టిన పాట కాబట్టి మీరు గ్రహించే ఉంటారనుకుంటాను....—" అన్నాను.

రాయుడు దెబ్బతిన్నట్లు కనబడ్డాడు. కానీ త్వరగానే తమాయించుకుని "మీవాడింకా టీనేజర్. అలాంటివాడి దగ్గర్నించి పెర్‌పెక్ట్ ట్యూనెలా ఎక్స్‌పెక్ట్ చేస్తాం. పాట ఇది అని తెలిసేలా వాయించగలగడమే గొప్ప విశేషం. నేను మెచ్చుకున్నది మీవాడి వయసుకుతగ్గ ప్రావీణ్యాన్ని—అంతేకానీ...." అని ఆగి "అదంతా ఎందుకుగానీ ఇందాకా పై ఆఫీసర్లంటే నాకు భయమేమోనని మీరంటే నాకు నవ్వొచ్చింది. కారణం తెలుసా?" అన్నాడు రాయుడు.

త్వరగా విషయం మార్చేయాలని రాయుడనుకుంటున్నట్లు గ్రహించాను.

"చూడండి రాయుడుగారూ! మీరు మిలిటరీలో నిజంగా పనిచేసే ఉంటే మీకు క్రమశిక్షణ వంటపట్టలేదనీ, అందువల్లనే పై ఆఫీసర్లకు భయపడేవారనీ అనుకోవలసి ఉంది. అసలు మీరు మిలిటరీలో పని చేయనేలేదు. అందువల్ల మీరు మిగతా కథ చెప్పనవసరంలేదు...." అన్నాను.

రాయుడు కాస్త చిరాగ్గా పడకకుర్చీలోంచి లేచి "ఊరికే మాటంటే కుదరదు — కారణం చెప్పాలి" అన్నాడు.

"ఇప్పుడు కాకుండా—ఇందాకా జనగణమన పాటకు మీరు కుర్చీలోంచి లేచి నిలబడి ఉంటే—మీ కథలన్నీ నేను నమ్మి ఉండేవాడినేమో" అన్నాను నేను తాపీగా. ***

నిర్మాత వొస్తున్నాడు

యం. కె. వి. శాస్త్రి

"రేపే బొంబాయినుంచి లేపాక్షి ఫిలిం కంపెనీవారు, వాళ్ళు తీస్తున్న హిందీ పిక్చర్ ఔట్‌డోర్ షూటింగ్ కోసం, ఇక్కడకి వస్తున్నారు. ఏర్‌పోర్టుకి వెళ్ళి రిసీవ్ చేసుకోవాలి వాళ్ళని. అందుకని రేపు ఉదయం ఏడుగంటల కల్లా, మా ఇంటికి రావాలి నువ్వు! మర్చిపోకు సుమా!" అన్నాడు డైరెక్టర్ పీతాంబరం, తన ఎసోసియేట్ డైరెక్టర్ గురుమూర్తితో.

రాత్రి ఇంటికి బయలుదేరి వెళ్ళబోతున్న గురుమూర్తి, పీతాంబరం అంటున్న మాటలకి అర్థంకానట్టు అయోమయంగా చూశాడు.

"నిజంగా? మరి ఇంతకుముందు మీరు నాకు మాట మాత్రంగానేనా చెప్పలేదే?" అన్నాడు గురుమూర్తి.

"ఔను. నిజమే! నాకు కూడా ఇవాళ ఉదయమే తెలిసింది. బొంబాయినుంచి వాళ్ళు నాకు ఫోన్‌చేసి చెప్పేరు.

అసలు ముందు వాళ్ళు ఇక్కడ షూటింగ్ చేసుకోవాలని అనుకోనేలేదుట. కొన్ని కారణాలవల్ల, రెండు హీరో హీరోయిన్ల డ్యూయట్ సాంగ్స్ తాలూకు షూటింగు, ఈ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో పూర్తి చేసుకుందుకి నిశ్చయించుకున్నారుట.

ఇవాళ ఉదయం వాళ్ళు నాకు ఫోన్‌చేసి, ఆ ఏర్పాట్లేవో నన్ను చెయ్యమని, మరీ ఒత్తిడిచేస్తే, కాదనలేకపోయాను" చెప్పాడు పీతాంబరం.

2

లేపాక్షి ఫిలిం కంపెనీ యూనిట్‌వాళ్లు మొత్తం పదహారు మంది వచ్చారు మద్రాసుకి.

ముందుగానే పీతాంబరం, వాళ్ళకోసం కేటాయించిన గెస్ట్‌హౌస్‌లో విడిది చేశారు వాళ్ళు. వాళ్ళకి ఏ లోటూ రాకుండా సకల మర్యాదలు చెయ్యడంకోసం గురుమూర్తి నియమించబడ్డాడు.

లేపాక్షి ఫిలిం కంపెనీవాళ్ళ ఔట్‌డోర్ షూటింగ్ కార్యక్రమం, పదిరోజుల్లో పూర్తయింది.

డైరెక్టర్ దేశ్‌ముఖ్, పీతాంబరాన్ని, గురుమూర్తిని ఇతర టెక్నీషియన్లని, ఎంతగానో అభినందించాడు; వాళ్ళ కంపెనీకి చూపిన ఆదరణకి, సహకారానికి.

బొంబాయికి తిరిగి వెళ్ళిపోయే ముందురోజు హోటల్ బుహారీ రూఫ్‌గార్డెన్‌లో, దేశ్‌ముఖ్ గ్రేండ్ పార్టీ ఏర్పాటు చేశాడు: కృతజ్ఞతాసూచకంగా.

మద్రాసు ఫిలింకంపెనీల యాజమాన్యం, నటీనటులు, డిస్ట్రిబ్యూటర్లు, ఇతర ప్రముఖులు, టెక్నీషియన్లు, పార్టీకి హాజరయ్యారు.

ఈ పదిరోజులపాటు గురుమూర్తికి అరక్షణం కూడా తీరికలేకుండా, నిర్విరామంగా పనిచేశాడు.

పార్టీరోజున, లేపాక్షి ఫిలిం యూనిట్ వాళ్ళందరితోనూ, తీరికగా, కులాసాగా, ఖుషీగా, గడిపేడు గురుమూర్తి. ఆ రోజున ఒకరికొకరు పరిచయం చేసుకోడంలో గురుమూర్తికి ఒక వ్యక్తితో పరిచయం అయింది. అతనిపేరు మహేష్. తెలుగు స్వచ్ఛంగా, మాట్లాడుతున్నాడు.

ముందునుంచీ మహేష్, గురుమూర్తి మనస్సులో మెదులుతూనే ఉన్నాడు. ఎక్కడో బాగా పరిచయమున్న, అతిసన్నిహితుణ్ణి చూస్తున్నట్టుగా అతని మనస్సుకి అనిపిస్తూనే ఉంది.

ఆఖరికి గురుమూర్తి ఉండబట్టలేక, మహేష్‌ని అడగనే అడిగేశాడు. "మిమ్మల్ని ఎప్పుడో, ఎక్కడో, చూసినట్టు అనిపిస్తోంది నా మనస్సుకి అసలు, మీ ఊరు, పేరు, ఎక్కడా, ఏమిటీ అని!"

గురుమూర్తితో ముందునుంచి ఉన్న గొడవే ఇది. అతని మనస్సులో ఉన్న విషయం ఎదుటివాడిని అడిగేసి నిమిషాలమీద దాని సంగతి తెలుసుకునేదాకా అతనికి వెర్రెత్తిపోయినట్టు ఉంటుంది. అతను ప్రతీ విషయం అంత కూలంకషంగా అడిగి తెలుసుకుంటాడు కనుక వృత్తి రీత్యా అతనికి ఎంతో అనుభవం, పేరుప్రతిష్ఠలు సంపాదించి పెట్టేయి.

మహేష్ చప్పున గురుమూర్తిని, జబ్బపట్టుకుని ఒక మూలకి లాక్కుపోయాడు.

"నువ్వు ముందునుంచీ, నా గురించి ఆలోచిస్తూ, నన్ను గుర్తుపట్టలేకపోతూ సతమతమైపోయావన్న మాట! నాపేరు

నూకరాజు, మనం విజయవాడలో ప్రక్క ప్రక్క ఇళ్ళ వాళ్ళం. ఇప్పుడు గుర్తుపట్టేవా?" అన్నాడు రహస్యం చెపుతున్నట్టు.

"హరినీ! నువ్వట్రా నూకరాజూ!" అంటున్న గురుమూర్తి నోరుమూసేసి, "హుష్! అరవకు! మనం ఏకాంతంగా చాలా విషయాలు మాట్లాడుకోవాలి!" అన్నాడు.

గురుమూర్తికి అర్థంకానట్టు అయోమయంగా ఉండిపోయాడు.

ఆరోజు రాత్రి పార్టీ పూర్తయిన తరువాత, మహేష్‌గా, పేరు మార్చుకున్న నూకరాజు, గురుమూర్తి 'ఇలియట్స్' బీచ్‌లో కలుసుకున్నారు రహస్యంగా.

చాలాసేపు ఆప్యాయంగా, ఆత్మీయంగా చిన్ననాటి కబుర్లు, విషయాలు, విశేషాలు చర్చించుకున్నారు, మిత్రులిద్దరూనూ.

"అన్నట్టు ఒరేయ్! గురుమూర్తీ! ఎంతకాలమైంది నువ్వు మద్రాసు వచ్చి, సినిమా కంపెనీలో చేరి?" అన్నాడు నూకరాజు.

"అబ్బో! పన్నెండు సంవత్సరాలైపోయింది. ఇక్కడకి వచ్చి. అప్పటినుంచి ఇలా కొట్టుకుంటూ వస్తున్నాను!" అన్నాడు గురుమూర్తి.

"ఇప్పటివరకు ఏమాత్రం సంపాదించావు" అన్నాడు నూకరాజు.

"సంపాదనా! మరీ విచిత్రంగా మాట్లాడుతున్నావు! మద్రాసుకి వచ్చిన రెండు సంవత్సరాలవరకు తిండికి కూడా, మొహం వాచిపోయి నకనకలాడిపోయాను. సినిమా కంపెనీల చుట్టూ తిరగ్గా, తిరగ్గా ఆఖరికి ఆఫీసుబాయ్ అయ్యాను.

అలా మరో నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. అందరి మంచితనం, సహకారం సంపాదించుకుని, పట్టుదల, ఓర్పు ప్రదర్శించి, ఈనాటికి రెండుపూటలా ఇంత తిండికి లోటులేకుండా గడుపుకోగలిగే స్థితికి వచ్చాను!" అన్నాడు గురుమూర్తి.

"అదేమిట్రోయ్! నువ్వు ఎసోసియేట్ డైరెక్టర్‌వి కదూ!" అన్నాడు సూకరాజు ఆశ్చర్యంగా.

"అదంతా ఒక తమాషా లెద్దూ! పని బాగా తెలిసిన వాడిని కనుక అంతా తలో రకంగా వాళ్ళ స్వార్థంకోసం నన్ను ఉపయోగించుకుంటున్నారు. ప్రతీచోటా ఎదురు దెబ్బే! ఎవడూ మనకి పైకి రావడానికి సహకరించడు.

ఆఖరికి ఆ పీతాంబరంగారి దగ్గర నెలకి వెయ్యి రూపాయల జీతంమీద కుదిరేను. పని, తెలివితేటలు నావి, పేరు ప్రతిష్ఠ, డబ్బు, ఆయనవీనూ. సంపాదన మాట ఎలా ఉన్నా ఫీల్డులో మంచి పేరుమటుకు సంపాదించుకున్నాను. అన్నట్టు నీ సంగతి ఏమిటీ?" అన్నాడు గురుమూర్తి.

"నా పరిస్థితికూడా నీలాగే, ఏడుస్తోంది. మనం చిన్నప్పుడు సినిమా పరిశ్రమగురించి ఏవేవో పెద్దగా, గొప్పగా ఊహించుకునే వాళ్ళం. నా ఫోర్తుఫారం పరీక్ష పోగానే మానాన్న నన్ను చితక్కొట్టిపారేశాడు. దాంతో నాకు కోపం వచ్చి బొంబాయి పారిపోయాను.

బొంబాయిలో నేను ఎన్నో బాధలు పడ్డాను. అడ్డమైన గడ్డీ తింటూ, అడ్డమైన వాళ్ళ కాళ్ళూపట్టుకుని యమబాధలు పడ్డాను. ఇంటికి తిరిగిరావడానికి అభిమానం అడ్డొచ్చింది.

ఆఖరికి సినిమాప్రపంచకం మీదకి పోయింది నా దృష్టి. దానికోసం ప్రత్నించాను. ఆఖరికి నా ప్రయత్నాలు ఫలిం

చాయి. స్టూడియోల్లో నేను చెయ్యని పని అంటూ ఏదీ లేదు. ఎన్నో అడ్డుదారులు తొక్కేను ఎంతో నీచాతినీచమైన జీవితం గడిపేను.

అయినా సినిమా జీవితంమీద నాకు వ్యామోహం పోయిందికాదు. అలాగే స్థిరపడిపోయి, ఇంతకాలం గడుపు కుంటూ వచ్చాను. నిజానికి నాకన్నా నువ్వే నయం అనుకో! కనీసం నీకు ఒక అర్హత అనేది అఘోరించింది. పైగా అందరిలో నీకు మంచిపేరు, ప్రతిష్ఠలున్నాయి.

ఈ సినిమా ప్రపంచకం అంటే ఏమిటో, దానిలో వున్న కీలకం ఏమిటో, నాకు ఇప్పటికి కూడా అర్థమవటం లేదు. నాతో సినిమా రంగంలోకి ప్రవేశించిన వారు, నా తరువాత వచ్చిన వాళ్ళూ, హీరోలు, హీరోయిన్లు, పెద్దపెద్ద డైరెక్టర్లుగా, నిర్మాతలుగా మారిపోయారు. ఇప్పుడు వాళ్ళు లక్షలు, కోట్లు సంపాదించుకుంటున్నారు.

నేనూ, నాతోపాటు నువ్వుకూడా ఇలాగే వుండిపోయాం. అదృష్టం కనీసం మన యిద్దరిలో ఏ ఒక్కరికి కూడా పట్టినది కాదు!" అన్నాడు నూకరాజు.

"నిజమే!" అన్నాడు గురుమూర్తి బాధగా.

"అందుకని నేను ఒక పథకం తయారుచేశాను. నువ్వు నాతో సరిగ్గా సహకరించి, సంపూర్ణ సహకారాన్ని అందజేస్తే, మనంకూడా త్వరలోనే లక్షాధికారులమైపోతాం. కనీసం నా అంచనా ప్రకారం చెరో మూడులక్షల రూపాయిలైనా, సంపాదించుకోవచ్చు" అన్నాడు నూకరాజు.

"నిజంగానే? అది ఎలాగో?" అన్నాడు గురుమూర్తి ఆశ్చర్యంగా.

"ఎలా ఏముంది? చాలా సింపుల్? మీ మద్రాసు సినీఫీల్డు హీరోయిన్సుకి, హిందీఫీల్డుమీద యమమోజు. హిందీ హీరోలతో కలిసి నటించాలని, యావత్ భారత్‌దేశంలో అఖండకీర్తిని ఆర్జించాలని తెగమురిసిపోతారు. నేను ఇక్కడవున్న ఈ పదిరోజుల్లోనూ, తెలుసుకున్న నగ్న సత్యం యిది.

మన తెలుగుతెర మీద ప్రస్తుతం బాగా రాణిస్తున్న, డోమినేటింగ్ హీరోయిన్స్, యిద్దరు, అదే మల్లిక, పంకజం చాలా కుతూహలం చూపిస్తున్నారు హిందీఫీల్డు కూడా పావనం చెయ్యాలని.

ఈ మల్లిక, పంకజం వెనక బొంబాయి వచ్చి ప్రతీ డైరెక్టరు, ప్రతీ ప్రొడ్యూసరుని ఆశ్రయించారు. వాళ్ళ యిళ్ళకి తిరిగి తిరిగి, విసిగి వేసారిపోయి పని జరక్క మళ్ళీ మద్రాసుకి వచ్చి తోక జాడించుకుని వచ్చేశారు.

మొన్న మా డైరెక్టర్ దేశ్‌ముఖ్‌ని కూడా కుదిపికుదిపి వదిలేరు. దేశ్‌ముఖ్ అలాగే చూద్దాం! అని గడుసుగా తప్పించుకున్నాడు!" అన్నాడు నూకరాజు.

"ఏం? ఎందుకని? మల్లిక, పంకజం యిద్దరూకూడా మంచి స్టార్‌వేల్యూవున్న హీరోయిన్లు కదా? వాళ్ళకి ఒక ఛాన్సు యివ్వచ్చుగా!" అన్నాడు గురుమూర్తి.

"నాన్‌సెన్స్! ఇటువంటి జిడ్డు ముఖాలు, హిందీ ఫీల్డులో గ్రూప్‌డేన్సర్స్‌గాకూడా కనిపించరు. వీళ్ళదశ బాగుండబట్టి ఇక్కడ యిలా వెలిగిపోతున్నారు."

"సరే! అయితే యిప్పుడు వీళ్ళ వెధవసొద ఎవడికి కావాలి? అసలు నీ పథకం ఏమిటో, లక్షలు కురిసే మార్గం ఏమిటో చెప్పు," అన్నాడు గురుమూర్తి కుతూహలంగా.

"చెప్తాను విను!" అంటూ చెప్పుకుంటూపోయాడు నూకరాజు.

అంతావిన్న గురుమూర్తి ముఖం ఆనందంతో చేటంతయి నూకరాజుని కౌగలించుకోకుండా వుండలేకపోయాడు.

3

ఒకరోజు పంకజం ఏదో ఒక పిక్చర్ తాలూకు షూటింగ్ విరామ సమయంలో, 'ప్రహ్లాద' స్టూడియోలో కూర్చుంది విశ్రాంతి తీసుకుంటూ, బాదంఘీరు సేవిస్తూ. అక్కడికి నడిచాడు గురుమూర్తి.

"హల్లో! గురుమూర్తిగారూ! ఏమిటి విశేషాలు? లేపాక్షి వాళ్ళు తీసిన సినిమా యింకా రిలీజైనట్టులేదు! యింకా కంప్లీటు కాలేదా!" అంది పంకజం.

"ఇంకా కొంచెం పేచ్‌వర్కు మిగిలిపోయిందిట. వచ్చే నెలలో రిలీజు చేస్తారని తెలిసింది!" అన్నాడు గురుమూర్తి.

"ఒహో! అలాగా!" అంది పంకజం ఒయ్యారంగా.

"అన్నట్టు మల్లికగారు ఈ మధ్య కనిపించటం లేదా! ఎక్కడికేనా వెళ్ళారా ఔట్‌డోరుకి!" అన్నాడు గురుమూర్తి.

"ఔను! ఒక కన్నడ చిత్రం ఔట్‌డోర్ షూటింగ్‌కి సింగపూర్ వెళ్ళింది!" అంది పంకజం.

"అరెరే! అలాగా! నాకు తెలియనే తెలియదే!" అన్నాడు గురుమూర్తి నీరసంగా.

"ఎందుకు? మల్లికతో అంత అవసరం ఏమొచ్చింది మీకు?" అంది పంకజం కుతూహలంగా.

మల్లిక, పంకజం, యిద్దరూ ఫీల్డులో ప్రత్యర్థులు వాళ్ళకివున్న రాజకీయాలు వాళ్ళకి వుండనేవున్నాయి.

"మరేం లేదు! బొంబాయిలో ఈ మధ్య ఒక కొత్త ప్రొడ్యూసర్ వెలిశాడు. అతను గుజరాతీ. తండ్రి ఈమధ్యనే పోయాడు. దాంతో కోట్లరూపాయిల ఆస్థికి ఏకైక వారసుడయ్యాడు. అతను, ఇప్పుడు స్వంతంగా కొన్ని చిత్రాలు నిర్మయించాలని మహావుబలాటపడి పోతున్నాడు.

హీరో, మిగిలిన వాళ్ళు అందరూ హిందీవాళ్ళే. హీరోయిన్ని మటుకు మన ఫీల్డులోంచి ఎన్నుకుందామని అనుకుంటున్నాడుట; వెరైటీకోసం.

దాంతో వేట ప్రారంభించాడు, సరైన హీరోయిన్ కోసం. నాకు బొంబాయిలో తెలిసిన ఒక ప్రొడ్యూసర్ని, రోజూ విసిగించి పారేస్తూంటే, నాకు తగిలించాడు ఆయన; ఈ క్రొత్త ప్రొడ్యూసర్ని.

నిన్ననే నాలో ఫోన్‌లో మాట్లాడి ఒక మంచి హీరో యిన్ని చూపించమని అడిగాడు.

పోనీ మల్లికగారిని హిందీ తెరకి పరిచయం చేద్దామని అనిపించింది నాకు. ఈ విషయం గురించి మల్లికగారు నాతో చాలాసార్లు అన్నారు; ఎలాగైనా అవకాశం వచ్చి నపుడు హిందీ తెరకి పరిచయం చెయ్యమని. ఇందులో నాదిపోయేది ఏముంది? ఆ తర్వాత ఆవిడ అదృష్టం!" అన్నాడు గురుమూర్తి.

త్రాగుతున్న బాదంఫీర్‌గ్లాసుని టీపాయ్‌మీద పెట్టేసి ఒయ్యారం ఒలకపోస్తూ కూర్చున్న పంకజం, చూస్తుండ గానే, నిటారుగా లేచి నిలబడిపోయింది, ఐ.జి. ఆఫ్ పోలీస్‌ని చూడగానే, హెడ్‌కానిస్టేబుల్ పొజిషన్‌లోకి వచ్చినట్టు.

"మరి నేను వస్తానండీ పంకజంగారూ! ఈ విషయం కనీసం, మల్లికగారింటికి ఫోన్ చేసేనా తెలియపరచాలి. అవసరమైతే, ఎక్కడున్నాసరే, షూటింగ్ కేన్సిల్ చేసుకునేనో బయలుదేరి వచ్చేస్తారు. ఇంటిదగ్గరనుంచి కబురు అందగానే!" అన్నాడు గురుమూర్తి అక్కడనుంచి బయలు దేరుతూ.

"గురుమూర్తిగారూ! నిజంగా హిందీ చిత్రానికి తెలుగు తారలకోసం వెతుకుతున్నారా?" అంది పంకజం ఆతృత కనబరుస్తూ.

"ఔను! నిజమేనండి! అతను బొంబాయి నుంచి నాలుగు రోజుల్లో ఇక్కడికి వచ్చేస్తున్నాడు. తీరా ఆ ప్రొడ్యూసర్ చూస్తే, ఈ బాధ్యత నామీద పెట్టేసి తప్పుకున్నాడు. ఎలాగో అర్థమవక తికమకపడిపోతున్నాను. పైగా పెద్ద మనుషులతో వ్యవహారం!" అన్నాడు గురుమూర్తి.

ఆ పరిస్థితిలో, ఆ క్షణంలో, తన హోదా, ఠీవి, దర్పం కోల్పోయి, మామూలు ఎక్స్ట్రా నటిలాగ మారిపోయింది పంకజం. ఆమెలోని కోరిక, కాంక్ష, ఆమెను చిత్తుగా ఓడించేయి.

"గురుమూర్తిగారూ! మీరు నామీద దయఉంచి, నాకొక సహాయం చెయ్యమని, మిమ్మల్ని మనస్ఫూర్తిగా అర్థిస్తున్నాను!" అంది.

"నన్నా! మీరా! ఎంతమాట!" అన్నాడు గురుమూర్తి.

"మీరు దయచేసి కాదనకండి! నాకు చాలా కాలంనుంచి హిందీనటిగా పేరు సంపాదించుకోవాలని, కోరికగా ఉంది. కాని సరైన అవకాశం, అదృష్టం కలిసిరాక, నా కోరిక కోరికలాగానే ఉండిపోయింది. ఈ క్షణంలో మీరు నా మీద

కనికరం చూపిస్తే, అచిరకాలంలోనే, నేను హిందీఫిలిం ఇండస్ట్రీలో ధృవతారగా వెలిగిపోగలను. ఏమంటారు?" అంది పంకజం. గురుమూర్తి ముఖంలోకి జాలిగా చూస్తూ.

"అదిసరే! నిజానికి మీకు ఈ కోరిక ఉందని నాకు తెలియక, నేను మల్లికగారి పేరు సూచించడం జరిగిపోయింది. ఇప్పుడు నేను చెయ్యగలిగేది ఏముందిచెప్పండి!" అన్నాడు గురుమూర్తి నొచ్చుకుంటున్నట్టు.

"మీరు తలుచుకుంటే చెయ్యలేనిది ఏముంది? మీకు ఎంతో పేరుప్రతిష్ఠలు ఉన్నాయి. అందరికీ మీరంటే ఎంతో గౌరవం. మీ మాట, సూచన ఎవరూ కాదనలేరు. ఈ విషయంలో మీరు నాతో సహకరించి, నన్ను ఆ క్రొత్త నిర్మాతకి పరిచయంచేసి నాకీ సదవకాశాన్ని ఇప్పించండి. మీరుచేసిన ఈ మహోపకారానికి నేను మీకు పారితోషికంగా యాభై వేలరూపాయిలు ఇస్తాను. అంటే ఇది లంచం అనుకుని నన్ను దయచేసి అపార్థం చేసుకోకండి!" అంది పంకజం బ్రతిమాలుతున్నట్టు.

నటిగా పంకజానికి ఎంతపేరుందో, అంతకి పదిరెట్లు అహంభావం కూడా ఉంది. అందరిని ఎంతో తేలికగా, చులకనగా చూస్తుంది. అలాంటిది పంకజం ఈరోజు కాళ్ళ బేరాలు ఆడుతోంది.

పంకజం పరిస్థితికి గురుమూర్తి మనస్సులో నవ్వుకున్నాడు. కొంచెంసేపు ఆలోచించినట్టు నటించి, "అలాగే ప్రయత్నిస్తాను! ఆ తరువాత మీ అదృష్టం!" అన్నాడు.

"అన్నట్టు గురుమూర్తిగారూ! ఈ విషయం అతి రహస్యంగా ఉంచాలి మనం. ఎందుకంటే ఈ సంగతి అందరికి తెలిసిపోతే, ప్రతీవాళ్ళూ, పోటీకి ఎగబ్రాకుతారు,

అప్పుడు నాకీ అవకాశం చేజేతులా జారవిడుచుకున్నట్టు అయిపోతుంది!" అంది పంకజం.

"మీరన్నది కూడా నిజమే! ఆ విషయం నేను ఆలోచించనేనాలేదు. అంతటి పెద్ద నిర్మాత ఇక్కడికి వస్తున్నాడంటే, పదిమందికి తెలియకుండా ఎలా ఉంటుంది? అతను మద్రాసులో అడుగుపెట్టిన మరుక్షణం, ఈ వార్త దావానలం లాగ వ్యాపించకమానదు! మరైతే ఏం చేద్దాం? మీరే ఆలోచించి చెప్పండి. మీ నిర్ణయం ప్రకారం చేద్దాం!" అన్నాడు గురుమూర్తి.

పంకజం కొంతసేపు దీర్ఘంగా ఆలోచించి, "ఒకలాగ చేస్తే బాగుంటుంది! అదేమిటంటే, ఆ నిర్మాత బొంబాయి నుంచి ఇక్కడకు రాగానే, తిన్నగా మా బంగళాకి తీసుకుపోయి, అక్కడే బస ఏర్పాటుచేద్దాం.

మిగిలిన కార్యక్రమం నేను చూసుకుంటాను. నాకు మటుకు ఆ నమ్మకం ధైర్యం ఉన్నాయి. ఎగ్రిమెంటు, కాంట్రాక్టు పూర్తిచేసుకుంటే మనకు ఏ ఇబ్బందీ ఉండదు.

మీరు మటుకు నా గురించి, నా ప్రతిభగురించి ఆయనతో బాగాచెప్పి, ఆయనకి నా మీద సదభిప్రాయం కలిగేలా చూడండి. అది మీ బాధ్యత. నా కంట్రాక్టు పూర్తయిపోగానే మీ పారితోషికం మీకు పువ్వుల్లో పెట్టి అందజేస్తాను సరేనా!" అంది పంకజం నవ్వుతూ.

"ఎగ్రీడ్! అన్నట్టు ఆయనకి ఏ లోటురాకుండా చూసుకోవాలిసుమా! అది మీ బాధ్యత!" అన్నాడు గురుమూర్తి.

"మీరు నాకు ఇంత చాదస్తంగా చెప్పాలా? నాకు తెలియదూ! మీరే చూస్తారుగా!" అంది పంకజం మత్తుగా నవ్వుతూ.

ఆల్ రైట్! మంచి హీరోయిన్‌ని సెలక్టు చేశానని, ఇవాళే బొంబాయికి ట్రంకాల్ బుక్ చేసి, ఆయన ఇక్కడికి బయలు దేరేరోజు మనకి తెలియచెయ్యమని చెప్తాను!" అన్నాడు గురుమూర్తి.

"సో! సీయూ ఎగెయిన్! అండ్ ఐ విష్ యు ఆల్ సక్సస్!" అంది పంకజం వెళ్ళిపోతున్న గురుమూర్తితో.

4

గురుమూర్తి నిర్ణయించిన రోజున నూకరాజు 'శాంతి లాల్' పేరుతో కోటికి పడగలెత్తిన ఏకైక వారసుడిలాగ వేషంమార్చుకుని మీనంబాకం ఏర్‌పోర్టులో అడుగుపెట్టేడు.

సహజంగా ఆజానుబాహువూ, స్ఫురద్రూపి, అయిన నూకరాజు వేషం అద్భుతంగా మార్చుకోవడంవల్ల, నిజంగా ఆగర్భశ్రీమతుండిలా నిండుగా, దర్పంగా కనిపించాడు; గురుమూర్తికి. పంకజం తృప్తిగా చూస్తూ ఉండిపోయింది క్షణకాలం.

గురుమూర్తి, పంకజం, ఏర్‌పోర్టులో నూకరాజుకి ఘన స్వాగతం ఇచ్చారు. మద్రాసు నగరానికి దూరంగా, సముద్రపు ఒడ్డున, అధునాతనంగా, కొత్తగా నిర్మించిన తన నాలుగు అంతస్థుల బంగళాకి, తన ఇంపాలా కారులో తీసుకువచ్చింది పంకజం.

నూకరాజుకి ఏర్‌పోర్టులోనే పరిచయంచేశాడు గురు మూర్తి, పంకజాన్ని: "దక్షిణ భారతదేశంలో అగ్రశ్రేణి నటీమణి ఆవి"

నూకరాజు ముఖంలో తృప్తి, ఆనందం తొణికిసలాడ్డం పంకజం, క్రీగంట గమనించి, 'హమ్మయ్య!' అనుకుంది మనస్సులో.

ఇంద్రభవనంలా, అపరస్వర్గంలా ఉన్న పంకజం బంగళాలోకి దారితీశాడు నూకరాజు; హుందాగా, రాజఠీవి ఒలకపోస్తూ.

పంకజం మేడమీదకి దారితీసింది. ఏర్ కండిషన్ గదిలోకి. అడుగుపెట్టగానే నూకరాజుకి హాయి అనిపించింది.

సిరిసంపదలతో తాండవించిపోతున్న పంకజం బంగళా, నూకరాజుని ఉక్కిరిబిక్కిరి చేసిపారేసింది.

"కూర్చోండి! ప్రయాణంలో అలసిపోయి వుంటారు. ఫలహారం తీసుకుని, కొంచెంసేపు విశ్రాంతి తీసుకోండి. నేను ఇప్పుడే వస్తాను. గురుమూర్తిగారూ! మీరు కూడా కూర్చోండి!" అని లోపలకి వెళ్ళింది పంకజం.

పావుగంట తరువాత పంకజం గదిలోకి ప్రవేశించింది. మేకప్ చేసుకుని గదిలోకి అడుగుపెట్టిన పంకజం, అప్సరసలా ఉంది.

పంకజం పులుముకున్న అత్తరువాసనలు గదిలో వ్యాపించి మత్తెక్కించేలా ఉన్నాయి.

నూకరాజు, పంకజం అందాన్ని, శరీర సంపదల్ని, వెర్రెత్తేలా, తినేసేలా చూస్తున్నాడు.

పంకజానికి కావలసిందే అది. తన అందం చూపి, మతి పోగొట్టుకోవాలి. తనమీద మోహంతో, తనకు దాసానుదాసుడై పోవాలి.

నూకరాజులో కనిపిస్తున్న, వాంఛ, కోరిక గమనించిన పంకజం హాయిగా నిట్టూర్చింది.

ఫలహారం చేస్తూ గురుమూర్తి పంకజం నటనా సామర్ధ్యం గురించి, ఆమె పేరుప్రఖ్యాతుల గురించి, ఆమె నటించిన చిత్రాలు, అందులో ఎవార్డు పొందిన చిత్రాలు,

శతదినోత్సవాలు చేసుకున్న చిత్రాలు, ఇతర దేశాలలో ప్రదర్శనకోసం, భారతదేశం తరపున పంపబడిన చిత్రాలు తాలూకు వివరాలు నైపుణ్యంగా వివరించిచెపుతూ పంకజం మీద అభిమానం కలిగేలా చేస్తున్నాడు.

పంకజం, గురుమూర్తికేసి కృతజ్ఞతగా చూస్తూ ఉండిపోయింది. నూకరాజు, పంకజం అందాన్ని చూస్తో పిచ్చెక్కిపోతున్నాడు.

సమయం చూసి పంకజం, గురుమూర్తికేసి చూపి కనుసైగ చేసింది.

"మీరు విశ్రాంతి తీసుకోండి. నేను మళ్ళీ సాయంకాలం వచ్చి కలుస్తాను. అప్పుడు మిగిలిన విషయాలు వివరంగా మాట్లాడుకుందాం!" అని లేచి నూకరాజు, పంకజం దగ్గర శెలవు తీసుకుని బైటకి నడిచాడు గురుమూర్తి.

గది తలుపులు మూసి పంకజం వయ్యారం వొలకపోస్తూ నూకరాజు దగ్గరకు నడిచింది.

నూకరాజు ఆకలిగొన్న పులిలా పంకజంమీద పడ్డాడు. పంకజం కిలకిలా నవ్వుతూ బెడ్ రూంలోకి నడిచింది, నూకరాజుని గాఢంగా హత్తుకుపోతూ.

5

నాలుగురోజులపాటు నూకరాజుని బైటకి కదలనివ్వకుండా, తన బంగళాలోనే విందులు, వినోదాలు ఏర్పాటుచేసి స్వర్గంలో ముంచెత్తించేసింది.

తన అనుభవం, నేర్పు, ప్రదర్శించి నూకరాజుని దాసానుదాసుణ్ణి చేసుకుంది.

పంకజం అందానికి దాసుడైపోయినట్టు నటించి, తను

తీసే ప్రతీ చిత్రానికి పెరమెనెంట్ హీరోయిన్‌గా అంగీక రించినట్టు, ఎగ్రిమెంటు, కంట్రాక్టు తయారుచెయ్యమని, చెక్కు-బుక్కు తీసి అడ్వాన్స్‌గా పాతికలక్షల రూపాయలకి చెక్కు రాసి సంతకంపెట్టి గురుమూర్తికి అందచేశాడు; నూకరాజు.

పంకజానికి మతిపోయినట్టయింది. ఆనందంతో, సంతో సంతో ఉక్కిరిబిక్కిరై పోయింది.

గురుమూర్తికి సంతోషంగా, ఉదారంగా రెండులక్షల రూపాయలకి చెక్కురాసి సంతకంపెట్టి అందిస్తో, "మీరు చేసిన మహోపకారానికి 'చంద్రుడికో నూలుపోగులా' ఇది నా చిరుకానుక, పారితోషికం!" అంది పంకజం.

"ఎంతమాట! ఇందులో నేను చేసినది ఏముంది గనుక! కష్టమంతా మీదేగా!" అన్నాడు గురుమూర్తి చిలిపిగా, అందుకుంటూ.

* * *

పంకజానికి మెలుకువవచ్చేసరికి అంతా అయోమయంగా వుంది. తలంతా తిరుగుతున్నట్టు, ఒళ్ళంతా తూలిపోతున్నట్టు గానూ ఉంది.

లేచి నిలబడడానికి కూడా ఓపిక లేదు. నీరసంగా, నిస్సత్తువగా, మత్తుగా ఉంది.

తన పక్కన పరుపుమీద నూకరాజు కనిపించలేదు. "ఎక్కడికి వెళ్ళేడు శాంతిలాల్?" అనుకుంది, మనస్సులో.

బైట ఎండ నిప్పులు చెరుగుతోంది. ఎదురుగా గోడ గడియారం రెండుగంటలు కొట్టింది. గడియారంకేసి విసుగ్గా, పరీక్షగా చూపింది. మరోసారి తీక్షణంగా పరకా

యించి చూసింది.

అంతే! రివ్వుమని లేచి కూచుంది పరుపుమీద.

"రెండురోజులనుంచి నేను నిద్రలో, మగతలో గది పేశానా?" అనుకుంది.

ఖంగారుగా మంచం దిగి, గది బైటకు వచ్చి, మేడ మెట్లకేసి పరుగెత్తింది పడుతూ లేస్తూ.

క్రింద హాల్లో పనివాళ్ళు, తన తల్లి, తమ్ముడు అంతా ఒళ్ళు తెలియని నిద్రలో ఉన్నారు.

పంకజానికి పిచ్చెక్కిపోయేలాగ ఉంది.

"శాంతిలాల్, గురుమూర్తి ఏమయ్యారు? కనిపించరేం?" అనుకుంది.

మనస్సు ఎందుకో కీడుని శంకించింది.

ఓపిక, శక్తి కూడదీసుకుని, పది నిమిషాలలో, బంగళా అంతా గాలించి వెతికింది.

ప్రాణం పోతున్నట్టు, గుండె ఆగిపోతున్నట్టు అనిపించి ఒక్క పొలికేక పెట్టింది గట్టిగా, గుండెలు అవిసి పోయేలా.

ఆ తర్వాత అలా అరుస్తూనే ఉంది.

ఇంటిల్లిపాది లేచి ఖంగారుగా, తూలుకుంటూ పంకజాన్ని చుట్టుముట్టేరు.

"దొంగ వెధవలు. నా ఇంటిలో చేరి నా సర్వస్వం దోచుకున్నారు. నన్ను నమ్మించి ద్రోహం చేశారు. నన్ను నిలువునా ముంచేశారు. పది సంవత్సరాలపాటు, ఒళ్ళు గుల్ల చేసుకుని కష్టపడి సంపాదించుకున్న, నా పదిహేనులక్షల రూపాయల ఆస్తి దోచేసుకున్నారు." అంది పంకజం భోరున ఏడుస్తూ.

పంకజం తమ్ముడు రోషంతో బుసలుకొడుతూ "అక్కయ్యా! బాధపడకు. ఇప్పుడే పోలీసులకి ఫోన్ చేసి రిపోర్టు ఇద్దాం. ఆ శాంతిలాల్, గురుమూర్తి ఎక్కడున్నా సరే వెతికి పట్టుకుని తీసుకువస్తారు. ఎక్కడికి పారిపోగలరు వెధవలు. నిమిషాలమీద దొరికిపోరూ!" అంటూ పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ ఫోన్ దగ్గరకు నడిచాడు.

"ఒరేయ్! పోలీసు రిపోర్టు ఇస్తే ముందు జైల్లో నేను కూచోవాలి! అటువంటి తెలివితక్కువపనిమటుకు చెయ్యకు! నీకు పుణ్యం ఉంటుంది!" అని అరిచింది పంకజం.

సడన్ బ్రేకు నొక్కినట్టు ఆగిపోయాడు పంకజం తమ్ముడు, అర్థం అవనివాడిలా తెల్లబోయిచూస్తూ.

పంకజం స్పృహ కోల్పోయింది. ***

మీనా, రేఖ ఇద్దరు స్నేహితులు. సముద్రపు టొడ్డున సన్నటి ఇసుకలో మెల్లిగా నడుస్తున్నారు. మీనా వున్నట్టుండి ఇలా అడిగింది—

"ఏయ్... రేఖా! నీవెవరినయినా ప్రేమించావటే?"

"ఓ... ఒక్కరోజు గోపిని చూడకపోతే నా ప్రాణం విలవిలలాడిపోతుంది తెలుసా?" పళ్ళు రెపరెపలాడిస్తూ చెప్పింది రేఖ.

"ఆఁ... ...ఎవరే ఆ గోపీ? ఎక్కడుంటాడు? అందగాడేనా?" ఆతృతగా అడిగింది మీనా.

"మా ఇంట్లోనే! మా అక్క కొడుకు, నాలు గేళ్ళవాడు." సమాధానమిచ్చింది రేఖ.

—యం. వీరాస్వామి, మల్కాజిగిరి.

కోకిల

శశిభూషణ్

ఉదయం పదిగంటలైంది.

కాలేజీ వరండాలో భరత్, కోకిల ఒకరినొకరు గుద్దుకున్నారు. ఇద్దరూ తలలు వంచుకొని నడుస్తున్నారేమో.... "సారీ" అన్నాడు భరత్ ఆక్సిడెంట్ జరిగిన వెంటనే.

కళ్ళలోంచి నిప్పులు రాల్చింది కోకిల. "ఛీ!" చరచర అడుగులేస్తూ భరత్‌ని దాటి వెళ్ళిపోయింది.

వరండాలో అక్కడక్కడ వున్న విద్యార్థులు ఘొల్లున నవ్వారు ఒక్కసారిగా. తన క్లాస్ రూంవైపు వెళ్తున్న కోకిలకు ఆ నవ్వులు విన్పించే వుంటాయి.

"స్టుపిడ్స్.... ఎందుకలా ఏడుస్తున్నారు?" దగ్గర్లోనున్న ఇద్దరు విద్యార్థులు నవ్వులు ఆపేశారు భరత్ కోపం చూసి.

ఏదో ఆలోచిస్తూ తన క్లాస్‌రూం చేరుకున్నాడు భరత్. ఆ వేళంతా అతను కోకిల గురించే యోచించాడు.

కావాలని తను ఆ క్లియోపాత్రాని గుద్దుకోలేదు. తనూ వాంటెడ్‌గా అటువంటి పనికి సిద్ధపడి వుండదు. పొరబాటున జరిగిపోయింది. తను 'సారీ' కూడా చెప్పాడు. డర్టీ బిచ్.... ఎంత పొగరు దానికి? 'ఛీ' అంటుందా పదిమంది వినేలా? ఛ! ఛ!

క్లాసులో లెక్చరర్స్ ఆరోజు ఏం చెప్పారో భరత్‌కి తెలియదు. జరిగిపోయిన సంఘటనే పదేపదే అతని కళ్ళ ముందు కన్పిస్తూ వెక్కిరిస్తోంది.

ఇంకా నయం. 'ఛీ' తోటే ముగించేసింది. చెంప పగలగొట్టడమో, చివరికి నేలమీద వుమ్మెయ్యటమో చెయ్య లేదు. చేసివుంటే.... ఆ తర్వాత ఆలోచించలేకపోయాడు భరత్.

ఆ సాయంత్రము భరత్ ప్రాణస్నేహితుడైన ఆచారిని కల్సుకుంది కోకిల - కాలేజీ వదిలాక.

ఇద్దరూ ప్రక్కప్రక్కనే నడుస్తూ కాలేజీ ఆవరణం దాటి రోడ్డెక్కారు.

"ఏమిటి మేడమ్! ఏదో మాట్లాడాలన్నారు...." సంభాషణ ప్రారంభించాడు ఆచారి.

ఇంతలో భరత్ స్కూటర్ వీరిని దాటి వెళ్ళిపోయింది. భరత్ వీళ్ళని గమనించాడో, లేదో మరి!

"ఆ స్కూటర్‌మీద వెళ్తున్న యువరాజు గురించి...." అని ఊరుకుంది కోకిల.

భరత్ ఎలాంటివాడో ఆచారికి తెల్సు. ఏదో జరిగి వుంటుందని భయపడ్డాడతను. "ఆపేశారేం? చెప్పండి!"

"ఆ భరత్ మీ ఫ్రెండ్ కదూ?"

"మామూలు స్నేహితుడు కాదు. ప్రాణస్నేహితుడు."

"అందుకే మీకు చెపుతున్నాను. మీ ఫ్రెండ్ ఒంట్లో కొవ్వు ఎక్కువైనట్లుంది. త్వరగా వివాహం చేసుకోమని చెప్పండి. లేకుంటే అతనికే ప్రమాదం!"

ఆచారి ఏదో అడగబోయాడు. అతనికా అవకాశం ఇవ్వకుండా కోకిల అటుగా వచ్చిన ఖాళీ రిక్షాని ఆపి ఎక్కి కూర్చుంది.

ఆచారి చూస్తుండగానే కోకిల ఎక్కిన రిక్షా కదిలి క్షణాలమీద దూరమైపోయింది.

ఆటో ఎక్కి భరత్ ఇంటికి బయలుదేరాడు ఆచారి. లాన్‌లో టీ చప్పరిస్తూ కన్పించాడు భరత్.

"రావోయ్.... ఇంటి ముఖమైనా చూడకుండా తిన్నగా ఇటువైపే వచ్చినట్టున్నావ్?" ఆచారిని సాదరంగా ఆహ్వానించి, కూర్చోమని కుర్చీ చూపించాడు భరత్ - మరొక కప్పు టీ తీసుకురమ్మని పనిమనిషికి విన్పించేలా అరిచి చెప్పి.

టీ తాగాడు ఆచారి. నెమ్మదిగా కోకిల తనతో అన్న మాటలు చెప్పాడు.

నవ్వేశాడు భరత్, ఉదయం జరిగిన సంఘటన గురించి చెప్పాడు.

ఏదో బరువు తలపైనుంచి తొలగిపోయినట్టు ఫీలయ్యాడు ఆచారి. ఇద్దరూ కబుర్లలో పడ్డారు. క్రికెట్, క్రైం సాహిత్యం, రాజకీయాలు.... వారి కబుర్లలో ఎన్నో విషయాలు చోటు చేసుకుంటున్నాయ్.

ఇద్దరూ ఫైనల్ బి.ఎ.,లో వున్నారు. వారి స్నేహం ఇప్పటిది కాదు. హైస్కూల్‌నుంచి క్లాస్‌మేట్స్. అంత క్రితం స్ట్రీట్‌మేట్స్.

ఏడాది క్రితంవరకు ఇద్దరూ ఒకే వీధిలో వేరువేరు ఇళ్ళలో వుండేవారు. భరత్‌కి ఈ మధ్యనే అనుకోకుండా లాటరీలో రెండు లక్షల రూపాయలు వచ్చేసరికి ఆ వీధిని వదిలేశాడు. ఆ పాత ఇంటిని అద్దెకు ఇచ్చేసి, ఊరికి దూరంగా అందమైన బంగ్లా కట్టించుకున్నాడు.

ఆచారి విషయం వేరు. అతను మితభాషి. తన తండ్రి పోలీస్ ఇన్‌స్పెక్టర్ కావటంతో అతనికి మంచి మిత్రుడే ఏర్పడ్డారు - ఏర్పడుతున్నారు.

వాళ్ళిద్దరి మనస్తత్వాల్లో కొంచం తేడా వుంది. ఆడదంటే విలాసవస్తువు కాదని, మనసు, వ్యక్తిత్వం కలిగిన మనిషని వాదిస్తుంటాడు ఆచారి. భరత్ ఆ ఒక్క విషయంలో మాత్రం తన స్నేహితునితో ఏకీభవించడు.

చిన్నప్పుడే తండ్రి ప్రేమకు దూరమైన భరత్, ఎప్పుడూ పూజగదిలో కాలం గడిపే తల్లికి తెలియకుండా ఎన్నో గ్రంథాలు చదువుకుంటున్నాడు - ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కాకపోవటంతో.

2

ఆదివారం.

స్నానం, బ్రేక్‌ఫాస్ట్ వగైరాలు ముగించుకొని, ఇంట్లోంచి బయటపడ్డాడు ఆచారి. మార్నింగ్ షోకి బయలుదేరాడు. వీలైతే భరత్ వాళ్ళింటికెళ్ళి అతన్ని కూడా లాక్కెళ్ళాలని యోచిస్తూ వీధిలోకి వచ్చాడు.

ఇంతలో భరత్ స్కూటర్ సర్రున దూసుకొచ్చి ఆచారి ప్రక్కన ఆగింది.

"ఎక్కడికోయ్ బయలుదేరావ్?" భరత్.

"మార్నింగ్ షోకి. లెట్స్ గో!"

"వెనక తగలడు.... సినిమా పిచ్చి తప్ప. మరొకటి తెలియదు నీకు."

స్కూటర్‌మీద వెనుక సీట్లో కూర్చున్నాడు ఆచారి. స్కూటర్ వెనుదిరిగింది. ఐదు నిమిషాల్లో వెళ్ళి ఆగింది - అప్సర రెస్టారెంట్ బార్ ఆవరణంలో.

"కొంప ముంచావు కదరా!" స్కూటర్‌కి స్టాండ్ వేస్తున్న భరత్ ప్రక్కకొచ్చి నిలబడ్డాడు ఆచారి. "సినిమా ప్రోగ్రాం కేన్సిల్ అయినట్టేనా?"

"ఇంకా సందేహమా?" ఆచారి చేయి పట్టుకొని బార్‌లోకి నడిచాడు భరత్. ఖాళీగానున్న ఓ బల్లముందు కూర్చున్నారు ఇద్దరూ.

వెయిటర్ వచ్చాడు.

"విస్కీ, ఐస్‌క్యూబ్స్, కాజూనట్స్...." చెపుతున్నాడు భరత్.

విసుగ్గా వుంది ఆచారికి.

"నీవేం తీసుకుంటావ్?"

భరత్‌ని చూశాడు ఆచారి. "బుద్ధిలేదు నీకు. నెలకొకసారి తాగుతానని చెప్పావ్. ఈ నెల కోటా అయ్యింది. మళ్ళీ తయారయ్యావ్...."

"సర్లేవోయ్! ఏం తీసుకొంటావ్?"

"బీర్ చాలు."

వెయిటర్ వెళ్ళిపోయాడు. మిత్రద్వయం కోరినవి తీసుకొచ్చి బల్లమీద వుంచాడు. "సర్! ఇంకేమైనా కావాలా?" వినయంగా అడిగాడు.

అవసరం లేదని చెప్పి, వెయిటర్‌ని పంపేశాడు భరత్.

ఒక రౌండ్ అయ్యింది. ఆచారి బీర్‌మాత్రం తీసుకుంటు

న్నాడు. రెండో రౌండ్ మొదలైంది.

సిగరెట్ తీసి పెదవులమధ్య ఇరికించుకున్నాడు భరత్. అగ్గిపుల్ల వెలిగించబోయి మానేశాడు. హఠాత్తుగా ఏదో విషయం గుర్తొచ్చినట్టు సిగరెట్ తీసి చేత్తో పట్టుకున్నాడు.

"కోకిలమీద నీ అభిప్రాయం ఏమిటి?"

"ఎవరా కోకిల?" సిగరెట్ వెలిగించుకున్నాడు ఆచారి.

భరత్-కోకిల కాలేజీలో ఒకరినొకరు గుద్దుకొని వారం రోజులు కావస్తోంది. కోకిలను ఎప్పుడో మర్చిపోయాడు ఆచారి.

"అదే.... కత్తిలేని కారు నలుపు.... సెకండ్ బి.ఎ.,లో ఏడుస్తున్న అందాల తార...."

కోపంగా చూశాడు ఆచారి. "ఆ సంగతి నీ వింకా మర్చిపోలేదా?"

తల అడ్డంగా వూపాడు భరత్. "కోకిలను అనుభవించి ఆ తర్వాత మర్చిపోతాను."

అదిరిపడ్డాడు ఆచారి. "స్పృహలో వుండే.... నీకు కైపు ఎక్కినట్లుంది...."

నవ్వాడు భరత్. "పిచ్చిపిచ్చిగా వాగక!"

"ఆ మాట నేననాలి!"

"చెప్పేది విను" సిగరెట్ వెలిగించుకోవటం మర్చిపోయాడు భరత్. "కోకిలమీద నాకు కోపం లేదు. ఆమె వైపైనా నేనెప్పుడూ చూళ్ళేదు. ఆ నలుపురంగు నాకు గిట్టదు. కాని. ఇపుడు నా నియమాలను కొన్నింటిని వదులుకుంటున్నాను. కోకిలవంటి అందవిహీనురాలితో అనుభవం ఎలా వుంటుందో తెల్సుకోవాలనుంది...."

"దిసీజ్ టూ బాడ్. ఆ అమ్మాయి పెళ్ళి కావాల్సిన పిల్ల.

మనకు జూనియర్. భరత్! నీవు వెళ్తున్న దారి మంచిది కాదు!" సీరియస్‌గా అన్నాడు ఆచారి.

"పూర్తిగా విను. కోకిల కావాలనే నన్ను రెచ్చగొడుతోందని నా అనుమానం. నిన్న సాయంత్రం షాపింగ్‌కి వెళ్ళాను. బట్టల దుకాణంలో.... అజంతా ఎంపోరియమ్‌లో కోకిల కన్పించింది. నేను షాప్‌లోకి వెళ్తుంటే ఆవిడ బయటికొస్తోంది. తిరిగి అక్కడ మళ్ళీ జరిగింది ఏక్సిడెంట్. ఆలోచించు. నేను కావాలని ఒక్కసారైనా గుద్దుకోలేదు."

భరత్ ఎలాటివాడైనా అతను తనతో ఎటువంటి పరిస్థితుల్లోనూ అబద్ధం చెప్పడని ఆచారికి తెల్సు.

"అయితే ఏం చేయాలంటావ్?"

"కోకిలను రేప్ చేస్తాను."

వినకూడని వార్త విన్నట్టు ముఖం చిట్లించాడు ఆచారి. "ఆమె కంప్లెయింట్ చేసిందంటే నీ భవిష్యత్తు ఏమవుతుందో తెలుసా?"

"కంప్లెయింటా? ఎవరికి? పోలీస్ కంప్లెయింటేనా?" గ్లాసులో మిగిలివున్న విస్కీ గొంతులో పోసుకున్నాడు భరత్. "ఇలాగే వెళ్తానని అనుకున్నావేమో! అనుకొని వుంటే నిన్ను మించిన ఫూల్ మనదేశంలో వుండడు. వేషం మార్చుకొని వెళ్తాను."

భరత్‌కి నాటకానుభవం వుందని ఆచారికి తెల్సు. "నాన్‌సెన్స్! ఆ అమ్మాయిమీద నీకు కక్ష ఎందుకురా?"

"కక్ష కాదు - కాంక్ష. నీకు తెలియదురా, ఆడది ఆడదే. క్రొత్త అనుభవంకోసం కోకిల వంటి ఆడపిల్లలు స్వాతి పక్షుల్లాగా ఎదురుచూస్తుంటారు. అవకాశాలు లేక ఎందరో నోరుమూసుకుంటున్నారు గాని, లేకుంటే నా వంటి వాళ్ళకు

క్షణం తీరిక వుండేది కాదు."

"అది జరగదు. ఇంపాజిబుల్."

తేలికభావం వ్యక్తమయ్యేలా నవ్వాడు భరత్. "సాధ్యమే నీవు నా దారికి అడ్డు రాకుంటే."

"అదికాదురా వెధవా! పాపం కోకిల...."

"స్త్రీని గురించి నీకు తెల్సింది చాలా తక్కువరా! చెప్పి చేసిన పనిని స్త్రీ హర్షించదు. బెదిరించో, మోసగించో, బలవంతంగానో ఆడదాన్ని అనుభవించటంలో థ్రిల్ వుంది. ఉదాహరణకి కోకిల సంగతే తీసుకుందాం. మారువేషంలో వెళ్ళి ఆమెను నేను అనుభవిస్తాననుకో. అప్పుడు తెలియదు ఆమెకు నేనెవరైనదీ. ఆ తర్వాత చెబుతాను. ఏం చేస్తుంది. ఏం చెయ్యలేదు. ఏదైనా చెయ్యాలని చూస్తే తనకే నష్టం!"

"రాస్కెల్! నీ ఏడుపేదో ఏడ్చుకోక రొంపిలోకి మళ్ళీ నన్నెందుకు లాగటం?" విసుక్కున్నాడు ఆచారి.

"డోంట్ వర్రీ! ఇందులో నీ పాత్ర అవసరమే లేదు. నేను చేయబోయేది చెప్పాను. అంతే."

"కోకిల ఈ మధ్యనే క్రొత్త ఎత్తుమడమల జోళ్ళు కొన్నట్టుంది. ఎందుకైనా మంచిది.... మరొకసారి ఆలోచించు."

నవ్వేశాడు భరత్ తన సమాధానం అదేనన్నట్టు.

3

"టక్.... టక్...." మంటూ వీధితలుపు కొడుతున్నారెవరో.

తన గదిలో మంచంమీద పడుకొని అపన చదువుతున్న కోకిల విసుగ్గా ముఖం చిట్లించింది. రాత్రి పదకొండు గంటలు కావస్తోంది. తిరిగి చప్పుడైంది వీధితలుపుమీద.

గదిలోంచి బయటికి వచ్చింది కోకిల. హాల్లో దీపం వెలిగించి రెండు క్షణాలు స్విచ్ బోర్డు దగ్గరే నిలబడింది. రెండో ఆట సినిమా కెళ్ళిన అమ్మ-నాన్న ఇంత త్వరగా రాలేరు. చివరికి సినిమా ఇంటర్ వెల్ కూడా అయివుండదు. వచ్చింది ఎవరై వుండొచ్చు?

ఆలోచిస్తూ వచ్చి, గడియతీసి తలుపు తెరిచింది. ముస్లిమ్ యువకుని వేషంలో నున్న భరత్ లోనికొచ్చాడు.

"ఎవరు నువ్వు?" రెండడుగులు వెనక్కు నడిచింది కోకిల.

"సాబ్ వున్నారా?" కంఠం మార్చి అడిగాడు భరత్.

"ఎవరు.... నాన్నగారా?"

అవునన్నట్లు తలాడించాడు భరత్. ఆ సమయంలో ఇంట్లో కోకిల ఒక్కతే వుందని అతనికి తెల్సు.

"లేరు" అని ప్రశ్నార్థకంగా చూసింది కోకిల.

"మాకి బాకీపైకం ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నార్ మీ నాన్నగారు ..."

"ష్! రేపు ప్రొద్దున రా!"

"అచ్చా! రేపు వుదయం వస్తాం. మీ నాన్నగారు వచ్చాక మేము వచ్చి వెళ్ళిన సంగతీ చెప్పండి."

అలాగేనన్నట్లు తలూపింది కోకిల.

"ఒక గ్లాస్ పానీ ఇస్తావా, అమ్మాయ్?"

మంచినీళ్ళు లేవని చెప్పలేక వంటగదిలోకి వెళ్ళింది కోకిల. ఇంతలో వీధి తలుపుమూసి, గడియ బిగించి, వంటగదిలోకి పరుగెత్తాడు భరత్.

అడుగుల చప్పుడు వినిపించి వెనుతిరిగి చూసింది కోకిల....

అందంగా కత్తిరించుకున్న గెడ్డం, జిన్నా టోపి, ఎడమ కంటిక్రింద పెద్ద పుట్టుమచ్చ. షర్ట్‌పైన వెయిస్ట్ కోటు, గళ్ళ లుంగీ, కాళ్ళకు హాఫ్ బూట్లు, మెడలో తాయెత్తు, చేతిలో సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె....నవ్వుతూ నిలబడున్న భరత్ కన్పించాడు.

కోకిల కెవ్వున అరవబోయింది. కాని, వ్యవధి చాల్లేదు. భరత్ ముందుకు దూకి ఒక చేత్తో ఆమె నోరు నొక్కేసి, రెండో చేత్తో ఆమెను భుజంమీదకు ఎత్తుకున్నాడు.

గింజుకుంటోంది కోకిల.

భరత్-కోకిల గదిలోకి ప్రవేశించాడు. కోకిలను మంచం మీదకు విసిరి మీదపడ్డాడు.

కాసేపు ప్రతిఘటించి చివరికి లొంగిపోయింది కోకిల.

పావుగంట తర్వాత—

సిగరెట్ వెలిగించుకున్నాడు భరత్. "అమ్మాయ్! ఈ సంగతి ఎవరికీ చెప్పక! చెపితే నాకు ఏం నష్టంలేదు."

కోకిల బదులు చెప్పలేదు. మంచంమీద బోర్లా పడుకుని శబ్దం రాకుండా ఏడుస్తోంది.

సిగరెట్ పారేసి, ఆ గదిలోంచి వచ్చేశాడు భరత్. అటు తర్వాత తాపీగా అడుగులేస్తూ ఆ ఇంట్లోంచి బయటపడ్డాడు.

భరత్ గదిలోంచి వెళ్ళిపోగానే ఏడుపు మానేసింది కోకిల. వీధి తలుపు గడియవేసివచ్చి, జరిగిపోయిన సంఘటనను తల్చుకుంటూ, కూనిరాగం తీస్తూ మంచంమీద వాలిపోయింది. పదినిమిషాలు విశ్రాంతి తీసుకొని జుట్టంతా చెరిపేసుకుంది. జాకెట్‌ని రెండుచోట్ల చింపుకొని, తలగడని నేలమీద పారేసింది.

అల్మేరాలోని పుస్తకాలను గదిలో అక్కడక్కడ

పారేసి, ఓసారి గదినంతా పరికించి చూసింది. తృప్తిగా తల పంకించి, గదిలోంచి బయటికొచ్చి హాల్లోనున్న ఫోన్ వైపు నడిచింది.

4

పోలీస్ స్టేషన్‌లో లాకప్‌రూంలో దిగులుగా కూర్చొని వున్నాడు భరత్. జరిగిపోయిన సంఘటనలు ఒక్కొక్కటే గుర్తొస్తున్నాయతనికి.

కోకిల ఇంటినుంచి బయటపడ్డాక తిన్నగా వచ్చి ఇల్లు చేరుకొన్నాడు తను. అమ్మ అప్పటికే నిద్రపోయింది. తను ఎక్కడెక్కడో తిరిగి ఏ అర్ధరాత్రికో ఇల్లు చేరటం అమ్మకి క్రొత్తకాదు. వేషం మార్చుకొని, సిగరెట్ వెలిగించుకున్నాడో లేదో ఇన్‌స్పెక్టర్ వూడిపడ్డాడు.

కోకిల. వాళ్ళింట్లో తను కాల్చిపారేసిన సిగరెట్‌పీక చిక్కిందట. ఇంకా తలుపులమీద, మరికొన్నిచోట్ల తన వ్రేలిముద్రలు వున్నాయని కోకిలే చెప్పిందట. తను మారు వేషంలో వెళ్ళిన సంగతి. కిక్కురుమనకుండా ఇన్‌స్పెక్టర్ వెంటవచ్చి ఈ చీకటికొట్లో కూర్చోక తప్పలేదు.

కో....కి....ల....దర్టీబిచ్! తన్ను మారువేషంలోవున్నా పసిగట్టేసిందన్నమాట! ఎలా ఈ ఆపదనుంచి బయట పడటం? రేప్ చేశాడనే నేరం మోపితే ఎన్నేళ్ళు పడొచ్చు శిక్ష? బాబోయ్....ఒక్క రాత్రికే పిచ్చెక్కుతోంది ఈ లాకప్‌లో. జైల్లో ఏళ్ళ తరబడీ ఎలా గడపటం?

తెల్లవారింది. ఎనిమిది....తొమ్మిది....పది గంటలైంది. అయినా భరత్ ఆలోచనలు పూర్తికాలేదు. పిచ్చి పిచ్చిగా వూహిస్తున్నాడు. జైలు జీవితం గురించి యోచిస్తూ హడలి పోతున్నాడు.

"భరత్!"

ఆ కంఠం విన్పించి తృళ్ళిపడ్డాడు భరత్. చటుక్కున తలెత్తి చూశాడు. కటకటాల కవతలివైపు ఆచారి కనిపించాడు.

స్నేహితుణ్ణి చూడగానే మరింతగా కృంగిపోయాడు భరత్. సెంట్రీ కటకటాల తలుపులు తెరిచాడు.

"భరత్! కమ్ అవుట్" ఆచారి.

సెల్లోంచి బయటికొచ్చాడు భరత్. "రేయ్....నన్ను అరెస్ట్ చేసింది మీ నాన్నగారే...."

"నా కన్నీ తెల్సు. నా జామీనుమీద నిన్ను వదిలారు. మా ఇంటికి వెళ్ళి మాట్లాడుకుందాం పద!"

తలొంచుకొని, స్టేషన్లోంచి ఆచారి వెనుకే బయటికి నడిచాడు భరత్.

5

ఆచారి గదిలో మిత్రద్వయం నెమ్మదిగా సంభాషించుకుంటున్నారు.

"రేయ్, భరత్! నీకు పొగరు ఎక్కువైందని కోకిల ఒకనాడు నాతో చెప్పింది. వెంటనే అది తగ్గడానికి పెళ్ళి చేసుకోవల్సిందని, లేకుంటే నీకే ప్రమాదమని కూడా సలహా ఇచ్చింది" విసుక్కున్నాడు ఆచారి. "నీకు బుద్ధి మాత్రం లేదని ఇన్నాళ్ళూ అనుకున్నాను. ముందు వెనుకలు...."

"అది కాదురా! ఈ గండంగడిచే మార్గం చూడు ముందు. అమ్మకి ఇంకా విషయం తెలియదు. తెలిస్తే గుండె ఆగి చనిపోతుంది. ప్లీజ్....ఏదో ఒక దారి నీవే చూడాలి!" ఆచారి చేతులు పట్టుకున్నాడు భరత్.

"చేతులు కాలాయ్. ఇపుడు ఏడ్చి ప్రయోజనం ఏముంది?

ఆవేళ నువ్వు బార్‌లో చెప్పిన మాటల్ని నే నెప్పుడో మర్చి పోయాను. తాగిన మత్తులో ఏదో వాగుతున్నావనుకున్నాను. స్కౌండ్రల్! ఆడపిల్లలతో....వాళ్ళ శీలంతోనా ఆట లాడ్డం?" ఇంకా కోపం తగ్గలేదు ఆచారికి.

ఏడుపువస్తోంది భరత్‌కి. "లాయర్‌ని కల్సుకుందామా?"

"ఆ పనీచేశాను. పోలీసులకు బలమైన ఆధారాలు వున్నాయ్. మారువేషానికి నీవు ఉపయోగించిన వస్తువులు, కోకిల ఇంట్లో లభించిన నీ వేలిముద్రలు, నువ్వు కాల్చి పారేసిన సిగరెట్ పీక...." నిట్టూర్చాడు ఆచారి. "నీకు శిక్ష తప్పించటం ఏ లాయర్‌కీ సాధ్యంకాదట. కొమ్ములు తిరిగిన డిఫెన్స్ లాయర్ రంగనాధంగారే చెప్పేశారు ఆ విధంగా."

భరత్ గుండెల్లో బాంబు బ్రద్దలైంది. ఆ ఊర్లో రంగ నాధంగారికి సాధ్యంకాదనిపించిన కేసును మరో లాయర్ తీసుకోడు. తీసుకున్నా ఫలితముండదని కుర్ర లాయర్లకందరికీ తెల్సు.

"అయితే ఏంచేద్దామంటావ్?" నూతిలోంచి మాట్లాడు తున్నట్టు విన్పించింది భరత్ కంఠం.

"అదే నాకూ అర్థంకావటంలేదు. మా నాన్నగారు డ్యూటీ విషయంలో ఎంత సిన్సియర్‌గా వుంటారో నీకూ తెల్సు. ఆయన ద్వారా మనకు జరిగే ఉపకారం ఏం వుండదు."

"అయితే నాకు శిక్ష తప్పదంటావా?" జీరగా ధ్వనించింది భరత్‌కంఠం.

"తప్పుతుంది. ఒకేఒక మార్గం వుంది. కాని, అందుకు నీవు సిద్ధంగా వున్నావో, లేదో నాకు తెలియదు" ఏదో

ఆలోచిస్తూ చెప్పాడు ఆచారి.

"ఏమిట్రా అది? ప్లీజ్....త్వరగాచెప్పు. ఎంతడబ్బు ఖర్చయినా ఫర్వాలేదు. ఎటువంటి పనికైనా, ఎవరికాళ్ళు పట్టుకోవటానికైనా నేను సిద్ధంగా వున్నాను."

"నీవుకాదు నేను పట్టుకుంటాను వెళ్ళి కోకిల కాళ్ళు. కంప్లెయింట్ ఆవిడ ఉపసంహరించుకుంటే సమస్యే వుండదు. కాని, అందుకు కోకిల మాటలతో అంగీకరించదు నీ కభ్యంతరం లేకుంటే ఆమెను పెళ్ళిచేసుకో!"

తృళ్ళిపడ్డాడు భరత్. వెంటనే మాట్లాడలేకపోయాడు. తను కోకిలను....ఆ కాకిని పెళ్ళిచేసుకొని సంసారం చెయ్య గలడా? అయినా జైలుకెళ్ళడంకంటే అదే మంచిదేమో!

"అది జరగనిపనిరా! నేను సిద్ధంగావున్నా కోకిల ఒప్పు కోవాలికదా!" అన్నాడు భయపడుతూనే.

"నువ్వు ఒప్పుకుంటేచాలు. కోకిలను నేను ఒప్పిస్తాను. అవసరమైతే ఆమె కాళ్ళు పట్టుకోవటానికైనా నేను సిద్ధమేనని ఇదివరకే చెప్పాను."

ఆచారివంటి మిత్రుడు తనకు చిక్కినందుకు ఒకవైపు సంతోషిస్తూ మరొకవైపు కృంగిపోతూ, "నీ ఇష్టం" అనేశాడు భరత్—వేరేదారి లేకపోవటంతో.

6

అటు తర్వాత సంఘటనలు చకచక జరిగిపోయాయ్.

కోకిల మెడలో తాళికట్టాడు భరత్. ఫ్రెండ్స్‌కి ప్రత్యే కంగా డిన్నర్ ఇచ్చాడు.

కంప్లెయింట్‌ని ఉపసంహరించుకుంది కోకిల.

కార్యం గదిలో—

అర్ధాంగిని కౌగిట్లోకి తీసుకుంటూ "నన్ను క్షమించ గలవా, కోకిలా!" అన్నాడు భరత్ సిగ్గును అవతలకునెట్టి.

భర్త ఛాతీమీద వాలిపోయి కళ్ళు మూసుకుంది కోకిల. "మీరే క్షమించాలి నన్ను. ఒకరాత్రి అంతా పోలీస్‌స్టేషన్‌లో వుంచాను కదా!"

నవ్వేశాడు భరత్. "అదిసరే! నిన్ను రేప్‌చేసింది.... అదే ఆ వేళ.... నేనేనని ఎలా తెల్సుకున్నావ్?"

"ఆ ముస్లిమ్ యువకుడు మీరేనని నాకు తెలిపింది— ఏమిటో తెలుసా? ఈ పుట్టుమచ్చ" అంటూ భర్త ఎడమ కంటి క్రిందున్న పుట్టుమచ్చని వేలితో రాసింది కోకిల.

తన అర్ధాంగి ఒంటిరంగు నలుపే అయినా, ఆమె తెలివి తేటలు ఎలాంటివో అనుభవపూర్వకంగా తెల్సి వచ్చాయి భరత్‌కి. మొదటిసారిగా కాలేజీలో, అటు తర్వాత బట్టల దుకాణంలో ఆక్సిడెంట్ జరగటానికి కారణం ఏమిటో ఎవరో కూడా అతనికి అర్ధమైపోయింది. 'డర్టీబిచ్....'అని గొణుక్కో-బోయి నాలుక కొరుక్కు-న్నాడు.

"కోకిలా! నువ్వే గెలిచావ్" అన్నాడు అర్ధాంగిచెవిలో నెమ్మదిగా.

"మరి నేను నల్లగా వుంటాను. ఆ వంకతో నా కెప్పుడూ దూరం కారు కదూ?"

"ఛ! ఇది నలుపుకాదు....చామనఛాయ. నిజం చెప్ప మంటే ఈ రంగే నా కెక్కు-వ ఇష్టం" భార్య చెంపల్ని అరచేతుల్లోకి తీసుకొని, పెదవులు చుంబించాడు భరత్.

మత్తుగా కళ్ళుమూసుకుంది-కోకిల విజయగర్వంతో. ***

"అబ్బాయి అపహరణ"

ఎల్. రామగోపాల్

"నమస్కారం." అన్నారు యిద్దరూ ఒకే సారి.

"నమస్కారం! కూర్చోండి!" అన్నాడు డిటెక్టివ్ హరగోపాల్.

ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు. "నా పేరు చక్రపాణి! ఈమె నా భార్య సునందిని!" అన్నాడా వ్యక్తి ఉపోద్ఘాతంగా.

తల ఊపి, "విషయం ఏమిటో చెప్పండి!" అన్నాడు డిటెక్టివ్ హరగోపాల్ సిగరెట్ వెల్గించి, వాళ్ళిద్దరి వైపు పరీక్షగా చూస్తూ.

అతనికి షుమారు నలభై ఏళ్ళుంటాయి. బక్క పల్చటి శరీరం, బట్టతల, రిమెలెస్ కళ్ళజోడు, టూత్ బ్రష్ మీసాలు, సిల్కు లాల్చీ, పంచ, కుడిచేతికి రెండు ఉంగరాలు, గోల్డుకెపెట్ రిస్టువాచి, చూడడానికి ధనవంతుడిలా వున్నాడు.

ఆమెకు ముప్పై ఏళ్ళుంటాయి. అక్కడక్కడా నెరసిన జుట్టు, కోలమొహం, పెద్దపెద్ద కళ్ళు, చిన్న పెదాలు. అందంగావున్నా, ఆమె మొహంలో విషాదం గూడుకట్టు కొనివుంది.

చక్రపాణి ఒకసారి చిన్నగా దగ్గి, "మా అబ్బాయిని ఎవరో ఎత్తుకుపోయారు!" అన్నాడు నెమ్మదిగా.

"వివరంగా చెప్పండి" అన్నాడు హరగోపాల్ కాస్త ముందుకు వంగుతూ.

చక్రపాణి రెండు నిముషాలు మౌనంగా వుండి పోయాడు.

"మాది చాలా సంపన్న కుటుంబం. మా అబ్బాయి రవికి రెండు సంవత్సరాలుకూడా నిండలేదు!" ఒక నిముషం మౌనంగావుండి మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

"సరిగ్గా పదిహేను రోజుల క్రిందట నాకొక వుత్తరం వచ్చింది. అందులో ఎవరో వ్యక్తి, తనకు పదివేలు ఇవ్వా లనీ, అలా యివ్వని పక్షంలో మా అబ్బాయి రవిని ఎత్తుకు పోతాననీ బెదిరిస్తూ ఉత్తరం వ్రాసాడు. ధనవంతులకు సామాన్యంగా ఇలాంటి ఉత్తరాలు మామూలే! ఆకతాయి పిల్లలు వుబుసుపోకకు యిలాంటి వుత్తరాలు వ్రాయడం కద్దు. ఆ ఉద్దేశంతోనే ఆ వుత్తరం చించి పడేసాను.

కాని ఆతర్వాత నాల్గురోజుల కల్లా యింకో వుత్తరం వచ్చింది. అందులో విషయం పాతదే అయినా, కాస్త కఠినంగా హెచ్చరించబడివుంది. అయినా నేను లెక్క చెయ్యలేదు. అందుకు కారణంవుంది.

నా ఇంటినిండా నౌకర్లు వున్నారు. మా అబ్బాయి రవిని కంటికి రెప్పలా కాచుకునే యిద్దరు ఆయాలువున్నారు. రవి

బైటకు వెళ్ళే అవసరం లేకుండా, ఆయాలే సాయంత్రం యింటిముందు తోటలో కాస్సేపు ఆడిస్తారు. యింతమంది బలగం వుండి బలహీనుడిలా ఎవరో బెదిరింపులకు లొంగిపోవడం సిగ్గనిపించింది. అందుకే ఆ వుత్తరాన్ని కూడా చించేసాను. కాని ఆతర్వాత ఎందుకైనా మంచిదని బాబును బైటకు తీసుకు వెళ్ళవద్దని అందరికీ ఆజ్ఞలు జారీచేశాను.

సరిగ్గా నాలుగురోజుల తర్వాత మళ్ళీ అలాంటి వుత్తరమే వచ్చింది. కాని, ఈసారి వుత్తరం చూడగానే చాలా ఆశ్చర్యపోయాను!" చెప్పాడు చక్రపాణి.

"ఏమని వ్రాశాడు!" ఆసక్తిగా అడిగాడు హరగోపాల్.

"తను వ్రాసిన రెండు వుత్తరాలను నిర్లక్ష్యం చెయ్యడం వల్ల, నా బిడ్డను అపహరించే స్థితి నేనే కల్పించానని, సరిగ్గా 13వ తేదీ మధ్యాహ్నం పన్నెండు గంటలకు మా అబ్బాయిని 'కిడ్నాప్' చేసి తీసుకువెళతానని, నాబిడ్డ నాకు దిక్కాలంటే, అదనంగా పాతికవేలు చెల్లించవలసి వుంటుందని వ్రాసాడు.

ఆ వుత్తరం చూడగానే చాల ఆశ్చర్యపోయాను. పట్టపగలు పన్నెండు గంటలకు, మా అబ్బాయిని ఎలా అపహరించగలడు? ఈ విషయంలో నాకే అనుమానం వచ్చింది. నా ఇంట్లోవున్న నౌకర్లే ఎవరైనా యిలా నాటకం ఆడుతున్నారేమోననిపించింది. వెంటనే అందర్నీ పిలిచి చీవాట్లు పెట్టి, ముఖ్యమైన వాళ్ళను తప్పించి మిగతా అందర్నీ తొలగించాను" చెప్పాడు చక్రపాణి.

"ముఖ్యమైన వాళ్ళంటే?" అడిగాడు హరగోపాల్.

"నా చిన్నతనం నుంచి మా యింట్లోనే వుంటున్న నౌఖరు గంగన్నను, ఆయా 'కమల'ను, వంటమనిషి

పంకజాన్ని తప్పించి, మిగతా అందర్నీ తొలగించాను" చెప్పాడు చక్రపాణి.

హరగోపాల్ తల ఊపి, "తర్వాత ఏం జరిగింది?" అడిగాడు.

"పన్నెండవ తేదీ నాభార్య కోరికపైన ఎందుకైనా మంచిదని, ఈ విషయం పోలీసులకు తెలియపర్చాను. పదమూడవ తేదీ, పదకొండు గంటలకల్లా తాము వస్తామని ఇనస్పెక్టర్ చెప్పారు. నాకు కొంత ధైర్యం వచ్చింది.

కాని ఆరోజు రాత్రి భోజనాలు కాగానే, నాభార్య విపరీత మైన కడుపునొప్పితో మెలికలు తిరిగిపోయింది. వెంటనే డాక్టరుకు కబురు పంపాను. డాక్టరు వచ్చి పరీక్షచేసి, ఏదో తినకూడని పదార్థం తినడంవల్ల అలా జరిగిందని, ఇంజక్షన్ యిచ్చి వెళ్ళాడు.

మరుసటిరోజు వుదయంకూడ నాభార్య మంచం మీద నుంచి లేవలేకపోయింది. ఎందుకైనా మంచిదని ఆరోజు వుదయంనుంచి రవిని నాదగ్గరే వుంచుకున్నాను. సరిగ్గా పదకొండు గంటలకల్లా ఇన్‌స్పెక్టరు, పోలీసులు వచ్చారు.

నేను, రవి మేడమీద గదిలో కూర్చొన్నాం. ఇన్‌స్పెక్టర్ మాతోపాటే గదిలో పచార్లు చేయసాగాడు, నల్గురు కానిస్టేబిల్సు యింటి ముందావరణలో గస్తీ తిరగ సాగారు.

సరిగ్గా పన్నెండు గంటలయింది. ఒక్కసారిగా నాలో ఆతృత, భయం పెరగసాగాయి. గోడగడియారం సరిగ్గా పన్నెండు గంటలు కొట్టేసరికల్లా, ఇంటి బయట వీధిలో ఏదో పెద్ద కలకలం విన్పించింది.

ఉలిక్కిపడి యిద్దరం కిటికీ దగ్గరగా వెళ్ళాం. ఎవరో

వ్యక్తి పోలీసుల చేతులనుంచి తప్పించుకోడానికి ప్రయత్ని స్తున్నాడు.

ఇన్‌స్పెక్టరూ, నేనూ, ఆతృతగా క్రిందకు దిగి వెళ్ళాం। ఆ వ్యక్తి గోడవారగా అనుమానాస్పదంగా తిరుగుతున్నాడని, అనుమానించి పట్టుకుంటే పారిపోవడానికి ప్రయత్నిస్తున్నాడని పోలీసులు చెప్పారు.

ఇన్‌స్పెక్టర్ ఆ వ్యక్తిని సోదా చేసాడు. అతని దగ్గర ఒక ఉత్తరం దొరికింది. అందులో, తాను మా అబ్బాయిని తీసుకువెళుతున్నానని, మొత్తం ముప్పై అయిదువేలు చెల్లిస్తేగాని, మా అబ్బాయి మాకు దక్కడని వ్రాసి ఉంది.

ఇనస్పెక్టర్ గద్దించి అడిగేసరికి అతను భయపడిపోయి అసలువిషయం చెప్పాడు ఎవరో స్త్రీ పదిగంటల ప్రాంతంలో తనకు ఆ ఉత్తరంతోపాటు పదిరూపాయలు ఇచ్చి, సరిగ్గా పన్నెండుగంటలకు, ఈ ఉత్తరాన్ని ఈ ఇంట్లో వాళ్ళకు అందజేయమని చెప్పింది। అన్నాడు ఆ వ్యక్తి వణికిపోతూ.

వెంటనే నా అనుమానం, నేను పనిలోనుంచి తీసివేసిన నౌఖర్లమీదకు వెళ్ళింది. కాని అంతలోనే ఒక విచిత్ర సంఘటన జరిగింది. అప్పుడే బయటకు వచ్చిన ఆయా 'కమల'ను చూపిస్తూ। అరిగో। ఆవిడే నాకా ఉత్తరం, డబ్బు ఇచ్చింది। అని అరిచాడు పెద్దగా.

నేను, ఇనస్పెక్టర్ కమలను బెదిరించాం। కాని కమల తనకేమీ తెలియదని, అతనెందుకు అలా అబద్ధం చెబుతున్నాడో అర్థంకావడంలేదని వాపోయింది. మరి కొద్ది సేపట్లోనే కమలమీద మా అనుమానం నా భార్య సాక్ష్యంతో పటాపంచలయింది.

ఉదయం తొమ్మిదిగంటల నుంచి, పన్నెండుగంటలవరకు

'కమల' తన మంచందగ్గరే ఉందని నా భార్య చెప్పింది. దాన్నిబట్టి, ఆ వ్యక్తి పొరబడి ఉండాలని, లేదా మరే ఉద్దేశ్యంతోనో అలా అబద్ధం చెప్పి ఉండాలని మేము నిర్ణయించుకున్నాం!" చెప్పడం ఆపి చిన్నగా నిట్టూర్చాడు చక్రపాణి.

"ఆ సమయంలో కమల నిజంగా మీ దగ్గర ఉన్నదా?" అడిగాడు హరగోపాల్ సునందిని వైపు చూస్తూ.

సునందిని తల ఊపి, "అవును! ఆ విషయంలో ఎలాంటి అనుమానమూ లేదు!" అంది దృఢంగా.

హరగోపాల్ తల ఊపి, "తర్వాత?" అడిగాడు.

"నాకు అనుమానం వచ్చి పరుగెత్తాను. గదిలో రవి లేడు. జరిగిందేమిటో అర్థంగాక ఒక్క క్షణం అచేతనంగా నిలబడిపోయాను. సరిగ్గా అప్పుడే చర్చిలో పన్నెండు గంటలు కొట్టారు. నేను మరింత ఆశ్చర్యపోయాను.

ఆ వ్యక్తి ఎవరైనాగాని, సరిగ్గా చెప్పినటైంకి మా అబ్బాయిని అపహరించుకొని వెళ్ళాడు. ఆలోచిస్తూ గోడ గడియారంవైపు చూచాను. పన్నెండుపది అయింది. పది నిముషాలు ఫాస్టు పోతుంది. నాకు తెల్సినంతవరకు అది 'కరెక్టు టైంకీపరు.' అలాంటిది ఆ రోజు పదినిమిషాలు ముందు ఎలా నడిచింది. అంటే ఎవరో తమకు అనుకూలంగా టైం మార్చిఉండాలి!

నా వెనుకనే ఇనస్పెక్టర్ గదిలోకి వచ్చాడు. జరిగిందంతా అతనికి చెప్పాను. వెంటనే తానా వ్యక్తిని పట్టుకొని, మా అబ్బాయిని అప్పగిస్తానని చెప్పి వెళ్లాడు. ఇప్పటికి రెండురోజులు గడిచిపోయాయి. ఇంతవరకు మా 'రవి'ని గురించి ఎలాంటి సమాచారమూ అందలేదు. అందుకే ఈ

రోజు నా భార్య కోరికమీద మీ సహాయంకోసం వచ్చాము" అన్నాడు చక్రపాణి చిన్నగా నిట్టూర్చి.

డిటెక్టివ్ హరగోపాల్ మాట్లాడలేదు. దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"నా బిడ్డను ఎలాగైనా రక్షించండి. కావాలంటే ఆ డబ్బు వాడి మొహానకొట్టయినా నా బిడ్డను నాకు దక్కించండి" అంది సునందిని దీనంగా.

"మీ అబ్బాయిని గురించి మీరేమీ భయపడకండి! అతనెవరైనాగాని, మీకంటే ఎక్కువగా మీ అబ్బాయిని చూచుకుంటాడు; బంగారు గుడ్లుపెట్టే బాతును ఎవ్వరూ చంపుకోరు." అని, "చక్రపాణిగారూ! ఈ సంఘటన జరిగిన సమయంలో మీ ఇంట్లో ఉన్న నౌఖర్లందరూ నమ్మకస్తులేనా?" అడిగాడు హరగోపాల్.

చక్రపాణి తలఊపి, "అందరూ నమ్మకస్తులే! వాళ్ళందరి మీద నాకు సదభిప్రాయం ఉంది. కాని గంగన్న అంటే మాత్రం నా భార్యకు ఇష్టంఉండదు!" అంటూ భార్యవైపు చూచాడు.

"ఎందుకో తెల్సుకోవచ్చా?" అడిగాడు హరగోపాల్ సునందినిని.

సునందిని పెదిమవిరిచి, "ఎందుకో తెలియదు. కాని అతన్ని చూస్తుంటే నాకెందుకో సదభిప్రాయం కల్గడంలేదు. ఈ కుట్రలో అతని చెయ్యి ఉండవచ్చని నా అభిప్రాయం!" అంది నెమ్మదిగా.

హరగోపాల్ తలఊపి, "ఆల్‌రైట్! మీ అడ్రస్సు ఇచ్చివెళ్ళండి. ఒకసారి మీ ఇంటికివచ్చి అందరితో మాట్లాడాలి," అన్నాడు.

చక్రపాణి అడ్రసు వ్రాసిచ్చాడు. ఇద్దరూ నమస్కరించి వెళ్ళిపోయారు.

2

కారాపి క్రిందకు దిగి, ఎదురుగాఉన్న ఇంటివైపొకసారి చూచాడు డిటెక్టివ్ హరగోపాల్.

చాలా పెద్ద భవంతి అది. చుట్టూ ఎత్తైన ప్రహరీ. భవంతిముందు అందమైన పూలతోట. చాల ఆకర్షణీయంగా వుంది.

నెమ్మదిగా లోపలికి నడిచాడు హరగోపాల్.

"రండి! రండి!" ఆహ్వానించాడు చక్రపాణి ఆప్యాయంగా.

"మీ అబ్బాయి అపహరించబడిన గది ఒకసారి చూపించండి" అన్నాడు హరగోపాల్.

"రండి!" అంటూ చక్రపాణి ఒక గదిలోకి ధారితీసి, "ఇదే" అన్నాడు.

హరగోపాల్ గదంతా ఒకసారి పరీక్షగా చూశాడు. విశాలమైన గది కాకపోయినా, అందంగా, నీటుగా ఉంది. గదిలో ద్వారానికి ఎదురుగా గోడకు గడియారం వ్రేలాడుతుంది. గది మధ్యగా రెండు సోఫాలు, ఒక టీపాయ్ ఉన్నాయి.

కిటికీ దగ్గరగా వెళ్ళి బైటకు చూశాడు హరగోపాల్. అక్కడనుంచి విశాలమైన పూలతోట, వీధిగేటు కనిపిస్తున్నాయి.

"ఇక్కడినుంచేనా మీరా వ్యక్తిని చూచింది?" అడిగాడు హరగోపాల్.

చక్రపాణి తల ఊపి, "అవును. సరిగ్గా-ఆపూల చెట్టు

దగ్గర పోలీసులు ఆ వ్యక్తిని పట్టుకొని ఉండగా నేను, ఇన్‌స్పెక్టర్ చూచాం!" అన్నాడు చక్రపాణి.

హరగోపాల్ ఒక్క నిముషం ఆలోచించి, "మీరు చెప్పిందాన్నిబట్టి ఆలోచిస్తే, ఆ వ్యక్తి, పన్నెండు గంటలకు ముందుగానే మీ ఇంట్లో జొరబడి ఎక్కడో దాక్కొని ఉండాలి. మీ దృష్టి మరలించి, మీరు బయటకు వెళ్ళగానే మీ అబ్బాయిని అపహరించుకు వెళ్ళి ఉండాలి" అన్నాడు.

"ఇంతమంది ఉండగా మా ఇంట్లో ఎక్కడ? ఎలా దాక్కుంటాడు?" అడిగాడు చక్రపాణి.

"మీ ఇంట్లో ఏదైనా మీరు వాడుకోని గది ఏదైనా ఉందా?" అడిగాడు హరగోపాల్.

చక్రపాణి తల ఊపి, "దీనిపక్కన వున్న గది మేము వాడడంలేదు. అందులో విరిగిపోయిన ఫర్నిచర్ వేసి పెట్టాము" అన్నాడు.

"ఒకసారి ఆ గది చూద్దాం రండి!" అన్నాడు హరగోపాల్ బైటకు దారితీస్తూ.

ఆ గదికి తాళం వేసిలేదు. ఊరికే గడియ పెట్టివుంది. తలుపులు తెరిచి ఇద్దరూ లోపలికి వెళ్ళారు. గదంతా శుభ్రంగా ఊడ్చినట్లుగా ఉంది.

డిటెక్టివ్ హరగోపాల్ గదంతా పరీక్షగా చూశాడు. గదిలో ఒక మూలగా దుమ్ము పేరుకుపోయి ఉంది. అక్కడకు వెళ్ళి పరీక్షగా చూచాడు. అడుగుల జాడలు ఏమీ కన్పించలేదు. కాని ఏవో చిన్నచిన్న గుర్తులు కన్పించాయి. కనీసం అవి పిల్లిపిల్ల అడుగులు కూడ అయి ఉండడానికి అవకాశంలేదు. అంత చిన్నవిగా ఉన్నాయి గుర్తులు. ఆలోచిస్తూ గదిబైటకు వచ్చాడు హరగోపాల్.

"చక్రపాణిగారూ! ఈ ఇంటికి, ముఖద్వారం ఇదికాక వెనుకవైపు ఏదైనా ద్వారం ఉందా....?" అడిగాడు హరగోపాల్.

చక్రపాణి తల ఊపి, "అవును. ఆ ద్వారంగుండానే రవిని అపహరించుకు వెళ్ళి ఉండాలి" అన్నాడు.

హరగోపాల్ తల వూపి, "ఒకసారి మీ ఆయా కమలను పంపించండి" అన్నాడు సిగరెట్ వెలిగిస్తూ.

చక్రపాణి తల వూపి, వెళ్ళిపోయాడు. రెండు నిముషాల తర్వాత కమల గదిలోకి వచ్చింది.

"అలా కూర్చో!" అన్నాడు హరగోపాల్ ఆమెవైపు పరీక్షగా చూస్తూ.

కమలకు పాతికేళ్లుంటాయి. చామనచాయ శరీరం. అందగత్తె కాకపోయినా, అందవికారంగా మాత్రం లేదు.

"ఎంతకాలంనుంచి నువ్విక్కడ పనిచేస్తున్నావ్?" అడిగాడు ఆమెవైపు సూటిగా చూస్తూ.

"పదిహేను సంవత్సరాలనుంచి, అంటే నా చిన్నతనం నుంచి పని చేస్తున్నాను" అంది కమల నెమ్మదిగా.

"మీ యజమాని కొడుకు రవి అపహరణ గురించి నువ్వేమైనా చెప్పగలవా?" అడిగాడు హరగోపాల్.

కమల తల అడ్డంగా ఊపి, "నాకేమీ తెలియదు. నేనేమీ చెప్పలేను!" అంది నిశ్చలంగా.

హరగోపాల్ నవ్వి "ఆల్‌రైట్ చిన్న ప్రశ్న. మీ యింట్లో అంటే యిక్కడ ఏవైనా చిన్నచిన్న జంతువులు ఉన్నాయా?" అడిగాడు.

"అంటే పిల్లిపిల్లలా?"

"కాదు! ఇంకా చిన్నవి."

"అలాంటివేం లేవు. బాబుకు ఆడుకునే వస్తువులు తప్పించి యింట్లో కనీసం ఎలుకపిల్లలు లేవు!" అంది కమల.

హరగోపాల్ తల ఊపి, "ఆల్‌రైట్! ఇక నువ్వు వెళ్ళవచ్చు!" అన్నాడు. కమల నమస్కరించి వెళ్ళిపోయింది.

డిటెక్టివ్ హరగోపాల్ ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఉన్నట్లుండి ఏదో ఆలోచన వచ్చి, చకచక బయటికి వెళ్ళిపోయాడు.

3

"హరగోపాల్‌గారూ! ఏమైనా తెల్సిందా?" అడిగాడు చక్రపాణి, హరగోపాల్ తిరిగి రాగానే.

"మీ అబ్బాయిని అపహరించిన వ్యక్తి దొరికాడు!" అన్నాడు హరగోపాల్ నవ్వుతూ.

"ఎవరు?" ఆతృతగా అడిగాడు.

"మీరే ఆ వ్యక్తి...." అన్నాడు హరగోపాల్ నవ్వుతూ.

"వాట్ నాన్సెన్స్ యువార్ టాకింగ్! మా అబ్బాయిని నేను 'కిడ్నాప్' చెయ్యడం ఏమిటి?" అడిగాడు కోపంగా.

"సారీ మైడియర్ చక్రపాణి. నీ తెలివి అమోఘం. కాని నీ బండారం బైటపడింది. నీ నేరాన్ని రుజువులతోసహా నిరూపించగలను!" అన్నాడు హరగోపాల్.

"ఏమిటా రుజువులు?" ఎకసెక్కంగా అడిగాడు చక్రపాణి.

"చెబుతాను. మొట్టమొదట నీమీద అనుమానం కల్గించిన విషయం గోడగడియారం. అది 'కరెక్ట్ టైంకీపర్' అని

నువ్వు ఒప్పుకున్నావ్। దాన్ని పది నిముషాలు 'ఫాస్ట్' త్రిప్ప డానికి నీ కొక్కడికే అవకాశం ఉంది.

నీవు ఆడంబరంగా బ్రతుకుతున్నా. ఈ ఆస్తి నీదికాదు. అంతా నీ భార్యది. నీ ఆడంబరాలకు లొంగిపోయి, అప్పులు చేశావ్। అవి తీర్చే మార్గం కన్పించలేదు. అప్పుడే నీకీ అయిడియా వచ్చింది.

నీవై నీవే ఉత్తరాలు వ్రాసుకొని, నీ భార్యకు చూపించి ఉంటావ్। కాని ఆమె లక్ష్యపెట్టకపోవడంవల్ల, ఏదో నెపం మీద నీకు అడ్డుగా ఉన్న నౌఖర్లను అందర్నీ తొలగించి, నీకు సహాయంచేసే గంగన్నను మాత్రం ఉంచుకున్నావ్।

రవి, వాళ్ళ అమ్మదగ్గర ఉండకుండా చేయడానికి, అంతకు ముందురోజు, ఆహారంలో ఏదో కలిపి పెట్టావ్. దాంతో ఆమెకు సుస్తీచేసి పడుకుంటే, ఆమెకు కాపలాగా, కమలను ఉంచి, రవిని నీదగ్గర ఉంచుకున్నావ్.

కానీ నీమీదకు అనుమానం రాకుండా ఉండడంకోసం' ఎవరికో డబ్బిచ్చి. కమలమీదకు నేరం నెట్టాలని, ప్రయత్నించావ్। కానీ నీకు తెల్సు. కమలకు సాక్ష్యం ఉందని. దాంతో నీ భార్యకు ఇంకెవరిమీదో అనుమానం పోతుంది. నీమీదకు వచ్చే అవకాశంలేదు.

నువ్వు నియమించిన వ్యక్తి పట్టుపడగానే, రవిని గదిలో వదిలి బైటకు పరుగెత్తావ్। గది బైటనే ఉన్న నీ మనిషి గంగన్న, రవిని పక్కగదిలో ఉంచి, రవి అరవకుండా ఉండడానికి బొమ్మలు ముందుంచాడు.

కాని ఇంతచేసినా నీ బండారం బైటపడింది. గదిలో మూలగా ఉన్న దుమ్ములో కొన్ని ముద్రలు కన్పించాయి. కమలద్వారా రవి ఆడుకోడానికి కొన్ని బొమ్మలు ఉన్నాయని

తెల్సుకున్నాను. అవి ఆ బొమ్మల ముద్రలే. అయితే, బొమ్మలు అక్కడ ఎందుకుపెట్టారు? ఆలోచించాను. చిన్న పిల్లవాడు కాబట్టి ఏడవకుండా ఉండడానికి బొమ్మలు అక్కడ పెట్టిఉంటారని ఊహించాను.

ఇక ముఖ్యమైన సాక్ష్యం! నీవు కిడ్నాపర్ పేరుతో వ్రాసిన వుత్తరంలోని దస్తూరి, నాకు మీ చిరునామా వ్రాసిచ్చిన దస్తూరితో సరిపోయింది. ఆ విషయం ఇప్పుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి రూఢిచేసుకొని వస్తున్నాను.

అయితే ఎందుకుచేశావ్? ఈ అనుమానం తీర్చుకోడం కోసమే ఇన్‌స్పెక్టర్‌ను, నీకేమైనా అప్పులు ఉన్నాయోమో తెల్సుకోమన్నాను. నీకు పదివేలుదాకా అప్పులు ఉన్నాయని, అందరూ ఆ డబ్బుకోసం నిన్ను వొత్తిడిచేస్తున్నారని తెల్సింది." అన్నాడు హరగోపాల్.

చక్రపాణి తలవంచుకున్నాడు.

"మిస్టర్ చక్రపాణి. డబ్బు పొందడానికి సరసమైన మార్గాలు ఉన్నాయి. ఇలాంటివికాదు. మీ అబ్బాయిని ఎక్కడ దాచిఉంచారో వెంటనే తెచ్చి ఆమెకివ్వండి." అంటూ హరగోపాల్ చకచక బైటకునడచాడు. ***

లాయర్:_మీ యజమానిని ఎందుకు చంపావ్?

నౌకర్:_అబ్బే! ఏం లేదండీ. కాళ్ళు నొప్పులుగా ఉన్నాయంటే కాళ్ళు పిసుకుతుంటాను. నిన్న గొంతు నొప్పిగా ఉందన్నారు. అంతే!...

—కాళంగి మురళి, గుంటూరు-2.

నడచి వచ్చిన సాక్ష్యం!

అజీజ్

ఆఫీస్ కాంపౌండ్‌లో కారాపి దిగేడు అర్జునరావ్. డోర్స్ లాక్‌జేసి, కీస్ జేబులో వేసుకుంటూ రిస్టువాచీ చూసుకున్నాడు.

తొమ్మిదిన్నర!

చిన్నగా నవ్వుకున్నాడు. గడియారానికీ, తన జీవితానికీ విడదీయని బంధం ఉంది. ఫారిన్ పంక్చువాలిటీ అంటే అతనికి చాలా ఇష్టం. అర్జునరావ్‌ది టైమింగ్ లైఫ్.

వడివడిగా నడుస్తూ ఆఫీసులో అడుగుపెట్టేడు. అతన్ని చూడగానే ఫైళ్ళతో కుస్తీ పడుతున్నట్టు నడుస్తున్న స్టాఫంతా గౌరవంగా లేచి నిల్చున్నారు. వాళ్ళని కూర్చోమన్నట్టు సైగజేసి బూట్సు టకటక చప్పుడు జేసుకుంటూ తన ఆఫీస్ రూంవైపు నడిచేడు అర్జునరావ్.

ఈజీఛెయిర్‌లో కూర్చుని కాలింగ్‌బెల్ మోగించేడు.

ప్యూన్ వచ్చి సెల్యూట్ కొట్టేడు.

"స్టెనోని పంపించు!" అన్నాడు అర్జున్రావ్ పెండింగ్ ఫైల్ తెరుస్తూ.

"ఆమె ఇంకా రాలేదు సార్!"

తలెత్తి ఆశ్చర్యంగా చూసేడు. "సెలవు పెట్టిందా?"

"లేదండి."

"హెడ్‌గుమాస్తాని పిలువ్!"

ప్యూన్ వెళ్ళిన రెండు నిమిషాలకి, లోన అడుగుపెట్టి చేతులు జోడించి నిల్చున్నాడు హెడ్‌క్లర్క్.

"స్టెనో లీవు పెట్టిందా?" అడిగేడు అర్జున్రావ్.

"లేదండి! ఈ రోజు దేనికో ఆలస్యమైంది!"

"డిసిప్లిన్ ఈజ్ డిసిప్లిన్! మిగతా వాళ్ళంతా తొమ్మిది న్నరకే వచ్చి పని చూసుకుంటున్నారు. నేను వచ్చి పది నిమిషాలైంది. ఈ రోజు డిస్పాచ్ జెయ్యవలసిన అర్జెంట్ లెటర్స్ ఉన్నాయి. ఆమెగారు ఇంకా రాలేదంటే ఏమనాలి?" అన్నాడు అర్జున్రావ్ ముఖం చిట్లిస్తూ.

"ఇంతవరకూ ఇలా జరగలేదు. టైం ప్రకారం ఠంచ నుగా వచ్చేది. అవసరం కలిగితే లీవ్ లెటర్ పంపేది. ఏదో ఆడకూతురు. మన్నించండి!"

"ఊఁ! మరోగంట చూసి ఆబ్సెంట్ పడెయ్యండి. రేపు రాగానే ఛార్జ్ మెమో రాసిచ్చి, ఫస్ట్‌వార్నింగ్ ఇవ్వండి!" అన్నాడు అర్జున్రావ్ కటువుగా.

చేతులు నులుపుకుంటూ తలూపేడు హెడ్‌క్లర్క్.

ఫైల్ తెరిచి చూస్తూ- "వెళ్ళి ఇంకెవరైనా పంపండి" అన్నాడు అర్జున్రావ్.

ఆయన వెళ్ళిన రెండు నిమిషాలకి ఎల్. డి. సి. పార్థ సారథి వచ్చేడు చేతిలో డిక్టేషన్ బుక్, బాల్‌పెన్ పట్టుకుని.

తలెత్తకుండానే కూర్చోమన్నట్టు సైగజేసేడు అర్జున్రావ్. అతను కూర్చున్నాక, చకచక ఆరోజు కరస్పాండెన్స్ లెటర్స్ డిక్టేట్ చెయ్యసాగేడు అర్జున్రావ్.

గబగబ షార్ట్‌హాండ్‌లో నోట్ జేసుకుని, కరెక్షన్‌కోసం ఓసారి చదివి వినిపించేడు ఎల్. డి. సి.

"ఓ.కే! గంటలోగా వాటిని టైప్‌జేసి పట్రండి" అన్నాడు అర్జున్రావ్ సిగరెట్ అంటించి.

పార్థసారథి బైటికెళ్ళి వెంటనే తిరిగొచ్చేడు.

"ఏమిటి?" అడిగేడు అర్జున్రావ్.

"టైప్‌రైటర్ లాక్‌జేసి ఉంది సార్!"

"కీ ఎక్కడ?"

"స్టెనో వెంట తీసికెళ్ళుంటుంది."

"వెంటనే ప్యూన్ని ఆమె ఇంటికి పంపి తెప్పించండి" అన్నాడు అర్జున్రావ్ ముఖం చిట్లిస్తూ.

గంట తరవాత రొప్పుతూ రోజుతూ ఆఫీసుకు వచ్చేడు ప్యూన్.

"ఏం జరిగింది?"

"టైపిస్టమ్మ ఇంట్లో చచ్చిపడుంది సార్!"

అర్జున్రావ్ నోట్లోంచి సిగరెట్ జారి కిందపడింది. "వాట్!?" అన్నాడు నమ్మలేక.

"నిజం సార్! టైప్‌రైటర్ కీ కోసం ఆమె ఇంటి కెళ్ళేను. తలుపుమూసి ఉంది. ముందు పిలిచేను. ఎంతకీ జవాబు రాకుంటే తలుపు తోసేను. లోపల, మంచంమీద ఆమె వెల్లికిలా పడుంది. ఎంత అరిచినా కదల్లేదు. ఎవ్వరో గొంతు నులిమినట్టు కంఠం ఉబ్బి ఉంది సార్!" అన్నాడు ప్యూన్ చమట్లు కక్కుతూ.

అర్జున్రావ్ మరేమీ ఆలోచించలేదు. టేబిల్ మీది ఫోన్ దగ్గరికి లాక్కుని, గబగబ క్రయింబ్రాంచ్‌కి రింగ్‌జేసి రిసీవర్ అందుకున్నాడు.

"ఎస్. ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి స్పీకింగ్!" అవతలినించి వినిపించింది.

"నేను జ్యోతిర్మయి ప్రైవేట్ లిమిటెడ్ ప్రొప్రైటర్ అర్జున్రావ్ మాట్లాడుతున్నాను. మా కంపెనీ లేడీ స్టెనో ఇంట్లో హత్య చెయ్యబడింది. మీరు వెంటనే అక్కడికి చేరుకోండి. నేనూ వస్తున్నాను."

"ఆ ఇంటి ఎడ్రస్ చెప్పండి!"

"డోర్ నెంబర్ 3-1-146. మాంబళం."

"ఆమె పేరేమిటి?"

"హంసవేణి!"

అవతల క్లిక్‌మంది.

రిసీవర్ క్రెడిల్‌జేసి లేచాడు అర్జున్రావ్.

* * *

చెక్క గేటుగుండా లోనికి పోనిచ్చి, కారుకి బ్రేకు వచ్చి కాంపౌండ్‌లో ఆగింది.

"అర్జున్రావ్ మీరే కదూ?" అడిగేడు ఇన్‌స్పెక్టర్ జీపు దిగుతూ.

"ఎస్!" అంటూ అతనికి షేక్‌హేండ్ ఇచ్చేడు అర్జున్రావ్.

"ఆఫీసులో ఉన్న మీకు హత్య జరిగిందని ఎలా తెలిసింది?"

అర్జున్రావ్ వివరంగా చెప్పేడు.

"కమాన్!" అంటూ ఇంటివైపు నడిచేడు ఇన్‌స్పెక్టర్.

తలుపు దగ్గిరగావేసి వుంది. తొయ్యగానే తెరుచుకుంది.

ఓ గోడవారగా మంచంమీద వెల్లకిలా పడుంది శవం! చేతులు రెండూ ఆకుకూర కాడల్లా వేళాడుతున్నాయి. ఓకాలు మడచివుంది. కంఠం చుట్టూ ఉబ్బివుంది. నోరు కొద్దిగా తెరవబడి, నాలిక బై టికి వచ్చింది. తెల్లగుడ్లు ఇంటి కప్పుని చూ స్తున్నట్టున్నాయి.

"గొంతు నులిమి చంపేరు!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ చుట్టూకళ్ళతో ఎక్స్‌రే తీస్తూ.

అర్జున్రావ్ తలూపేడు. "ఇటీజ్ రియల్లీ ఎ షాకింగ్ న్యూస్!" అన్నాడు.

"ఈమె మీ ఆఫీసులో ఎన్నాళ్ళనించి పనిజేస్తోంది?" అడిగేడు ఇన్‌స్పెక్టర్.

"దాదాపు రెండేళ్ళు కావస్తోంది."

"అవివాహితా?"

అర్జున్రావ్ తలూపి—"ఔనట!" అన్నాడు.

"ఇక్కడ ఒంటరిగా వుంటోందా?" ఆశ్చర్యంగా ధ్వనించింది ఇన్‌స్పెక్టర్ కంఠంలో.

"ఔను. తల్లీ, తండ్రీ బెంగుళూరులో వున్నారట!"

"క్యారెక్టర్ ఎటువంటిది?"

"ఆమె పెర్సనల్ మేటర్స్ నాకంతగా తెలీవు. ఆఫీషియల్‌వర్క్ మాత్రం బాగా చేస్తుంది. స్టాఫ్‌తో కలుపుగోలుగా వుండేది. ఎల్. డి. సి. పార్థసారథితో మాత్రం కా_స్త ఎక్కువ....."

సాలోచనగా తలూపేడు ఇన్‌స్పెక్టర్. "హత్య డబ్బు కోసం జరగలేదు. అటు చూడండి." అన్నాడు శవం చేతి వైపు చూపిస్తూ.

శవం చేతికి రిస్టువాచీ వుంది. ఛెయిన్‌ది! అతల్లాటి సన్నని వేళ్ళు, ఎర్రని పెయింట్‌తో మెరుస్తున్నాయి. పొడుగాటి గోళ్ళు. ఓ వేలికి బంగారు వుంగరం!

ఫోటోగ్రాఫర్లూ, ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్‌లూ చకచక తమ పని సాగిస్తున్నారు.

ఇంతలో సార్జంట్ వచ్చి, "అంబులెన్స్ వచ్చింది సార్!" అన్నాడు.

"శవాన్ని మార్చ్యురీకి పంపించు." అని "ఆల్‌రైట్ మిస్టర్ అర్జున్రావ్‌గారూ! నా శాయశక్తులా ప్రయత్నించి, హంతకుణ్ణి పట్టుకోడానికి ప్రయత్నిస్తాను. ఇన్వెస్టిగేషన్‌లో అవసరం కలిగితే మళ్ళీ మిమ్మల్ని కలుసుకోవచ్చు. దెన్ గుడ్‌బై!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి.

* * *

ఆఫీస్ పార్కింగ్‌లో కారాపి లోనికి నడిచేడు అర్జున్రావ్.

అప్పటికే వ్యాన్ ద్వారా హంసవేణి మరణ వార్త విని స్టాఫంతా తర్జన భర్జన పడుతున్నారు. అతన్ని చూడగానే సైలెంట్ అయ్యేరు.

"డియర్ కొలీగ్స్! ఈ రోజు మనం ఇటువంటి దుర్వార్త వినవలసి వస్తుందని ఊహించలేదు. ఇన్నాళ్ళూ మనతో కలిసి పనిజేసిన మిస్ హంసవేణి ఇకలేదు. శాశ్వతంగా వెళ్ళిపోయింది. ఆమెను చంపిన కిరాతకుడివల్ల, ఆమె బంధువులే కాదు, మనమూ తీవ్రంగా నష్టపోయాం.

ఆమె అకాలమరణానికి విషాదసూచకంగా ఆ రోజు ఆఫీసును మూసివేస్తున్నాను. అందరూ యిళ్ళకి వెళ్ళి పోవచ్చు" అంటూ భారంగా తన గదిపైపు నడిచాడు అర్జున్రావ్.

క్షణంలో ఆఫీసంతా ఖాళీ అయింది, ప్యూన్ తప్ప. అర్జున్రావ్ లేచి వెళ్ళేవరకూ ప్యూన్ వెళ్ళడు. అతనికప్పుడే ఇంటికెళ్ళాలనిపించిడంలేదు. సాయంత్రం ఐదుగంటల వరకూ ఆఫీసులో అలవాటైన ప్రాణం!

* * *

గోడ గడియారం ఐదు కొట్టగానే, ఇక బైలుదేరదామని కుర్చీలోంచి లేవబోయాడు అర్జున్రావ్.

ఇంతలో ప్యూన్ లోనికివచ్చి—"ఇన్స్పెక్టర్ వచ్చేడు సార్. మీతో మాట్లాడాలిట" అన్నాడు.

"పంపించు" అంటూ తిరిగి కూర్చున్నాడు అర్జున్రావ్.

ఇన్స్పెక్టర్ రాజారెడ్డి బూట్సు టకటక చప్పుడు జేసుకుంటూ లోనికివచ్చేడు.

"రండి, కూర్చోండి" అన్నాడు అర్జున్రావ్.

"ఈ కేసు ఇంత త్వరగా విడిపోయిందనుకోలేదు మిస్టర్ అర్జున్రావ్! హంతకుడెవ్వరో తెలిసిపోయింది." అన్నాడు ఇన్స్పెక్టర్ కూర్చుంటూ.

"ఎవ్వరు?" అన్నాడు అర్జున్రావ్ ఆశ్చర్యంగా.

ఇన్స్పెక్టర్ నవ్వి—"ఇంకా ఎవ్వరు? నువ్వే!" అన్నాడు.

అర్జున్రావ్ మొహం క్షణంలో ఎర్రబడింది. "ఇన్స్పెక్టర్ ఒళ్ళు దగ్గిర పెట్టుకు మాట్లాడండి. ఆధారం లేకుండా నావంటి పెద్దమనిషి మీద ఇటువంటి నిందవేస్తే నవ్వులపాలవుతారు. జాగ్రత్త!" అన్నాడు కటువుగా.

ఇన్స్పెక్టర్ పకపక నవ్వేడు. "మిస్టర్ అర్జున్రావ్! నవ్వులపాలయేది నేనుకాదు. నువ్వు! నా సర్వీసులో ఇంత వరకూ అనేక చిత్ర విచిత్రమైన కేసులు పరిశోధించేను.

కాని, వాటిలో అత్యంత విచిత్రమైన కేసు ఇది. ఇందులో నేను పరిశోధించిందేమీలేదు." అంటూ జేబు లోంచి ఓ కవర్‌తీసి "సాక్ష్యాలు వాటంతటవే నా దగ్గరికి వచ్చేయి చూడు!" అంటూ అర్జున్రావ్ ముందు పడేసేడు కవర్ని.

వణికే చేతులతో దాన్ని అందుకుని, తెరిచి చూసేడు అర్జున్రావ్. ఫోటోలు! ఒకటికాదు, రెండుకాదు, మొత్తం మూడు ఫోటోలు!! తను హంసవేణిని గొంతు నులిమి చంపుతున్న ఫోటోలు!!!

ఎవ్వరు తీసేరు? ఎలా తీసేరు?

గుడ్లప్పగించి రెప్పవెయ్యకుండా వాటినే చూడసాగేడు. మొహంలో సన్నగా చమట పేరుకోసాగింది.

"నీ నేరాన్ని ఇప్పుడైనా ఒప్పుకుంటావా మిస్టర్ అర్జున్రావ్?" హేళనగా ధ్వనించింది ఇన్‌స్పెక్టర్ కంఠం.

"ఈ ఫోటోలు మీకెలా అందేయి? ఎవ్వరు తీసేరు?" అడిగేడు అర్జున్రావ్ జీవంలేని స్వరంతో.

"నీ భార్య కాదంబిని స్వయంగా నాకు తెచ్చిఇచ్చింది!" అర్జున్రావ్ కాళ్ళకింద భూమి పగిలిపోతున్నట్టూ, తనందులో కూరుకుపోతున్నట్టూ తోచింది. గుండె క్షణం ఆగి తిరిగి కొట్టుకోసాగింది.

"ఆడవాళ్ళని చిటికెలో పట్టికొట్టించే లాజిక్ ఉంది నీలో. వెరైటీస్త్రీలని అనుభవించే పిచ్చివుంది. హంసవేణితో సంబంధం పెట్టుకున్నావ్. ఆమెకి నెల తప్పింది!

ఈ కంపెనీతోబాటు మిగతా ఆస్తంతా నీ భార్యపేర ఉంది. నీవు ఇల్లరికపుటల్లుడివి. హంసవేణితో నీ సంబంధం నీ భార్యకి తెలిస్తే ఎక్కడ విడాకుల తతంగం లేవదీస్తుందో

నని భయపడ్డావ్. ఆమె లేకుంటే నీకి రాజభోగాలు లభించ వాయె.

హంసవేణికి డబ్బాళపెట్టి వదుల్చుకుందామని నిన్నరాత్రి ఆమె ఇంటికెళ్లావ్. ముందు నయాన నచ్చజెప్పడానికి ప్రయత్నించావ్. ఆమె ససేమిరా ఒప్పుకోలేదు.

దాంతో నీలో పిచ్చికోపం పెల్లుబికింది. ఒళ్ళు తెలీని కోపంతో ఆమె గొంతునులిమి చంపావ్।

విచిత్రం ఏమిటంటే, నీ భార్య నీలాగే కూడా మరో పురుషుడి వలలోపడి, ఎలాగైనా నిన్ను వదిలించుకుని, అతన్ని పెళ్లాడటానికి సమయంకోసం వేచిఉంది.

నిన్ను వదిలించుకోవాలంటే చట్టబద్ధంగా విడాకులు తీసుకోవాలి. దానికి, కారణాలు చూపించాలి. అప్పుడే, నీకూ హంసవేణికీ సంబంధం ఉన్నట్టు ఆమెకి తెలిపింది. ఆ విషయాన్ని నిరూపించడానికి మీరిద్దరూ కలిసిఉండగా మీ ఫోటోలు తియ్యమనీ, మీ సంభాషణ రికార్డు చెయ్యమనీ ఓ మనిషిని నియమించింది.

రాత్రి అతను నిన్ను నీడలా ఫాలోఅవుతూ ఫోటోలు తియ్యడానికి సమయంకోసం ఎదురుచూడసాగేడు. రాత్రి నువ్వు హంసవేణిని చంపడం, అతని కెమెరాకీ, టేప్ రికార్డర్కీ పని కల్పించడం, ఏకబిగిన జరిగిపోయేయి" అంటూ జేబులోంచి హాండ్కప్స్ తీసేడు ఇన్స్పెక్టర్ రాజారెడ్డి.

అర్జునరావ్ బుర్ర గిరగిర తిరగసాగింది. కళ్ళల్లో మైకం కమ్ముకుంటోంది. బహుశా మూర్ఛవస్తోందేమో. టేబిల్ మీద అలాగే ఒరిగిపోయేడు. ***

ఉత్తమ రచయిత?

శ్యాంబాబు

నానారావుతో నాకు పెద్ద పరిచయమేమీ లేదు. ఉన్న పరిచయమల్లా సాహితీపరిచయమే.

ఊళ్ళో జరిగే సాహిత్యసభలకు, సమావేశాలకూ అతనూ తరచూ రావడంవల్ల, చాలాసార్లు సభలో ప్రక్కప్రక్కనే కూర్చోవడంవల్ల అతనితో కొద్దిపాటి పరిచయం ఏర్పడింది.

ప్రతీసారీ సభ ముగియగానే ఇద్దరం హాలుముందే నిలబడి ఏదో సాహిత్యచర్చ చేసేవాళ్ళం. ఇద్దరూ నిర్మొహమాటంగా వాదోపవాదాలు చేసుకొనేవాళ్ళం. సామాన్యంగా ఇద్దరి అభిప్రాయాలు దాదాపు ఒకేరకంగా వుండడంవలన పెద్దగా అభిప్రాయభేదాలు వుండేవి కాదు మాకు.

మాట్లాడుకొనేప్పుడు సాహిత్యం తప్ప మరో విషయం మెదిలేదికాదు మామధ్య. వ్యక్తిగతమైన వివరాల్లోకి ఎప్పుడూ పోలేదు మేము. ఇప్పటికీ అతని ఉద్యోగమేమిటో, ఇల్లెక్కడో, పెళ్ళయిందో లేదో, అతని ఇతర వ్యాపకాలేమిటో

ఒక్క ముక్క కూడ తెలియదు నాకు. నా గురించీ అతని కేమీ తెలియదనుకొంటాను.

ఈ రోజు కూడా సభ అయిపోయేప్పటికి బాగా చీకటి పడింది. పది దాటిపోయింది. సినిమా కవిగారొకరు, మాటల రచయితొకరు రావడంతో ఎప్పుడూ సభ ముగిసేవేళకి వేళ్ళ మీద లెక్కపెట్టగలిగేట్లు వుండే జనం ఈ రోజు హాలుపట్ట నంతగా వున్నారు చివరివరకూ. సినిమా ప్రభావం, మోజు అలాంటిది మరి!

"నమస్తే సార్! బావున్నారా?" నానారావు గొంతు విని పించి ప్రక్కకు తిరిగాను.

"హలో! నమస్తే! ఈ రోజు మీరు రాలేదేమో అను కొన్నాను." అన్నాను.

"రాకుండావుంటేనే బావుండేది అనిపిస్తోందిప్పుడు. కాస్త ఆలస్యంగా వచ్చాను. వచ్చింది సినిమా కవిగారని మరచిపోయి సీట్లు లేకపోవడంవలన వెనక నిలబడ్డాను" అన్నాడు నానారావు.

నవ్వాను నేను. "బాగా చెప్పారు. కీర్తి, డబ్బు రావా లంటే సాహిత్యాలలో పైమెరుగులు, బూతు తప్పనిసరి అనుకొంటాను."

"బాగా చెప్పారు. అయినా అలాంటివి ఆదరించే పాఠకు లను కూడా మనం మరచిపోగూడదు. పాఠకుల అభిరుచిని బట్టి గదా రచయితలు వ్రాసేది?" అన్నాడు నానారావు.

మనసులో ఏ మూలో కలుక్కుమంది. "పొరబడు తున్నారు. అందరు రచయితలూ అలాంటివాళ్ళేనని మనం అనుకోనక్కరలేదు. తమ మనసుకు నచ్చింది, తమ వేదాం తాన్ని ప్రతిఫలించే భావాల్ని నిర్మొహమాటంగా, నిర్భ

యంగా చెప్పే రచయితలు ఎందరు లేరంటారు?"

"ఎవరూ లేరనే అనుకోవాలి." అన్నాడు నానారావు.

"క్షమించండి అంటున్నందుకు. కాంటెంపరరీ ట్రెండ్స్‌ను మీరంతగా పరిశీలిస్తున్నట్లులేదు. ఈ మధ్య కాలంలో చాలామంది క్రొత్త రచయితలు చక్కటి శైలి, బహూఉత్తమమైన పంథాల్లో కథలు వ్రాస్తున్నారు. 'దీపం' వారపత్రికవారు నిర్వహిస్తోన్న నవలల పోటీల్లో ఎన్నికైన నవలలు కొన్ని అత్యుత్తమంగా వున్నాయని చెప్పకతప్పదు." అన్నాను.

'దీపం' వారపత్రిక నవలల పోటీ పేరెత్తగానే నానారావు కళ్ళలో చిన్న మెరుపు కనిపించింది.

'దీపం' వారపత్రికవారు తమ నవలా పోటీలలో తెలుగు నవలా సాహిత్యంలో చిన్న విప్లవం తెచ్చారనే చెప్పాలి. ప్రతీ సంవత్సరం ఉగాదికి నవలల పోటీ జరిపి, పోటీకి వచ్చిన నవలల్లో పన్నెండు ఉత్తమమైనవాటిని ప్రచురణకు ఎన్నుకొంటారు.

సంవత్సరంపాటు పన్నెండు నవలల ప్రచురణ అయిపోగానే, పాఠకులే ఈ పన్నెండింటిలో తమకు ఉత్తమంగా తోచిన నవలను ఎన్నుకొంటారు. ఈ ఎన్నుకొనడం వారపత్రికలో జతచేసివుండే బాలట్ పత్రాల ద్వారా జరుగుతుంది. పాఠకులు ఉత్తమమైన నవల అని అత్యధిక మెజారిటీతో నెగ్గించిన నవలకు అయిదువేల రూపాయలు అదనపు పారితోషికం లభిస్తుంది.

నిజానికి గత రెండు సంవత్సరాలనుండి 'దీపం' వారపత్రికవారు నిర్వహిస్తున్న ఈ నవలల పోటీవలన తెలుగులో కనీసం ఓ అరడజనయినా మంచి నవలలు వెలువడ్డాయి.

ఆ నవలలు వ్రాసిన రచయితలకు మంచి పేరు కూడా వచ్చింది.

"ఐ డోన్ట్ థింక్ సో! 'దీపం' వారపత్రికలో ప్రచురింపబడే నవలల్లో అరవై శాతంపైగా కమర్షియల్ నవలుగా చెప్పుకోవచ్చు. కమర్షియల్ నవల్లు అనడంలో నా ఉద్దేశ్యం కేవలం పాఠకుల్ని మభ్యపెట్టే, కలల్లో తేల్చి, పత్రిక సర్క్యులేషన్ పెంచే రకానికి చెందినవి" అన్నాడు నానారావు.

"అఫ్‌కోర్స్! పత్రిక సర్క్యులేషన్ పెంచే నవల్సను సంపాదకులు ప్రచురించడంలో పొరపాటేమీలేదు. అరవై పర్సెంట్ నవల్సు అలాటివే అయినా, మిగిలిన నలభై శాతం అసలుసిసలైన సాహిత్యం అని ఒప్పుకొంటారుగా!"

"నో! ఒప్పుకోను! మిగిలిన నలభై శాతంలో సగానికి పైగా ఏ రకమైన రకానికీ చెందని హాఫ్‌బ్రీడ్ నవలలు. స్ట్రెయిట్‌గా ఆంగ్ల నవలలనుండి స్వేచ్ఛానువాదాలు, లేదా కాపీలు. సందేహంలేదు. మిగిలిన ఒకటిరెండు నవలలు శైలి, పాత్రచిత్రణ, ఆలోచనాపరిధీ దృష్ట్యా మంచి నవలలయినా వాటిని ఎక్కువమంది పాఠకులు ఆదరించడంలేదు. పైగా అలాంటి 'బోరు' నవలలను ప్రచురించవద్దని ఉత్తరాలు కూడా వ్రాస్తున్నారు." అన్నాడు నానారావు.

"ఉత్తరాల శీర్షిక నేనూ చూస్తున్నాను! గత రెండేళ్ళుగా పాఠకుల అభిరుచిలో చాలా మార్పు వచ్చినట్లు గమనిస్తున్నాను. ఇదివరకటిలా సినిమా తియ్యడానికి పనికొచ్చే నవలల్ని, ప్రేమకథల్ని అంతగా ఆదరించడంలేదు" అన్నాను మరో సిగరెట్ వెలిగిస్తూ.

నానారావు చిన్నగా నవ్వేడు. "ఈ విషయంలో మీకూ, నాకూ అభిప్రాయభేదం తప్పదనుకొంటాను. ఉత్తరాల

శీర్షికలనుబట్టి పాఠకుల అభిరుచిని అంచనా వెయ్యడం పొరపాటంటాను" అని కొద్దిక్షణాలు ఆగి "మొన్న ఉగాదికి ఎన్నికై 'దీపం' వారపత్రికలో ప్రచురిస్తున్న అన్ని నవలలూ చదువుతున్నారు కదూ?" అని అడిగాడు.

"అవును. చదువుతూనే వున్నాను" అన్నాను నేను.

"ఈ నెలాఖరుకు చివరి నవల ప్రచురణ పూర్తవుతుంది, వచ్చేవారంనుండి వరుసగా బాలట్ పత్రాలు ప్రచురిస్తారు పత్రికవారు. పాఠకులు తమకు నచ్చిన నవలను ఆ పత్రాల ద్వారా ఎన్నుకుంటారు. ఉగాది సంచికలో బాలట్ విజేతల పేర్లు ప్రకటిస్తారు. మీ దృష్టిలో ఏ నవలను అయిదువేల రూపాయల బహుమతికి పాఠకులు ఎన్నుకుంటారంటారు?" అన్నాడు నానారావు.

"పాఠకుల అభిప్రాయల్నిబట్టి, నాకు తెలిసిన అనేక మంది పఠితల అభిప్రాయాల్నిబట్టి 'అపరంజి' నవలకు అయిదువేలు బహుమతి వస్తుందనుకుంటున్నాను" అన్నాను ధృఢంగా....

గట్టిగా నవ్వాడు నానారావు "సారీ నవ్వినందుకు కాని 'అపరంజి'కి అయిదువేలు బహుమతి మాత్రంరాదు"—

నాలో కోపం పైకెగదన్నుతుంది. "ఆ జ్యోతిష్కుల్లా మాట్లాడుతున్నారే! మీ ఉద్దేశ్యంలో ఏ నవల ఎన్నికౌతుందంటారు?" అన్నాను సిగరెట్‌ను చెప్పుక్రింద నలిపివేస్తూ....

"నా ఉద్దేశ్యంలోనేకాదు. మెజారిటీ పాఠకుల ఉద్దేశ్యంలో కూడా 'గుళ్ళో పెళ్ళి' నవల ఉత్తమమయింది. రేపు ఉగాదికి అయిదువేలరూపాయలు బహుమతిపొందే నవల అదేనని ఖచ్చితంగా చెప్పగలను. మీరింకా గట్టిగా వాదిస్తే పందెం కూడా కట్టగలను" అన్నాడు నానారావు.

నా హృదయం అవమానంతో భగ్గుమంది. అఫ్‌కోర్స్, 'అపరంజి' నవల వ్రాసిన రచయితను నేనేనని నానారావుకు తెలియదు. తెలిసే అవకాశంలేదు. నాకు అత్యంత సన్నిహితులైన, బంధుమిత్రులకు కూడా నా కలంపేరు తెలియదు.

తొమ్మిది నెలలు రాత్రింబవళ్ళు కూర్చొని, అనుభవాల సంకలనంలోనుండి, గతంలో బాధల్ని, సుఖాల్ని, అనుభూతుల్ని తిరిగి అనుభవిస్తూ వ్రాసిన నవలది. ఆ నవల ప్రచురితమవుతుంటే పేరుగన్న విమర్శకులే స్వయంగా ఉత్తరాల శీర్షికలో తమ ఆనందాన్ని వ్యక్తపరచి మెచ్చుకున్నారు. అన్ని ప్రశంసలు మరే నవలకు రాలేదు.

"'గుళ్ళో పెళ్ళి' నవల 'అపరంజి'కన్నా ఏ రకంగా గొప్పదంటారు. ఏముంది ఆ కథలో చిన్నప్పుడెప్పుడో చూసిన సినిమాకు అనుకరణలావుంది. ఆ నవల్లో కథ....పైగా 'గుళ్ళో పెళ్ళి'ని మెచ్చుకుంటూ ఒక్క పాఠకుడూ ఉత్తరం వ్రాసినట్లు నేనూ చూళ్ళేదు. నా వుద్దేశ్యంలో 'గుళ్ళో పెళ్ళి'కి చివరి స్థానంలోకి కూడా అర్హతలేదు"—అన్నాను తీవ్రంగా.

"నో....సర్ మీరు పొరబడుతున్నారు. 'గుళ్ళో పెళ్ళి'కి మెజారిటీ పాఠకుల ఆదరణ లభించితీరుతుంది. ఉత్తరాల శీర్షిక వేరు. బ్యాలెట్ ఎన్నిక వేరు. కావలిస్తే వెయ్యి రూపాయలు పందెంకడతాను" అన్నాడు నానారావు తీవ్రంగా.

ఇది నాకు వ్యక్తిగతమైన ఛాలెంజి అనిపించింది. నా రచనలో నాకు నమ్మకం వుంది. నా పాఠకుల్లో నాకు నమ్మకం వుంది. 'గుళ్ళో పెళ్ళి' లాంటి నవలను ఆదరించే కాలం పోయింది. పాఠకులు, విమర్శనాత్మక దృష్టితోనూ, వాస్తవిక దృక్పథంతోనూ రచనలు చదవడం నేర్చుకొన్నారు. ఛీప్ థ్రిల్స్‌కు, చౌకబారు సన్నివేశాలకూ తెలుగు

సాహిత్యంలో స్థానం క్రమంగా పోతోంది. నా అంచనా తప్పడానికి వీల్లేదు. 'అపరంజి'కి అయిదువేలు బహుమతి రావలసిందే.

"ఓకె.... వెయ్యిరూపాయల పందెం. 'అపరంజి'కి అయిదువేలు బహుమతి తప్పదు" అన్నాను నేను.

"ఆల్‌రైట్! ఉగాది సంచిక విడుదలయిన రోజు ఇక్కడే కలుసుకొందాం. 'అపరంజి' గెలిస్తే మీకు నేను వెయ్యిరూపాయలిచ్చుకుంటాను. 'గుళ్ళో పెళ్ళి' గెలిస్తే మీరు నాకు వెయ్యిరూపాయ లిచ్చుకోవాలి" అన్నాడు నానారావు.

"రెండిట్లో ఏదీ గెలవకపోతే?"

"ఇద్దరం మూర్ఖులమని నవ్వుకొందాం."

ఇద్దరం విడిపోయాము. 'అపరంజి' గెలిచి తీరాలి. అయిదువేల రూపాయల బహుమతి గురించి కాదు. నా సృజనతమీద, నా రచనమీద నాకున్న నమ్మకం వమ్ము కాకూడదు. ఉగాదికోసం వేచి చూడసాగాను.

2

ఉగాది వచ్చింది.

వణికే చేతుల్తో 'దీపం' ఉగాది సంచిక పేజీలు చకచక త్రిప్పాను. మధ్య పేజీలో నవలల పోటీ ఫలితాలు ప్రముఖంగా ప్రకటించారు. నా కళ్ళు గిర్రున తిరిగినట్లనిపించినయ్.

'గుళ్ళో పెళ్ళికి' ప్రథమబహుమతి వచ్చింది. 'అపరంజి'కి ద్వితీయస్థానం.

మొత్తం పోలయిన ఓట్లు పదకొండువందలయాభై ఏడు. అందులో అయిదువందల ఓట్లు, 'గుళ్ళో పెళ్ళి'కి వచ్చాయి.

మూడువందలనలభై ఎనిమిది ఓట్లు 'అపరంజి'కి వచ్చాయి. మిగిలిన పది నవలలకు కొద్ది కొద్దిగా ఓట్లు వచ్చాయి.

నవనాడులూ క్రుంగిపోయినట్లనిపించింది. తెలుగు పాఠకులు నిజంగా మారలేదా? 'గుళ్ళో పెళ్ళి' లాంటి పరమ చెత్త నవలలు ఉత్తమ నవలలుగా ఎన్నుకోబడుతున్నాయంటే అంతే అనుకోవాలి. డామిట్ డామిట్!!!

ఆ సాయంత్రం టౌన్ హాల్ దగ్గర నానారావుకు వెయ్యి రూపాయలూ ఇచ్చేసి మౌనంగా ఇంటికి తిరిగొచ్చాను.

భయంకర సంగ్రామంలో పరాజితుణ్ణయ్యాననే ఫీలింగు మనసు మూలల్ని తొలిచేస్తుంది. ఇంట్లోకి కూడా వెళ్ళకుండా నరాసరి మెట్లెక్కి మేడపైకి వెళ్ళి పిట్టగోడ నానుకుని చతికిలబడ్డాను. ఒకటి వెంట ఒకటి వరసగా సిగరెట్లు త్రాగుతూ అలాగే ఎంతసేపు కూర్చొన్నానో తెలియదు. రాణి, నా భార్య కూడా ఇంట్లోలేదు. ఎవరో తన క్లాస్ మెట్‌ను చూడ్డానికి వెళతానని చెప్పింది. ఇంకా రాలేదు.

ఆలోచిస్తూ కూర్చొన్నాను. 'దీపం' వారపత్రికకు మొత్తం ఎనభై వేల సర్క్యులేషన్ వుందని విన్నాను. వాళ్ల బ్యాలెట్ ఎన్నికలో అవకతవకలు జరుపుతారంటే నాకు నమ్మకంలేదు.

"ఏమిటి ఇంటికి తాళంకూడా తీయకుండా ఒంటరిగా కూర్చున్నారు" అన్నది రాణి మేడమెట్లెక్కి పైకి వస్తూ.

చిత్రంగా నవ్వాను. సిగరెట్ విసిరేసి, "తోచక!" అన్నాను.

"కాదు.... మీరు ఫీలవుతున్నారని తెలుసు నాకు. సాయంత్రం 'దీపం'లో రిజల్టు నేనూ చూశాను. 'గుళ్ళో పెళ్ళి' లాంటి చెత్త నవలను ఎన్నుకొన్న పాఠకుల

టేస్ట్ అలాంటిది. మీ నవల బావుండక ప్రైజ్ రాకపోవడం కాదు" అన్నది రాణి వచ్చి ప్రక్కనే కూర్చొంటూ.

"పోనిద్దూ!" అన్నాను మరో సిగరెట్ వెలిగిస్తూ.

"లేదు. మీ సంగతి నాకు తెలుసు. మీరు బాధపడవలసిన అవుసరంలేదు. 'అపరంజి'కి బహుమతి రాకుండా తన నవలకు ప్రథమబహుమతి రావడం నిజంగా ఆశ్చర్యమని అన్నది మా సావిత్రి" అన్నది రాణి.

నేను ఆశ్చర్యంగా చూశాను రాణివైపు అవును! గుళ్ళో పెళ్ళి రచయిత్రి 'సావిత్రి' నా భార్యకు తెలుసని నాకు తెలియదు.

"మీకు చెప్పలేదుకదూ! నేనిప్పుడు వెళ్ళివచ్చింది సావిత్రి దగ్గరికే. మొన్నిమధ్య బజార్లో కనబడి అడ్రసు చెప్పింది. సరిగ్గా నేను ఇవ్వాళ వెళ్ళేసరికి 'దీపం' ఫలితాలు వచ్చాయి. కథలువ్రాసే సావిత్రి, నా క్లాస్‌మెట్ సావిత్రి ఒకరేనని అప్పటివరకూ తెలియదు. ఫలితాలు చూడగానే సావిత్రిభర్త నానారావు 'గుళ్ళోపెళ్ళి'కి బహుమతి వస్తుందని ఎవరితోనో వెయ్యిరూపాయలు పందెంకాశాననీ, వెళ్ళి డబ్బు వసూలు చేసుకోవాలనీ బయటికి వెళ్ళాడు. పాపం ఆ పందెం కట్టిన పెద్దమనిషికి తెలుగుపాఠకులు వుత్త మూర్ఖులని తెలియదల్లే వుంది" అన్నది రాణి.

నేను దిగులుగా రాణివైపు చూశాను. "తెలుగు పాఠకుల మూర్ఖత్వాన్ని అంచనా వెయ్యలేని ఆ మూర్ఖుణ్ణి నేనే రాణీ! నానారావుతో 'అపరంజి' బహుమతిపొంది తీరుతుందని పందెంకట్టి వెయ్యిరూపాయలు ఓడిన ప్రబుద్ధుణ్ణి నేనే.'' రాణి మతిపోయిన దానికిమల్లే నా వైపు నిముషంపాటు కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయింది.

"వెయ్యిరూపాయలూ ఇచ్చేశారా?" అన్నది చివరికి.

గిల్టీగా ఫీలయ్యాను నేను. అవునన్నట్లు తలవూపాను.

"పోన్లెండి! జరిగినదానికి విచారించి ప్రయోజనం ఏమిటి? ఈసారి అయినా పాఠకులు మారతారని ఆశిద్దాం!"—అన్నది రాణి నా చేతిని తన చేతిలోకి తీసుకొంటూ.

"నో! రాణి నేనిక వ్రాయలేను. ఈ రోజుతో నాలో వ్రాసేశక్తి పోయినట్లనిపిస్తోంది."

"మీరలా వ్యధపడి ప్రయోజనంలేదు. మీ కృషి ఒక్కరు గుర్తించినా అదే ప్రయోజనం 'అపరంజి'కి రెండవస్థానం వచ్చిన విషయం మరచిపోతున్నారు....అంటే పాఠకుల్లో అందరూ కాకపోయినా కొందరయినా మీ రచనల్ని ఎంతో మెచ్చుకొంటున్నారన్నమాట....వాళ్ళని నిరాశపరచగూడదు మీరు. తరువాత పోటీకి ఇంకా వారంరోజులే వ్యవధివుంది. త్వరగా పూర్తిచేసి పంపించండి" అన్నది రాణి ఎంతో ఓదార్పుగా....

3

మళ్ళీ ఉగాది వచ్చేస్తోంది.

మరో ఆరువారాల్లో ఉత్తమనవల బహుమతి ప్రకటిస్తారు' ఈ వారంనుండే పత్రికలో బాలట్ పత్రాల ప్రచురణ ప్రారంభించారు. ఏమవుతుందో చూడాలి. ఈసారి బాలట్ ఫలితాల గురించి నాకంత ఆతృతలేదు.

ఈసారి సావిత్రి 'ప్రేమపక్షులు' అనే చెత్తనవలవ్రాసింది. ఈ సంవత్సరంలో మొత్తంమీద రెండుసార్లే నానారావును కలుసుకోవడం జరిగింది. రెండుసార్లూ 'ప్రేమపక్షులు' నవలకు అయిదువేలు బహుమతి తప్పదని ఢంకాబజాయించి

చెప్పాడతను. నవ్వి వూరుకొన్నాను నేను.

ఆ సాయంత్రం ఆఫీసునుండి ఇంటికి రాగానే నవ్వుతూ స్వాగతం చెప్పింది శ్రీమతి.

"ఏమిటి హుషారు?" అన్నాను కాఫీ సిప్‌చేస్తూ....

"గుళ్ళో పెళ్ళికి ఎలా ప్రథమబహుమతి వచ్చిందో తెలిసిపోయింది. 'ప్రేమపక్షుల'కు ఎలా ప్రథమబహుమతి రాబోతుందో కూడా తెలిసింది" అన్నది ఉత్సాహంగా....

"ఎలా?" అన్నాను ఆపుకోలేని క్యూరియాసిటీతో....

రాణి నవ్వింది.

"ఎలాగో తర్వాత చెపుతానుగాని ముందో వెయ్యి రూపాయలు కావాలి నాకు."

"ఎందుకు?"

"ఎందుకో అడక్కండి! సద్వినియోగం చెయ్యడానికని మాత్రం మీకు హామీఇస్తున్నాను" అన్నది రాణి.

రాణి మాటపై నాకు నమ్మకంవుంది. చెక్ బుక్ తీసి వెయ్యిరూపాయలకు చెక్కు వ్రాసిచ్చాను.

మర్నాడు సాయంత్రం సాహిత్య సభదగ్గర నానారావు కలిశాడు. అతనే సంభాషణను నవలలపోటీపైపు మళ్ళించాడు.

"ఈసారి కూడా శ్రీమతి సావిత్రి వ్రాసిన 'ప్రేమపక్షులు' నవలకు అయిదువేలు బహుమతి తప్పదు. కాదంటారా? వెయ్యిరూపాయల పందెం" అన్నాడు నానారావు.

"సార్ బుద్ధొచ్చింది. ఇక పందాలుకట్టను" అన్నాన్నేను.

నవ్వాడు నానారావు "ఫరవాలేదులెండి. ఈసారి నా భార్య స్నేహితురాలొకతె 'ప్రేమపక్షులు'కు బహుమతి రాదనీ, పోయినసారి మీరు మొదటి బహుమతి వస్తుందని పందెం కట్టిన రచయిత నవలకే బహుమతి వస్తుందనీ వెయ్యి

రూపాయలు పందెంకట్టింది."

హఠాత్తుగా రాణి నా దగ్గిర వెయ్యిరూపాయలు తీసుకోవడం గుర్తొచ్చింది. రాణిగాని నానారావుతో పందెంకట్టలేదు గదా?

"నానారావుగారూ! పందెం విషయం వదిలేయండి. ఓ విమర్శకుడిగా మీ అభిప్రాయం చెప్పండి. సావిత్రి వ్రాసిన 'ప్రేమపక్షులు' బావుందా లేక 'పూలపల్లకి' బావుందా."— అన్నాను సూటిగా. 'పూలపల్లకి' నేను వ్రాసిన నవల.

నానారావు నవ్వాడు...."నిజం చెప్పాలంటే పూలపల్లకికి ప్రేమపక్షులకు పోలికేలేదు. పూలపల్లకి ఉత్తమమయిన రచన సందేహంలేదు. అయినా పాఠకుల అభిప్రాయాలు వేరు. బ్యాలెట్ ఎన్నికవేరు అని చెప్పానుకదా!"

ఆ రోజు రాత్రి ఎందుకో ప్రశాంతంగా నిద్రపోయాను.

4

ఉగాది సంచిక విడుదలయింది....

బాలట్ ఫలితాలు చూసి నా కళ్ళు నేను నమ్మలేకపోయాను. నా నవల 'పూలపల్లకి'కి ప్రథమస్థానం వచ్చింది. గబగబ ఎన్ని ఓట్లు వచ్చాయో చూశాను.

మొత్తం పోలయిన ఓట్లు రెండువేల ఎనిమిదివందలు. ఫరవాలేదు పోయినసారికన్నా ఎక్కువమంది ఓటుచేశారు. అందులో పదిహేనువందల అరవై ఓట్లు 'పూలపల్లకి'కి అయిదువందల పదహారు ఓట్లు 'ప్రేమపక్షులు'కు వచ్చాయి. మిగిలిన ఓట్లు మిగతా నవలలకు వచ్చాయి. ఎందుకో తెలియకుండా కళ్ళవెంట నీళ్ళొచ్చాయి. పడిన ఆవేదనకు, ధారపోసిన చైతన్యానికి, గుర్తింపు లభించిందన్న సంతోషమో విజయగర్వమో తెలియదు. మనసెందుకో తృప్తిగా అనిపించింది.

ఇంటికి వెళ్ళగానే రాణి నన్ను చటుక్కున కావిలించి కొని ముద్దుపెట్టుకొంది.

"ఎలా తెలుసు?" అన్నాను.

"నాకు ముందే తెలుసు...."

ఎందుకో ఉత్సాహం నీరుకారిపోయినట్లనిపించింది,

నాకేమాత్రం ఇష్టంలేకపోయినా, రాణి బలవంతంమీద ఆ రోజు సాయంత్రం నానారావు ఇంటికి వెళ్లాము.

మేము వెళ్ళేప్పటికి నానారావు హాల్లో ఏదో పోగొట్టు కొన్నవాడిలా దిగులుగా కూర్చొని వున్నాడు. రాణితోపాటు నన్ను చూడగానే ఆశ్చర్యపోయాడు. లోపలనుండి సావిత్రి కూడా హాల్లోకి వచ్చింది. ఆవిడ ముఖంలోనూ ఏదో విచారం కనిపించింది నాకు.

"ఈయన మావారు 'పూలపల్లకి' రచయిత" అన్నది రాణి నన్ను పరిచయంచేస్తూ. కోపంగా చూశాను రాణివైపు. నన్ను రచయితగా పరిచయం చేసుకోవడం నా కిష్టం వుండదు.

సావిత్రి, నానారావు నోళ్ళు తెరిచి చూశారు నా వైపు.

"ఇంతవరకూ ఎప్పుడూ చెప్పలేదే" అన్నాడు నానారావు నిష్ఠూరంగా....

"ఆయన కిష్టంవుండదులెండి. అందుకే కాని కావాలని పరిచయం చేశాను. మీతో నేను వెయ్యిరూపాయలు పందెం కట్టిన సంగతికూడా ఆయనకింకా తెలియదు" అన్నది రాణి.

నానారావు ఇబ్బందిగా చూశాడు—"సారీ రాణిగారూ! ప్రస్తుతం నా దగ్గర డబ్బు సిద్ధంగాలేదు. రెండ్రోజుల్లో మీ వెయ్యిరూపాయలు నేనే మీ ఇంటికివచ్చి ఇస్తాను" అన్నాడు దిగులుగా.

"అదేమిటి నానారావుగారూ! పోయిన ఉగాదిరోజు మా

వారు ముక్కు మొహం సరిగా తెలియకపోయినా నిజాయితీగా అనుకొన్నచోటికివచ్చి మీకు వెయ్యిరూపాయలూ ఇచ్చుకోలా? ఇది పెద్దమనిషి తరహాకాదు" అన్నది రాణి గట్టిగా....

నా కెందుకో రాణి ధోరణి నచ్చక ఇబ్బందిగా చూశాను.

"లేదు....లేదు....రేపు ఉదయం బ్యాంకుకెళ్ళి మీ డబ్బు తెచ్చిచ్చేస్తాను" అన్నాడు నానారావు కృంగిపోతున్నట్లు....

"పాపం....'పూలపల్లకి'కి బహుమతి వస్తుందని మీరు కలలో కూడా అనుకోలేకపోతారు. 'ప్రేమపక్షులు' తప్పక గెలిచి, నేనే మీకు వెయ్యిరూపాయలు ఇవ్వవలసి వస్తుందని కలగంటూ వున్నారు" అన్నది రాణి వెక్కిరింతగా....

"ఊరుకోరాణీ! రేప్రొద్దున్నే వచ్చి నీ డబ్బు నీకిచ్చే స్తాంగా" అన్నది సావిత్రి ముఖం నలుసులా చేసుకొని....

5

"ఏమైనా నువ్వలా అనడం బావులేదు." అన్నాను నానారావు ఇంట్లోంచి బయటికివచ్చిన తరువాత.

"మీకు తెలియదులెండి....నేను కావాలనే అలా చేశాను. మొత్తంమీద ఈసారి సావిత్రి వాళ్ళకు పదిహేనువందలు నష్టం" అన్నది రాణి గట్టిగా నవ్వుతూ....

"అదేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఓహో....జరిగిందేమిటో మీకు తెలియదుగదూ.... వినండి చెపుతాను" అన్నది రాణి జరిగిన విషయాన్ని తలుచుకొని నవ్వుకొంటూ....

"నేను మొదటినుండీ 'గుళ్ళోపెళ్ళి'కి ప్రథమ బహుమతి రావడంలో ఏదో మోసం వుందని అనుమానిస్తూ వచ్చాను. అంత పరమ చెత్తనవలకు ప్రథమ బహుమతి రావడం ఎవ్వరూ ఊహించలేని విషయం. అయితే నానారావు కాన్ఫిడెన్స్ చూసి నాకు నిజంగా అనుమానం కలిగింది....

అందుకే సావిత్రి ఇంటికి ఈ సంవత్సరమంతా తరచూ వెళ్ళివస్తూ బాగా పరిచయం పెంచుకొన్నాను. వాళ్ళుచేస్తున్న మోసం మొదటిసారిగా, మొదటి తడవ బాలట్ పత్రాలు 'దీపం'లో ప్రచురింపబడినప్పుడు తెలుసుకొన్నాను నేను.

ప్రథమ బహుమతి పొందడానికి నానారావు ఉపయోగించిన టెక్నిక్ చాలా చిన్నది. మీరు గత రెండు సంవత్సరాల పోటీలు గమనించినట్లయితే మొత్తంమీద పోలయిన ఓట్లు వెయ్యికన్నా ఎక్కువకావని గమనించేవుంటారు.... మొదటి రెండుసంవత్సరాల్లోనూ మొత్తం ఓట్లు అయిదు వందలు, అయిదువందల డెబ్బై....

అందుచేత నానారావు బాలట్ పత్రాలు ప్రచురింపబడిన 'దీపం' కాపీలు ఓ అయిదువందలుకొని, వాటన్నిటిలోనూ 'గుళ్ళోపెళ్ళి' నవలకు ప్రథమస్థానం ఇస్తూ ఓటుచేసి 'దీపం' కార్యాలయానికి పోస్టుచేశాడు. ప్రతీ బాలట్ పేపరుకు పోస్టేజితో సహా అతనికి ఓటుకు రూపాయిచొప్పున ఖర్చయింది. అయిదువేలు బహూమతికి అయిదువందల రూపాయలు ఖర్చుపెట్టడం పెద్ద నష్టంకాదు. అందుచేతే పోయిన ఏడాది 'గుళ్ళోపెళ్ళికి' సరిగ్గా అయిదువందల ఓట్లే వచ్చాయి" అన్నది రాణి.

"యు మీన్....?? అన్నాను అనుమానంగా....

"అవును! నానారావు అలాంటి మోసంగాని చేసివుండకపోతే గుళ్ళోపెళ్ళికి ఒక్క ఓటుగూడా వచ్చి వుండేదికాదు. మీ నవల 'అపరంజి'కే ప్రథమబహూమతి వచ్చివుండేది"—

"మైగాడ్ ఎంత మోసం."

"అవును మోసాన్ని మోసంతోనే అరికట్టాలి. ఈసారి బాలట్ పేపర్లు ప్రచురించిన మొదటివారం నేను సావిత్రి

ఇంటికి వెళ్ళడం తటస్థించింది. మొదటిగదిలో ఓ మూల కట్టగట్టివున్న 'దీపం' పత్రికలు చూసి, పైపత్రిక క్రొత్తగా వుండడం చూసి తీశాను. కాని అందులో వున్నవన్నీ ఆ వారం పత్రికలే అని గ్రహించేప్పటికి నాకు అనుమానం పెరిగింది. పై నాలుగు పత్రికల్లో కట్ చేసివున్న బాలట్ పత్రాలు చూడగానే వాళ్ళమోసం అర్థమయింది నాకు....ఆ సమయంలో నానారావు ఇంటిదగ్గర లేకపోవడం, సావిత్రి స్నానంచేస్తూ బాత్ రూమ్‌లో ఉండడం నాకెంతో ఉపకరించింది"—

"అయితే నా దగ్గర నువ్వు వెయ్యిరూపాయలుతీసుకొని?" అడిగాను ప్రశ్నార్థకంగా.

"అవును. చెప్పానుగా మోసాన్ని మోసంతో జయించాలని అందుకే ఈసారి నేను వెయ్యిరూపాయల్తో వెయ్యి బాలట్ పత్రాలు పంపాను. నానారావు పోయిన ఏడాదిలాగే అయిదువందలే పంపాడు. అతని ఆటకట్టింది." అన్నది రాణి పగలబడి నవ్వుతూ.

"నో....నో.... ఐడోంట్ లైకిట్ ఇలాంటి బహుమతి నాకొద్దు వెంటనే ఎడిటర్స్‌కు జరిగిన విషయం ఉత్తరం వ్రాస్తాను"—అన్నాను కోపంగా.

"మైడియర్ శ్రీవారూ తొందరపడకండి. నేను వెయ్యి బాలట్‌లు పంపకపోయినా మీకే బహుమతి వచ్చేది. అప్పుడు మీకు ఓట్లు పదిహేనువందల అరవైకిబదులు, అయిదు వందల అరవై వచ్చివుండేవి. అలా అయినా సావిత్రి 'ప్రేమపక్షులు' అయిదువందల పదహారుమీద మీకు నలభై నాలుగు ఎక్కువ వచ్చినట్లే....కాదంటారా?"—అన్నది రాణి....

కాదని ఎలా అనగలను?

***

ఫోన్‌కాల్!

పి. గోపాలరావు

ట్రింగ్.... ట్రింగ్.... ట్రింగ్....

ఉదయాన వచ్చిన పత్రికను పనంతా పూర్తయిన తర్వాత తీరిగ్గా ఈజీచైర్లో కూచుని చదువుతున్న సరస్వతమ్మగారికి టెలిఫోన్ శబ్దం వినగానే చిరాకేసింది.

మనకెందుకు టెలిఫోన్ అని ఎంతగా వాదించినా విన కుండా ఆమె భర్త జగన్నాధంగారు ఈ మధ్యనే ఫోన్ పెట్టించారు. జగన్నాధంగారు అడ్వొకేటు. మంచి ప్రాక్టీసు వున్నవాడు కూడాను.

"మన అవసరం అలా వుంచు! మనకి అన్నంపెట్టే కక్షీ దారులకి మనతో ఎన్నో అవసరాలు రావచ్చు. వాళ్లు ఏవో పనులతో సతమతమవుతూ ఇక్కడికి రాలేకపొయ్యారనుకో! మనకి ఫోనువుంటే ఫోనులో అవసరమైన విషయాలు చెప్ప వచ్చుకదా! ఇంకా చిల్లరమల్లర పనులకెన్నింటికో మనకి

ఫోన్ ఉపయోగపడుతుంది" అంటూ జగన్నాథంగారు తన పట్టు నెగ్గించుకున్నారు.

ఫోన్ ఉందని తెలిసిన తర్వాత ఎవరో ఒకరు అడ్డమైన దానికీ ఫోన్ చేస్తుంటారు!

పేపరు కిందపడేసి, రిసీవర్ తీసుకొని "హలో" అన్నది సరస్వతమ్మ విసుగ్గా.

ఎంతో నిర్లిప్తభావంతో ఫోన్ తీసుకున్న ఆమె ముఖ కవళికలు క్షణంలో మారాయి. మనిషి వణికిపోసాగింది.

"ఏమిటి మీరనేది? మా సుజాతా! స్పృహతప్పి పడిపోయిందా! వస్తున్నాం ఇప్పుడే" అంటా ఆమె రిసీవర్ క్రెడిల్ చేసింది. హడావిడిగా "సురేష్, సురేష్" అంటూ మేడ మెట్లదగ్గరికెళ్ళి పిలిచింది. కేకలు పెట్టిందే అనాలి!

సురేష్ సరస్వతమ్మగారి ఏకైక మగసంతానం. బి.ఏ. పరీక్ష ఇచ్చి సెలవుల్లో ఇంటికి వచ్చాడు. కాలేజీ సాహచర్యలతో అతనికి బాగా అలవాటైంది సిగరెట్టు ఒకటి. ఇంట్లో కూడా మేడమీద గదిలో తలుపేసుకుని కూచుని సిగరెట్లు తగలేస్తూ ఉంటాడు.

అమ్మ కేకలకి దిక్కుతోచక "ఏమైందమ్మా" అంటూ సిగరెట్టు ఆర్పేసి, పైన మెట్లదగ్గరికివచ్చి అడిగేడు సురేష్.

కిందకి రమ్మనమని, సురేష్‌కి తాను ఫోన్‌లో విన్నది వివరంగా చెప్పింది సరస్వతమ్మ.

సుజాత సురేష్ చెల్లెలు. 10 వ తరగతి చదువుతోంది. ఎన్నికలమూలంగా పరీక్షలు వాయిదాపడ్డంవలన, స్కూలులో టీచర్లు ప్రత్యేక పరీక్షా పత్రాలంటూ తయారుచేసి ఇచ్చి తమ స్కూలు పిల్లలకి తర్ఫీదు ఇస్తున్నారు; మంచి ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో.

సుజాత హఠాత్తుగా స్కూలులో స్మృహతప్పి పడిపోయి నట్లు ఇప్పుడు స్కూలు మేనేజరు టెలిఫోన్‌చేసి చెప్పాడు. సుజాత రాయిలాంటిపిల్ల ఎలాంటి సుస్తీ ఎరగదు సామాన్యంగా. అలాంటిది అదీ ఇదీ కాక స్మృహతప్పి పడిపోవడమేమిటి? అగమ్యగోచరంగా వుంది.

పోనీ, జగన్నాథంగారిని కోర్టునుంచి పిలిపిస్తామా అంటే, ఆయన ఏదో పెద్ద అప్పీలు దాఖలు చేయడంకోసం పార్టీలతో కలిసి హైద్రాబాద్ వెళ్లాడు. ఇంట్లో తామిద్దరూ తప్ప మరెవ్వరూ లేరు; ప్రస్తుతం.

తల్లి ఆందోళనని గమనించిన సురేష్ "ఆలస్యం దేనికి మనం వెంటనే వెడితే డాక్టరుకైనా చూపించవచ్చు. ఏమైందో ఏమిటో పదమ్మా!" అంటూ తలుపులు గబగబ మూసేసి తాళాలువేసి వీధి మొగలోవున్న రిక్షాను కేకేసి, సరస్వతమ్మగారిని బయలుదేరదీశాడు.

సుజాత చదివే స్కూలు బస్టాండు సమీపంలో వుంది. సరస్వతమ్మగారి ఇల్లు శ్రీనివాస అగ్రహారంలో వుంది. రెంటికీ మధ్యదూరం రెండు మైళ్ళకు పైగానే.

2

"ఏమైందిసార్ మా సుజాతకు!" అంటూ స్కూల్లోకి దూసుకువెళ్ళిన సురేష్ పక్కగదిలో సుజాత నవ్వు వినిపించే సరికి అవాక్కయిపొయ్యాడు.

"ఏంటిబాబూ సుజాతకు ఏమైందని అడుగుతున్నావు! అసలు ఏమైనా అయిందని ఎవరు చెప్పారు నీకు?" అంటూ మేనేజర్, సురేష్‌వైపు కళ్ళప్పగించి చూశాడు. సరస్వతమ్మగారు గది గుమ్మంలోనే నిలబడిపోయింది అయోమయంగా!

"సుజాత మా చెల్లెలు. ఆమె మా అమ్మ, సుజాత

స్పృహతప్పి పడిపోయిందని మీరు ఫోన్ చేశారు కదా మా ఇంటికి!" అన్నాడు సురేష్ ఏమీ అర్థంకాక.

ఈసారి మేనేజర్ అవాక్కయిపోయ్యాడు. కాస్త తమాయించుకుని, "సుజాతను నాకు బాగా తెలుసు. ఆ అమ్మాయి స్పృహతప్పిపోవడమేమిటి? మేము ఫోన్‌చేయడమేమిటి! అంతా కలగా వుంది" అన్నాడు.

అన్న కంఠం విన్న సుజాత హడావిడిగా మేనేజరు గదిలోకి వచ్చి ఈ సంభాషణంతా విన్నది. అమ్మను చూచి, అమ్మా అంటూ వచ్చి అమ్మ చేయిపట్టుకుని నిలబడింది.

"అసలు మీరు మా ఇంటికి ఫోన్‌చెయ్యగానే లేదా?" అడిగేడు సురేష్.

"స్కూలుకి ఫోన్‌వున్న మాట నిజమేకానీ, మీకు అసలు ఫోన్ ఉన్న విషయం కూడా మాకు తెలీదే! కాగా మీ వెనుకనే నిలబడివుంది చూడండి సుజాతని. ఏమని ఎందుకు ఫోన్ చెయ్యడం" అంటూ మేనేజర్, సురేష్ కళ్ళలోకి సూటిగా చూశాడు.

"అయితే ఇదేదో మోసంలాగుంది. అయినా దీనికి కారణం ఏమైవుంటుంది? ఇలా అబద్ధపు ఫోన్‌కాల్ చేసినందువల్ల ఎవరికి లాభం? ఏ విధంగా లాభం?" అన్నాడు సురేష్ సాలోచనగా.

"పోలీస్ స్టేషన్‌లో ఈ వ్యవహారానికి ఏదైనా క్లూ దొరుకుతుందేమో. పోనీ 4 టౌన్ స్టేషన్ దగ్గరోనే వుంది. వెళ్ళివద్దాంపదండి" అంటూ మేనేజర్ ఇటీవలనే కొన్న తన విజయ్ స్కూటర్‌ని బయటకు తీశాడు.

3

4 టౌన్ స్టేషన్ ప్రశాంతంగా నిద్రబోతున్నట్లుంది. మధ్యాహ్న సమయం.

ఇన్‌స్పెక్టర్ కుమార్ ఏవో రొటీన్ కాగితాలు చూచు కుంటున్నాడు. ఆయనకి పక్కగా ఎవరో ఒకాయన మరొక కుర్చీలో కూచుని ఏదో పుస్తకం చదువుకుంటున్నారు.

హడావిడిగా స్టేషన్‌లో ప్రవేశించారు సురేష్, మేనేజర్ మూర్తీ కలిపి. వాతావరణం చూడగానే తాము వివరంగా జరిగింది చెప్పడానికి, తగిన సలహా పొందడానికి వీలుందని వారికి సంతోషం కలిగింది.

ఇన్‌స్పెక్టర్ కుమార్‌కి చాలా అనుభవముంది. సుమారు యాభై ఏళ్లు వుండొచ్చు. కాని అంత వయస్సున్నట్టు కనిపించడు. మూర్తీ, సురేష్‌ల హడావిడి చూడగానే తాను కాలుస్తున్న చుట్టను అష్ట్రేలో పెట్టి "ఏమిటీ విడ్డూరం, ఇక్కడ స్కూలు పిల్లలెవరూ లేరే చదువు చెప్పడానికి మూర్తిగారూ, మా స్టేషన్ పావనం చేశారు" అంటూ చేయి చాపాడు ముందుకి.

ఎదురుగావున్న కుర్చీలలో వాళ్ళిద్దరినీ కూచోవలసిందిగా కుమార్ సూచించాడు.

మూర్తి, సుజాత విషయంలో జరిగిన యావత్తు వ్యవహారాన్ని విశదపరచాడు. "దీనికి అర్థం, కారణం ఏమై వుంటుందని మీ అభిప్రాయం" అని అడిగేడు.

పుస్తకంలోంచి కళ్ళు పైకెత్తి ఈ సంభాషణంతా విన్న రెండోవ్యక్తి "కుమార్‌బాబుకి అభ్యంతరంలేకపోతే నాదొక మాటుంది" అన్నాడు సిగరెట్టు దమ్ములాగి పొగవదలుతూ.

"అయ్యో, మీరు రంగంలోకి దిగుతానంటే మాకు అంత కంటే కావలసిందేముంది రంగనాథ్ భాయ్" అంటూ ఆయన్ని మూర్తీ సురేష్‌లకి పరిచయం చేశాడు.

"ఈయన రంగనాధ్ అని పెద్ద డిటెక్టివ్. షెర్లాక్ హోమ్స్‌ని మించిన చాకచక్యం ఆయనలో వుంది. మేమంతా ఆయనకి వాట్సన్‌లాంటివాళ్ళం" అన్నాడు కుమార్.

డిటెక్టివ్ సాహిత్యంతో పరిచయమున్న సురేష్, రంగనాధ్‌ని గౌరవపురస్సరంగా చూచి నమస్కరించాడు. మూర్తి కూడా ఆయనకి విష్ చేసేడు.

"'మెథడ్స్ ఇన్ క్రైమ్' అనే ఈ పుస్తకాన్ని దాదాపు పూర్తి చేశాను. కో అంటే కోటివిద్యలు. ప్రపంచమే మారి పోతున్నట్టు, నేరాలతో వాటి మార్గాలతో ఎన్నో కొత్త పద్ధతులు వస్తున్నాయి. నేరస్తులను పట్టుకోడానికి కుక్కలను పోలీస్ డిపార్టుమెంటు వినియోగిస్తున్నదని, కుక్కలకి వాసనరాకుండా, మార్గం తెలీకుండా కొత్తపద్ధతులు, మెళకువలు ప్రయోగిస్తున్నారు నేరస్తులు. అయినా, ఎంతో పకడ్బందీగా నేరం చేశామని మురిసిపొయ్యేవాడు కూడా ఏదో పొరపాటు ఎక్కడో చేసి దొరికిపోతుంటాడు. అయినా మనం కాలహరణం చేస్తున్నాం. మీరుండేది ఎక్కడ" అన్నాడు రంగనాధ్.

మూర్తి, సురేష్‌వైపు చూశాడు.

"శ్రీనివాస అగ్రహారంలో" చెప్పాడు సురేష్.

"మీ ఇంటికి మీరు తాళం వేసి వచ్చారు. ఇంట్లో ఇంకెవ్వరూ లేరు. నిజమేనా?" అడిగేడు రంగనాధ్ మరోసిగరెట్ అంటించుకుంటూ.

తల్లీ, చెల్లెలు స్కూల్లోనే ఉండిపొయ్యారు కనుక నిర్భయంగా సురేష్‌కూడా సిగరెట్ పాకెట్ బయటికితీశాడు.

"నిజమే! మీకెలా తెలుసు?" అన్నాడు సురేష్ ఆశ్చర్యపోతూ.

నవ్వాడు రంగనాథ్.

"ఇలాంటి నేరాలకు అదే ప్రాతిపదిక లేకపోతే ఆ ఫోన్ కాల్‌కి అర్థమేలేదు. ఉండండి ఇప్పుడే చెబుతాను." అంటూ టెలిఫోన్ డయిల్ చేశాడు.

"చూడు రమేష్. సుమారు అరగంట ముందు శ్రీనివాస అగ్రహారంలో 515 కి వచ్చిన కాల్‌సోర్స్ ఏమిటో నాక్కా-వాలి. చాలా అవసరం" అన్నాడు రంగనాథ్.

ఒక నిముషం తర్వాత ఆయన ముఖం వికసించింది. "412, బాలాజీనగరేనా, చాలా థేంక్స్" అంటూ ఫోన్ పెట్టేశాడు.

"చూశారా, నా ఊహ నిజమైంది, ఎక్స్ఛేంజిలో నా మిత్రుడొకడున్నాడు. అతనిచ్చాడు ఈ సమాచారం బాలాజీ నగర్‌నుంచి ఈ కాల్ వచ్చింది మీకు. స్కూలునుంచికాదు. వెంటనే మనం బయల్దేరాలి. కుమార్ మీ జీప్!" అంటూ రంగనాథ్ లేచాడు.

4

రైల్వే లెవల్ క్రాసింగ్‌వద్ద జీప్ వదిలేసి, రంగనాథ్, కుమార్, సురేష్, మూర్తి కాలినడకన బయల్దేరారు. అందరూ మఫ్టీలోనే ఉన్నారు.

సరస్వతమ్మగారి ఇంటికి వెనుకవైపు చిన్న సందువుంది. గలీజుగా వుంటుందని దాన్ని ఎక్కువగా జనం ఉపయోగించరు. కానీ జాగ్రత్తగా నడవటం కష్టంకాదు. ఆ సందులోంచి నడుచుకుంటూ వెళ్ళి, సరస్వతమ్మగారి ఇంటి వెనుక ప్రహరీలోవున్న గేటువద్ద నిలబడ్డారు వాళ్ళు.

ఓ ఐదు నిముషాల తర్వాత గేటు మెల్లగా తెరుస్తున్న సవ్వడి వినిపించింది.

తలుపు తీసిన వ్యక్తి అక్కడ మనుష్యులని చూచి, సడన్‌గా తలుపు వెయ్యబోయ్యాడు. ఇలా జరగవచ్చునని ఊహించిన రంగనాథ్ బూటుకాలతో ఒక్క తన్నుతన్నాడు తలుపుని. అలా తంతూనే లోపలికి ప్రవేశించారు రంగనాథ్ అతని వెనుక కుమార్, వాళ్ళ వెనుక సురేష్, మూర్తీనూ.

ఇంకో ఇద్దరు లోపలికి పరుగెడుతున్నారు. వరండాలో ఒక సూట్ కేసు, ఒక పెద్ద మూట వున్నాయి.

రివాల్వర్ తీసి కుమార్ "హేండ్సప్, కదిలితే కాల్చేస్తాను." అన్నాడు వాళ్ళకు గురిపెడుతూ. చేసేదిలేక దొంగలు లొంగిపోయారు. నలుగురు కలిసి వాళ్ళను బంధించారు.

జీప్‌ను పంపించి, సరస్వతమ్మను, సుజాతను పిలిపించారు.

అల్పాహారం, కాఫీ పుచ్చుకున్న తర్వాత రంగనాథ్ తన ఊహకు ఆధారాన్ని వివరించాడు.

"ఇలాంటి సరికొత్త పధకాలు, కొత్త పద్ధతిలో దొంగతనాలు విదేశాల్లో ఇప్పుడు ముమ్మరమైపోయాయి. ఏ ఏ ఇండ్లలో దోచుకోడానికి ఏ మేరకు సామగ్రి, నగలు వగైరా ఉన్నాయి. ఇంట్లో ఏ వేళల్లో ఎవరు వుంటారు. ఈ సమాచారమంతా ముందుగా సేకరిస్తారు.

బిడ్డకు హఠాత్తుగా సుస్తీ చేసిందంటే ఏ ఇంట్లో వాళ్ళయినా హడావిడిగా వెళతారుగదా. ఆ సమయంలో కాచుకుని వుండి చిక్కినమట్టుకు పట్టుకుపోవడం సులభం। మనం వెంటనే మేలుకుని ఇక్కడికి దూకడంతో వాళ్ళ ఆట కట్టించగలిగాము. మనతో సహకరించిన కుమార్‌కి మనం థేంక్స్ చెప్పాలి" అంటూ రంగనాథ్ లేచాడు. ***

"రెండు సున్నాలు"

హుస్సేన్‌బాషా

టెలిఫోన్ మ్రోగింది.

హిందూ ఆంగ్ల దినపత్రికను తిరగేస్తున్న ఇన్‌స్పెక్టర్ మనోహర్, పత్రికను మడచిపట్టుకొని మరో చేత్తో రిసీవర్ ఎత్తి "ఎస్ ఇన్‌స్పెక్టర్ మనోహర్ స్పీకింగ్...." అన్నాడు.

"గుడ్‌మార్నింగ్ సార్! నేను మునిపిపల్ మేస్త్రీ జాన్‌ను. సైదాపేట సెకెండ్ క్రాస్ స్ట్రీట్‌లోయున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్‌నుండి మాట్లాడుతున్నాను సార్. మా స్వీపర్లు చెత్తను ట్రాక్టర్‌లో లోడ్ చేయాలని డస్ట్‌లర్‌ను పడవేశారు. అందులో ఎవరిదో శవం ఉందిసార్."

"డస్ట్‌లర్‌లో శవమా?" ఆశ్చర్యంగా అడిగాడు మనోహర్.

"అవునుసార్! మీరు వెంటనే రండి. మీరు వచ్చేలోగా నేనీ విషయం కమీషనర్‌గార్కి రిపోర్ట్ యిస్తాను."

"ఆ శవం ఎక్కడుంది?"

"సైదాపేట సెకెండ్ క్రాస్, మూడో వీధిలో రోడ్ ప్రక్కన సార్."

"సరే, నేను వెంటనే వస్తున్నాను. నువ్వు కమీషనర్‌కి రిపోర్ట్ యిచ్చి ఆయన్ను వెంటనే అక్కడికి రమ్మనిచెప్పు!"

"అలాగే సారే."

మనోహర్ చేతిలోని న్యూస్ పేపరును విసురుగా టేబిల్ మీద పడేశాడు.

పదిహేను నిమిషాల్లో పోలీస్ జీప్ సైదాపేట చేరుకుంది. మనుషులు గుంపులుగా జేరి శవాన్ని చూస్తున్నారు. పోలీసులు జీప్ దిగి శవం దగ్గరికి పరుగెత్తుకొచ్చారు.

ఇన్‌స్పెక్టర్ మనోహర్‌ను చూసి జనం ప్రక్కలకువెళ్ళి నిలుచున్నారు. శవానికి కొద్ది దూరంలో పాకీ పనివాళ్ళు ఆరుగురు చెట్టుక్రింద నిలుచున్నారు.

మనోహర్ శవం దగ్గరికి వెళ్లాడు. శవం వెల్లకిలా పడుంది. మోకాళ్ళమీద వంగి పరీక్షగా చూడసాగాడు.

శరీరంమీద ఎక్కడా గాయాలులేవు. బట్టలకు రక్తపు మరకల్లేవు. కళ్ళు తెరుచుకొనివున్నాయి. అతను తెల్లని గ్లాస్కోపంచ, గోధుమకలర్ సిల్కులాల్చీ ధరించాడు. శవాన్ని డస్ట్‌బిన్‌లో వేయడంవల్ల బట్టలనిండా చెత్త అంటు కుంది. ముఖం కోలగావుంది. నల్లగా ఉన్నాడు. 30-32 సంవత్సరాల మధ్య వుంటుందతని వయస్సు. కుడికాలుకు ఒక బ్లూరంగు ఆకుజోడువుంది. ఎడమకాలుకు జోడు లేదు.

"మిస్టర్ ప్రభుదాస్! శవాన్ని వెంటనే ఫోటోలు తియ్యి" అని మనోహర్ ఫోటోగ్రాఫర్‌కు పురమాయించాడు.

మనోహర్ చెట్టుకింద నిలుచున్న పాకీవాళ్ళను పిలిచాడు.

"మేస్త్రీ జాన్ ఎక్కడ?" ఒకతడ్ని అడిగాడు.

"కమీషనర్‌గార్కి రిపోర్ట్ చెయ్యడానికి వెళ్లాడు సార్."

"నీ పేరేమిటి?"

"పెంచలయ్య."

"ఈ శవం ఎవరిదో మీలో ఎవరికైనా తెలుసా?"

"తెలియదు సార్."

"మీరు చెత్తకుండీ దగ్గరికి వచ్చినప్పుడు లోపల శవం కనిపించలేదా?"

"కుండినిండా చెత్తవుంది సార్. శవం మాకు కనిపించి యుంటే దీన్ని తొలగించి ఉండేవాళ్ళం కాదు సార్."

"ఆ చెత్తను కెలికి చూడు! హతుని ఎడమకాలు చెప్పు ఉండాలి."

పెంచలయ్య చెత్తనంతా కెలికాడు. చెప్పు కనబడలేదు.

"కానిస్టేబుల్స్! చుట్టుపట్ల వెదకండి, చెప్పు కనిపిస్తుం దేమో!" అన్నాడు మనోహర్.

ఇద్దరు కానిస్టేబుల్స్ వెళ్ళారు.

"ఫొటోలు తీయడం అయిందిగా?" కెమెరాను కేసులోకి సర్దుతున్న ప్రభుదాస్‌ను అడిగాడు.

"తీశాను సార్."

"నువ్వు వెంటనే వెళ్ళి ఫొటోలు డెవలప్ చెయ్!" అని ప్రభుదాస్‌ను పంపించి "208! హతుని జుబ్బాజేబులు వెదుకు!" అన్నాడు.

కాన్‌స్టేబుల్ 208—శవం జుబ్బా జేబులు వెదికాడు. ఒక జేబులో అయిదురూపాయలనోటు మూడుపదిపైసల బిళ్లలు-నేవీకట్ సిగరెట్ పాకెట్, త్రీకాక్స్ బ్రాండ్ అగ్గిపెట్టె వున్నాయి. మరోజేబులో మడతబెట్టియున్న రెండు పెద్ద

కాగితాలున్నాయి. అవి బొంబే వర్లీ చార్ట్స్. దానిమీద ఆ వారం తేదీ ముద్రించి ఉంది. ఇంగ్లీషులో 'న్యూ బొంబే వర్లీ ఫిక్సేడ్ ఖాన్ సెస్' అని వుంది.

"సార్! ఇవి బ్రాకెట్ ఛార్ట్స్. ఇతను బ్రాకెట్లు ఆడడానికి పొరుగూరునుండి వచ్చి ఉంటాడు" అన్నాడు P. C. 208.

మనోహర్ ఆ ఛార్ట్సను తిరగేసి చూశాడు. ఎక్కడా హతుని పేరు లేదు. 21-8-76వ తేదీ కాలములో రెండు సున్నాలు (00) బ్రాకెట్ వేసివుంది. అంటే రాత్రి 12 గంటలకు క్లోజింగ్ వచ్చిం తరువాత ఆ బ్రాకెట్స్ నెంబరు హతుడు వేసివుంటాడు.

మద్రాసులో బ్రాకెట్స్ గేమ్ నిషేధింపబడింది. ఆ గేమ్ జరుగకుండా గట్టి బందోబస్తులు జరిగాయి. హతునివద్ద ఛార్ట్స్—ఛార్ట్సలో రాత్రి వచ్చిన నెంబరు వేసివుందంటే— బ్రాకెట్స్ గేమ్ సీక్రెట్‌గా జరుగుతోందన్నమాట!

"సార్! హతుని చెప్పు ఆ కనబడే చెట్టుక్రింద దొరికింది సార్!" అన్నాడు హెడ్-224 చెప్పును తెచ్చి.

మనోహర్ వెంటనే రోడ్‌కు అవతలనున్న వేపచెట్టు క్రిందికి వెళ్ళాడు. సమీపంలో హోటల్లుగాని, బీడీ బంకులు గాని లేవు. హతుడు ఆ చెట్టు క్రిందికి ఎందుకు వచ్చినట్లు?

మనోహర్ చెట్టుక్రింది ప్రదేశాన్ని పరిశీలనగా చూశాడు. చెట్టుక్రింద మట్టిలో యిద్దరు-ముగ్గురు కలిపి హత్యచేసినట్లు అర్ధమవుతోంది.

హంతకులు అతన్ని ఏ విధంగా చంపారు? ఎందుకు చంపారు?—అంతా అయోమయంగా వుంది మనోహర్‌కు.

మనోహర్ మళ్ళీ శవందగ్గరకు వచ్చాడు. మేస్త్రీ జాన్

సైకిలు దిగి ఇన్‌స్పెక్టర్‌దగ్గరికి వచ్చాడు. "సార్। నేను మేస్త్రీ జాన్‌ను. అరగంటలో కమీషనర్‌గారు యిక్కడికి వస్తానని మీతో చెప్పమన్నారు" అన్నాడు.

2

మధ్యాహ్నం రెండుగంటలకంతా పోస్ట్‌మార్టం రిపోర్టు తయారుచేసి తీసుకొచ్చాడు డాక్టర్ నరహరి.

"డాక్టర్। వాటీజ్ ది మ్యాటర్? హతుడు ఎలా చంప బడ్డాడు?" గాలిలో విడిచిన సిగరెట్ పొగ రింగులకేసి చూస్తూ అడిగాడు ఇన్‌స్పెక్టర్ మనోహర్.

"చాలా విచిత్రమైన హత్య ఇన్‌స్పెక్టర్। హతుడు పెన్సిలిన్ ఇంజక్షన్‌వల్ల మరణించాడు."

ఆశ్చర్యపోయాడు మనోహర్. "ఈజిట్?—" అంటూ ముందుకు వంగి "పెన్సిలిన్ ఇంజక్షన్‌తో హత్యా? క్రొత్త విషయం చెబుతున్నారే?" అని అడిగాడు.

"హంతకుడు సరిక్రొత్త పద్ధతిలో అతన్ని హత్య చేశాడు. ఇన్‌స్పెక్టర్। వందల సంఖ్యల్లో ఏ ఒక్కరికో పెన్సిలిన్ రియాక్షన్‌వల్ల ఆకస్మిక మరణం సంభవిస్తుంది. ఇలాంటి కేసులు అప్పుడప్పుడు జరుగుతుంటాయి. హతుని శరీరానికి పెన్సిలిన్ పడదు. అతనికి పెన్సిలిన్ సరిపడదని తెలిసిన వాళ్ళెవరో—అతనికి తెలియకుండా పెన్సిలిన్ ఇంజక్షన్ యిచ్చి చాలా నైస్‌గా హత్యచేసి తమ తెలివి తేటల్ని ప్రదర్శించుకున్నారు."

"అతనికేదైనా జబ్బుందని తేలిందా?"

"అతను మరణించే సమయానికి అతని కేలాటి జబ్బు లేదని చెప్పగలను. అతను ఆరోగ్యవంతుడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో అతను బిరియాని - చిక్కెన్‌ఫ్రై

ఫోంచేశాడు. విషం లేదు."

"డాక్టర్? పెన్సిలిన్ సరిపడని మనిషికి-రియాక్షన్ జరుగడానికి ఎంత టైం పడుతుంది? అంటే—ఆ మనిషి ప్రాణాలు ఎంతసేపట్లోపోతాయి?"

"ఎంతోసేపు పట్టదు. మందు శరీరంలోకి వెళ్ళిన అయిదు నిమిషాల్లోగా రియాక్షన్ చేస్తుంది. ప్రాణాలు పోవడానికి పదినిమిషాలు పట్టదు."

"అతను పెన్సిలిన్ ఇంజక్షన్‌వల్ల మరణించాడంటే—ఏ డాక్టరైనా ఆ ఇంజక్షన్ అతనికి యిచ్చి ఉండాలి."

"ఏ మెడికల్ షాప్‌లోనైనా పెన్సిలిన్ దొరుకుతుంది. సిరంజి తెచ్చి బలవంతంగా అతని శరీరంలోకి ఇంజక్షన్ యివ్వడం ఎవరికైనా అంత కష్టమేమీ కాదు. అలా కాకుంటే; అతను బ్రాకెట్స్ ఆడే మనిషి. ఆటలో ఎంతో డబ్బు పోయి వుంటుంది. ఆస్తికి మించిన అప్పులు చేసుకొని ఉంటాడు. అప్పుల బాధకు తట్టుకోలేక అతనే ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చు."

"అతను ఆత్మహత్య చేసుకొనివుంటే శవం డస్టలర్‌లో ఎందుకుంటుంది? అతను తన యింటిలోనో, లేక ఏ లాడ్జిలోనో ఆత్మహత్య చేసుకునేవాడుగా?"

అంతలో ఫొటోగ్రాఫర్ ప్రభుదాస్ వచ్చాడు.

మూడు రకాల ఫొటోలు ఇన్‌స్పెక్టర్‌కి అందిచ్చాడు.

"టూట్వెంటీఫోర్?—" హెడ్‌కానిస్టేబుల్‌ను పిలిచాడు.

224 వచ్చాడు.

"నీకు పని అప్పజెబుతున్నాను. మన ఊర్లో రహస్యంగా బ్రాకెట్ ఆట జరుగుతోంది. మఫ్టీలో వెళ్ళి బుక్కర్స్ నందరినీ పట్టుకొని స్టేషన్‌కి తీసుకురా. ఆ

రాస్కెల్స్‌ను విచారిస్తే ఈ మనిషి ఊరు-పేరు తక్కిన వివరాలు తెలియవచ్చు" అన్నాడు.

"అలాగే సార్!" 224 మరిద్దరు కానిస్టేబుల్స్‌ను తీసుకొని బయలుదేరాడు.

3

ఇన్‌స్పెక్టర్ మనోహర్ హతుని ఫొటోలు తీసుకొని తనకు తెలిసిన డాక్టర్ల నందరినీ కలుసుకున్నాడు. హతుని ఫొటోలు చూపించి—ఆ ఫొటోలోని వ్యక్తి ఎప్పుడైనా ట్రీట్‌మెంట్‌కోసం వచ్చాడేమో చెప్పమని అడిగాడు.

అందరు డాక్టర్లలో ఏ ఒకరికైనా హతుడు తెలిసియుంటే అతనికి పెన్సిలిన్ పడదని చెప్పవచ్చు. దాన్నిబట్టి ఆ డాక్టర్‌ద్వారా అతని అడ్రసు దొరుకుతుందని మనోహర్ తాపత్రయం.

ఆ ప్రయత్నంగానే టి. నగర్‌లోయున్న డాక్టర్ శివ ప్రసాద్ దగ్గరికి వెళ్ళాడు.

"గుడ్ ఈవినింగ్ డాక్టర్!"

"హల్లో వెరీగుడ్ ఈవినింగ్ ఇన్‌స్పెక్టర్!" అంటూ ఆహ్వానించాడు డా॥ శివప్రసాద్.

మనోహర్ చిరునవ్వుతో డాక్టర్ శివప్రసాద్ ఎదురుగా కూర్చున్నాడు.

"డాక్టర్! ఈ ఫొటోలోని హతుడు ఎప్పుడైనా మీవద్దకి ఏదైనా ట్రీట్‌మెంట్‌కోసం వచ్చాడేమో బాగా జ్ఞాపకం చేసుకొని చెప్పగలరా?" అని అడిగాడు, శివప్రసాద్ చేతికి ఫొటోలు ఇస్తూ.

శివప్రసాద్ ఆశ్చర్యంగా ఫొటోలకేసి చూస్తూ "ఇతను ఎప్పుడు హత్యకాబడ్డాడు?" అని అడిగాడు.

"రాత్రి ఇతన్ని యెవరో హత్యచేసి సైదాపేటలో ఒక డస్ట్‌బిన్‌లో శవాన్ని పడేసి వెళ్లారు. హంతకులు! డాక్టర్ ఇతడు మీకు తెలుసా?"

"ఇతని పేరు నరసింహం. విల్లివాక్కంలో ఇతనికి 'పద్మా ఫ్యాన్సీస్టోర్స్' ఉంది. అతనికిగాని, అతని కుటుంబంలోగాని యెవరికైనా జబ్బుచేస్తే ట్రీట్‌మెంట్ కోసం నా దగ్గరికే వచ్చేవాడు పాపం! మనిషి చాలా మంచి వాడు." సానుభూతి ప్రకటించాడు శివప్రసాద్.

"నరసింహం గురించి నాకు సరియైన వివరాలు కావాలి డాక్టర్!"

"ఇన్‌స్పెక్టర్! నరసింహానికి గనేరియా వ్యాధి వుంది. అది సుఖవ్యాధి. మందులు వాడినప్పుడు బాగైనా అప్పు డప్పుడూ ఆ వ్యాధి బయటికి పొంగి మనిషిని బాధ పెడు తుంది. అతనికి ఆ బాధ కలిగినప్పుడంతా నా దగ్గరికొచ్చి ఇంజక్షన్ వేసుకునేవాడు."

"ఆ వ్యాధి ఉన్నవాళ్ళకి పెన్సిలిన్ వాడుతుంటారను కుంటాను."

"ఆ వ్యాధికి పెన్సిలిన్ అమోఘంగా పనిచేస్తుంది. కాని, ఇన్‌స్పెక్టర్! అతనికి పెన్సిలిన్ సరిపడదు. అది వాడితే అతను బ్రతకడు. అందుకోసం అతనికి టెర్రామైసిన్ వాడు తుంటాను."

"అతనికి పెన్సిలిన్ పడదని మీరెలా తెల్సుకున్నారు?"

"మొదట అతను నా దగ్గరికి వచ్చినప్పుడు పెనిల్సిన్ మాత్రం వాడకండి డాక్టర్ అన్నాడు. ఎందుకు—అని అడిగాను. ఒకసారి అతనికి గవర్నమెంట్ ఆసుపత్రిలో పెన్సిలిన్ ఇచ్చారట. రియాక్షనై మనిషి చావుబ్రతుకుల్లో

ఉండగా కనుక్కొని వెంటనే ఎమర్జన్సీ ట్రీట్ మెంట్ చేశారట. అదృష్టవంతుడై అప్పుడు బ్రతికి బయటపడ్డాడు."

"ఈ మధ్య నరసింహం మీ దగ్గరికి వచ్చాడా?"

"రెండు మాసాలక్రితం వచ్చి వెళ్ళాడు. మళ్ళీ రాలేదు."

"థ్యాంక్స్ ఫర్ ది ఇన్ ఫర్ మేషన్!" అంటూ మనోహర్, సిగరెట్, పీకను ఆష్ట్రేలో పడేసి బయటికివచ్చి జీప్ ఎక్కాడు.

4

విల్లివాక్కం 4 వ వీధిలోయున్న 'పద్మా ఫ్యాన్సీషాప్' సైన్ బోర్డును చూసి జీపు ఆపాడు మనోహర్. అది లాక్ చేసివుంది.

మనోహర్ జీప్ దిగి ప్రక్కషాపు దగ్గరికి వెళ్ళాడు. షాపు ఓనరు నమస్కరించి "కూర్చోండిసార్!"—అంటూ ఖాళీ కుర్చీ చూపించాడు.

"ప్రక్కషాపు మూసివుంది. అతను ఈ రోజు షాపు తెరువలేదా?"

"అతను పదిరోజులనుండి షాపు తెరువడంలేదుసార్."

"షాప్తని పేరేమిటి?"

"నరసింహం."

"నరసింహం పదిరోజులనుండి ఎందుకు షాపు తెరువడం లేదు నీకు తెలుసా?"

"అతను షాపును ఎవరికో అమ్మేశాడట సార్."

"ఎందుకు అమ్మాడు తెలుసా?"

అతను వెంటనే జవాబు చెప్పలేదు.

"చెప్పండి!"

"అతనికి బ్రాకెట్ పిచ్చి ఎక్కువగా ఉంది సార్. ఆటలో

ఎంతో డబ్బు పోగొట్టాడు. ఊరునిండా అప్పులు చేసు కున్నాడు. అప్పులు తీర్చడానికి, అట ఆడడానికి డబ్బు కావల్సి అమ్మిఉంటాడు. నాకూ వెయ్యిరూపాయలు ఇవ్వాలి. అడిగితే నాలుగైదురోజుల్లో ఇస్తానన్నాడు. కాని, మూడు రోజులనుండి అతను ఊర్లోలేడు."

"ఎక్కడికి వెళ్ళాడు తెలుసా?"

"షాపు అమ్మిన డబ్బుంది. బ్రాకెట్లు ఆడుకుంటూ మద్రాసులోనే ఉండి ఉంటాడు. సార్"

"నరసింహం సైదాపేటలో హత్యకాబడ్డాడు."

అతను అవాక్కయిపోయాడు. వెంటనే అతని నోటి నుండి మాటరాలేదు.

"నీ పేరేమిటి?"

"రామానుజం."

"మిస్టర్ రామానుజం! నీవు కూడా బ్రాకెట్స్ ఆడతావా?"

అతని జేబులో కనిపిస్తున్న బ్రాకెట్స్ చార్ట్‌ను గమనిస్తూ అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నేను బ్రాకెట్స్ ఆడనుసార్. నాకా అలవాటులేదు" అని రామానుజం జేబుమీద చెయ్యివేసి కాగితాలు సర్దుకుంటూ ఇన్‌స్పెక్టర్ ఏమైనా అనుకుంటాడేమోనని సిగరెట్ పాకెట్ తీసి "కాల్చండి సార్!" అని అందివ్వబోయాడు.

"నాకు లంచమా?"

"సార్!?"

"షటప్!—" కోపంగా అరిచి, రామానుజం జేబులో చెయ్యివేసి కొన్ని కాగితాలు బయటికి తీశాడు. అవి న్యూ బాంబే వర్లీఛార్ట్స్. అందులో 21-8-76 తేదీ కాలంలో డబుల్‌జీరో (00) అంకెవేసి ఉంది. కొన్ని ఫిగర్స్‌మీద

నూరు రూపాయలకు ఆడిన బిల్లువుంది. అది ఆ రోజుదే 22-8-76 బిల్లు, 21-8-76 తేదీ క్లోజింగ్‌బిల్లు యాభై రూపాయలకు నెంబర్ 4 మీద ఆడినట్లుంది. ఆ బిల్లులమీద బుక్కర్ల యినిషియల్ తేదీలు ఉన్నాయి.

రామానుజం కంగారుపడ్డాడు. టేబిల్ సొరుగులాగి రెండువందలు తీశాడు. అటూ యిటూ చూసి మనోహర్ చేతుల్లో ఉంచాడు.

"క్షమించండి సార్. నా మీద కేసు రాయకండి?" అన్నాడు.

"యూ స్టుపిడ్!" రామానుజం దవడ ఆదిరిపోయింది. ఆ దెబ్బతో అతను కుర్చీతోబాటు వెనక్కు వెల్లకిలా పడిపోయాడు. "ఉం-గెటప్! నాకు లంచం యిస్తావ్రా ఫూల్! బ్రాకెట్ ఆడుతున్నందుకు. లంచం ఇవ్వడానికి ప్రయత్నించినందుకు నీమీద రెండు కేసులు! కానిస్టేబుల్స్!"

"సార్! నేను పరువుగా బ్రతికేవాడిని...."

మరో చెంప ఛెళ్‌మంది.

"రామానుజం! రాత్రి నువ్వు మద్రాసుకు వెళ్లావు. నరసింహాన్ని కలుసుకున్నావ్. నరసింహం హత్యగురించి నీకు బాగా తెలుసు. నిజం చెప్పు! నరసింహాన్ని ఎవరు హత్య చేశారు?"

రామానుజం భయంతో వణికిపోయాడు.

"నేను మద్రాసుకు వెళ్ళలేదు సార్. ఇక్కడ ఒక బుక్కర్ ఉన్నాడు. 7 గంటలవరకు బుక్కింగ్ చేసుకొని 8 గం॥కు అతను మద్రాసుకు బిల్స్ తీసుకు వెళ్తాడు. పేమెంట్ వుంటే అతనే తెచ్చి యిస్తాడు సార్."

"ఈ బిల్లులమీద యినిషియల్ ఆ బుక్కర్‌దేనా?"

"అవును సార్."

"అతని పూర్తి పేరేమిటి?"

"సుందరం పిళ్లై."

"సుందరం పిళ్లై ఎక్కడున్నాడు?"

"ఊర్లో బుక్కింగ్‌లకు తిరుగుతుంటాడు సార్."

"నిన్నటి బిల్లు- ఈ రోజు బిల్లు- యివి రెండూ అతను వ్రాసినవేనా?"

"కాదు.... ఆ.... అవును...."

"ఇది 21-8-76 తేదీ అంటే నిన్నటి రాత్రి వ్రాసిన క్లోజింగ్ బిల్లు. ఈ యిన్‌షియల్ సుందరం పిళ్లైది కాదనుకుంటాను. ఇది ఓపెనింగ్ బిల్ 22-8-76ది. అంటే ఈ రోజుది. ఇది సుందరం పిళ్లై వ్రాసిన బిల్లు. రామానుజం! రాత్రి 9-30 నిమిషాలకు ఓపెనింగ్ ఫిగర్ వస్తుంది. ఓపెనింగ్ ఫిగర్ వచ్చింతరువాత అంటే 9 గం॥ 30 నిమషాల తరువాత క్లోజింగ్ వ్రాయిస్తారు. రాత్రి నువ్వు మద్రాసుకు వెళ్ళకుంటే - ఈ క్లోజింగ్ బిల్లు ఎక్కడ వ్రాయించావ్?" కోపంగా అరిచాడు మనోహర్.

"నన్ను కొట్టకండి సార్. ఓపెనింగ్ బిల్ సుందరం పిళ్లై దగ్గర వ్రాయించి - రాత్రి నేను క్లోజింగ్ ఆడడానికి మద్రాసుకు వెళ్ళాను. జీరో ఓపెనింగ్ వచ్చింది. 04 బ్రాకెట్ వస్తుందని 4 క్లోజింగ్ యాభై రూపాయలు ఆడాను. దురదృష్టంతో మళ్ళీ జీరో క్లోజింగ్ వచ్చింది. అంటే బ్రాకెట్ డబుల్ జీరో వచ్చింది సార్. ఉదయమే నేను తిరిగి వచ్చేశాను."

"నరసింహాన్ని నువ్వు కలుసుకోలేదా?"

"లేదు సార్."

"మద్రాసులో ఈ క్లోజింగ్ బిల్ వ్రాసిన బుక్కార్ ఎవరు?"

"తంగస్వామి. వడపళనిలో హోటల్ 'నటరాజ్', దగ్గర అతనికి పాన్‌షాపు ఉంది. నేను ఎప్పుడైనా మద్రాసుకు వెళితే అతనిదగ్గరే వ్రాయిస్తాను. ఆ హోటల్లోనే భోంచేసి బెడ్ తీసుకొని రాత్రికి పడుకుంటాను. ఉదయమే బస్‌లో వచ్చేస్తాను సార్."

"మద్రాసులో నరసింహం ఆడేది ఎవరి దగ్గర?"

"టి. నగర్‌లో హోటల్ 'గ్రీన్' దగ్గర బీడీ బంక్‌లో."

"నరసింహం యిల్లెక్కడుంది?"

రామానుజం అడ్రసు చెప్పాడు.

కానిస్టేబుల్స్ నుద్దేశించి అన్నాడు మనోహర్. "మీ రిద్దరు యిక్కడే వుండి రామానుజాన్ని ఎక్కడికీ వెళ్ళనివ్వకండి! మీ రిద్దరూ ఊర్లోకి వెళ్ళి బుక్కార్ సుందరం పిళ్ళై ఎక్కడున్నా వెదికి పట్టుకొని యిక్కడికి తీసుకురండి. నేను నరసింహం యింటికి వెళ్ళి వస్తాను" అని చెప్పి, యిద్దరు కానిస్టేబుల్స్‌ను అక్కడ వుంచి - మరో యిద్దర్ని ఊర్లోకి పంపించి తను నరసింహం యింటికి బయలుదేరాడు మనోహర్.

5

రామానుజం చెప్పిన అడ్రసు ప్రకారం ఇన్‌స్పెక్టర్ మనోహర్ నరసింహం ఇంటిముందు జీపు ఆపాడు. కాని, యింటికి లాక్‌చేసి వుంది.

ప్రక్కింటి ఎదురుగా ఒక ముసలామె పసిపిల్లను ఆడిస్తూ కనిపించింది. మనోహర్ బయట నిలబడి "అవ్వా ఇటురా!" అని పిలిచాడు.

"ఎవరు బాబూ! పోలీసు ఆఫీసరులా ఉన్నారే! ఏం పనిమీద వచ్చారు బాబూ?" అని పసిపిల్లను చంకనెత్తుకొని మనోహర్ దగ్గరికి వచ్చింది.

"నేను పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని. ప్రక్కిల్లు 'పద్మా ఫ్యాన్సీ షాప్', నరసింహంది అనుకుంటాను."

"అవును బాబూ!"

"ఇంటికి తాళంవేసి ఉన్నారు. ఇంటివాళ్ళందరూ ఎక్కడికి వెళ్ళారవ్వా."

"నరసింహం మద్రాసుకు పోయుంటాడు బాబూ! మూడు రోజులైంది. అతను రాలేదు. అతని భార్య కనకమ్మ. ఇద్దరు పిల్లల్ని తీసుకొని పుట్టింటికి వెళ్ళిపోయింది."

"ఎన్ని రోజులైంది కనకమ్మ పుట్టింటికి వెళ్ళి?"

"పదిరోజులైంది బాబూ!"

"ఎందుకు? భర్తతో పోట్లాడి వెళ్ళిందా? లేక, పసుపు-కుంకుమ కోసం వెళ్ళిందా?"

"ఇదంతా మీరెందుకు అడుగుతున్నారు బాబూ?"

"మద్రాసు సైదాపేటలో నరసింహం హత్య చేయబడ్డాడు."

"ఆ(?!" అంటూ నిర్ఘాంతబోయింది ముసలమ్మ.

"చెప్పవ్వా కనకం ఏ కారణంగా పుట్టింటికి వెళ్ళింది?"

"నరసింహం మనిషి చాలా మంచోడు. కాని, అతనికి బ్రాకెట్ల పిచ్చి అమితంగా వుంది. ఎంతో డబ్బు పోగొట్టాడు. భార్య ఒంటిమీద సొమ్ములన్నీ తాకట్లు పెట్టాడు. చివరికి షాపు కూడా అమ్మేశాడు. ఇంట్లో చిల్లిగవ్వ యివ్వలేదు. ఆ యిల్లాలు ఆకలి బాధను తట్టుకోలేక భర్తకు చెప్పకుండా పిల్లల్ని తీసుకొని పుట్టింటికి వెళ్ళిపోయింది బాబూ!"

"ఆమె ఏ ఊరికి వెళ్ళింది?"

"అర్కోణం."

"మేము ఆమెకు కబురు చేయాలి. అడ్రసు తెలుసా అవ్వా?"

"నాకు తెలియదు బాబూ."

మనోహర్ ముసలామెను యింకేమీ అడుగలేదు. వెనక్కు తిరిగి వచ్చాడు.

6

"సార్! యితనే సుందరం పిళ్ళై - ప్రక్క వీధిలో బుక్కింగ్ చేసుకుంటుంటే పట్టుకొచ్చాము. ఇతని దగ్గర ఈరోజు చేసిన బిల్లు, తొమ్మిదివందల నలభై రూపాయ లున్నాయి" అని సుందరంపిళ్ళై దగ్గర స్వాధీనం చేసుకున్న డబ్బు, బిల్స్ ఇన్‌స్పెక్టర్ కిచ్చాడు P.C.

"నీ వృత్తి యిదేనా?"

అతను జవాబు యివ్వలేదు.

"మాట్లాడరా ఫూల్!"

"నేను B.A., పాసయ్యాను సార్. ఉద్యోగం లేదు. మా ఫాదర్ రైల్వేలో పని చేసేవాడు సార్. మూడు నెలల క్రితం హృద్రోగంవల్ల చనిపోయాడు. అమ్మ, ఆరుగురు పిల్లలున్నారు. నాన్న గ్రాంట్ డబ్బు యింకా రాలేదు. సంసారం గడువడం కష్టంగా వుంది. అందుకోసం...."

"సంసారం గడువడంలేదని యిలాంటి నీచమైన బిజినెస్ చేస్తావా? దున్నలాగున్నావే! కష్టం చేసుకొని బ్రతక లేవూ? మద్రాసులో ఈ కంపెనీ ఎక్కడుంది?"

"టి. నగర్ - జవహర్‌లాల్ నెహ్రూ స్ట్రీట్‌లో."

"కంపెనీ ఓనరెవరు?"

"సేట్ మోతీరామ్."

"నరసింహం నీ వద్దనా వ్రాయిస్తాడు?"

"ఊర్లో వుంటే నా దగ్గరే వ్రాయిస్తాడు సార్."

"ప్రతిరోజూ అతను ఎంత ఆడతాడు?"

"మూడు మాసాల క్రితం రోజుకు యిరవై - ముప్పై ఆడేవాడు. అతను రోజూ డబ్బు పోగొట్టుకునేవాడు. కాని, రెండు నెలలనుండి అతను కంటిన్యూగా ఒకే ఫిగర్‌మీద ఆడుతున్నాడు."

"అతను కంటిన్యూ చేస్తున్న ఫిగరేమిటి?"

"డబుల్ జీరో!"

"ఆ ఫిగర్ నిన్నరాత్రి వచ్చిందనుకుంటాను."

"అవును సార్. నిన్నటికి ఆ ఫిగర్‌మీద ఒక వెయ్యి ఎనిమిదివందలు అయింది. అతని అదృష్టం మంచిది. ఉన్న డబ్బంతా కట్టేశాడు. ఆ ఫిగర్ నిన్న రాకుంటే నిజంగా అతను ఆత్మహత్య చేసుకొని వుండేవాడు."

"ఆ డబ్బంతా నీ దగ్గరే కట్టాడా?"

"కంపెనీలో 1,600 కట్టాడు. రాత్రి మద్రాసులో కనబడి నావద్ద రెండు వందలు కట్టాడు. అతనికి పేమెంట్ 1600 క్లోజింగ్ రాగానే సేట్ మోతీరామ్‌తో యిప్పించాను. కంపెనీ వాళ్ళు కూడా పేమెంట్ మొత్తం అతనికి రాత్రి ఇచ్చేశారు."

"మొత్తం నరసింహానికి ఎంత డబ్బు ముట్టింది?"

"రూపాయికి ఎనభై రూపాయలు ప్రకారం అతనికి మొత్తం ఒక లక్షా నలభై నాలుగువేలు వచ్చింది సార్."

ఆశ్చర్యపోయాడు మనోహర్. హత్య కారణం బోధ పడింది.

"రాత్రి రామానుజం కూడా మద్రాసుకు వచ్చాడు. నిన్న

కలుసుకోలేదా?"

"ఓపెనింగ్ వచ్చే టైములో సేట్ మోతీరామ్ కంపెనీ దగ్గర కనిపించాడు. అతన్ని నేను మళ్ళీ చూడలేదు."

"నరసింహం అంత డబ్బు తీసుకొని ఎక్కడికి వెళ్లాడు?"

"తెలియదు సార్."

"రాత్రి మద్రాసులో నువ్వెక్కడ పడుకున్నావ్?"

"పొరుగూరు బుక్కర్స్ వెళితే కంపెనీవాళ్ళే మాకు రూం సప్లయ్ చేస్తారు సార్. హబీబుల్లా రోడ్‌లో వాళ్ళ రూంలో పడుకున్నాను సార్."

"నరసింహం హత్యావిషయం నీ కెప్పుడు తెలిసింది?"

అతను ఉలిక్కిపడ్డాడు. "నరసింహం హత్యా!?...."

"నిజంగా నీకు తెలియదా?"

"ఇంతవరకు నాకు తెలియదు సార్."

"నాటకం కట్టిపెట్టు! మీ రిద్దరూ రాత్రి మద్రాసులోనే అతన్ని యెలాగో సైదాపేటకు పిలుచుకు వెళ్ళారు. బలవంతంగా డబ్బుకోసం - అతనికి పెన్సిలిన్ ఇంజక్షన్ ఇచ్చి హత్యచేశారు. శవాన్ని తీసుకువెళ్ళి డస్టలర్‌లో పడేసి పైన చెత్తవేశారు. నిజం చెప్పండి."

"నన్ను నమ్మండి సార్. అతని హత్యతో మా కేలాటి సంబంధంలేదు. అతను డబ్బు తీసుకొని వెళ్ళేటప్పుడు అతని కూడా డేవిడ్ వెళ్ళాడు."

"డేవిడ్ ఎవరు?"

"శివస్వామి ముదలియార్ స్ట్రీట్ అతను R.M.P. డాక్టరు. మంచి ఆటగాడు. నరసింహం అతనికి బాగా తెలుసు."

డేవిడ్ R.M.P. డాక్టర్ అయితే - నరసింహానికి

పెన్సిలిన్ యింజక్షన్ యిచ్చి హత్యచేసి ఉండొచ్చు! నరసింహానికి పెన్సిలిన్ సరిపడదని అతనికి తెలిసి యుంటుంది. డబ్బుకోసం మనిషి ఎంతకయినా తెగించ గలడు.

"ఆల్‌రైట్! R.M.P. డాక్టర్ డేవిడ్‌తోబాటు - మీ రిద్దరూ నరసింహం హత్యలో అనుమానితులు. మర్యాదగా జీప్ ఎక్కండి!" అని వాళ్ళను తీసుకొని బయలుదేరాడు ఇన్‌స్పెక్టర్.

7

"సార్! అతనే డేవిడ్!" జీప్ దిగుతున్న ఇన్‌స్పెక్టర్ మనోహర్‌కు చూపించాడు సుందరం పిళ్లై. తనను చూసి ప్రక్కకు వెళ్తున్న డేవిడ్‌ను పట్టుకున్నాడు మనోహర్.

"ఎక్కడికిరా పారిపోతున్నావ్ స్కౌండ్రల్!—నరసింహాన్ని హత్యచేసింది నువ్వే కదూ?"

"నేను కాదు సార్."

"మరెవరు చేశారు?"

"నాకు తెలియదు సార్."

"రాత్రి అతను లక్ష 44 వేలు — మోతీరామ్ దగ్గర పేమెంట్ తీసుకొని పోయేటప్పుడు నువ్వు నరసింహం వెంట వెళ్లావని సాక్ష్యం వుంది. నువ్వు R. M. P: డాక్టర్‌వి. అతనికి పెన్సిలిన్ పడదని నీకు తెలుసు. అతన్ని సైదాపేటకు పిలుచుకు వెళ్ళి అతనికి పెన్సిలిన్ ఇంజక్షన్ యిచ్చే హత్య చేశావు. అతన్నా రీతిగా హత్య చేసే అవకాశాలు నీకొక్కడికే వున్నాయి. హత్యలో నీకు సహాయ పడిన వాళ్ళెవరు? ఆ డబ్బు ఎక్కడ దాచావ్? నిజం చెప్పు?"

"రామ! రామ!! నాకేమీ తెలియదు. నేను నరసింహం కలిసి వచ్చిన మాట నిజమే! ఒకసారి అతను ఆటకు డబ్బు లేక నావద్ద అయిదువందలు అప్పు తీసుకున్నాడు. ఆ డబ్బు రాత్రి నాకు యిచ్చేశాడు. డబ్బు జాగ్రత్తగా వుంచుకోమని చెప్పి నేను యింటికి బయలుదేరాను. నాకు దారిలో జాన్-పాల్ కనిపించారు. జాన్ మునిసిపాలిటి మేస్త్రీ! పాల్ అతని స్నేహితుడు. ఏం పని చేస్తాడో నాకు తెలియదు.

'డబుల్ జీరో పడింది. నరసింహం డబ్బు కట్టాడా!' అని నన్ను అడిగాడు జాన్. 'ఒక లక్ష 44 వేలు-పేమెంట్ కూడా తీసుకున్నాడు' అని అన్నాను. 'పాపం! అతను ఆ ఫిగర్‌మీద చాలా డబ్బు తగలేశాడు. అదృష్టవంతుడే!'— అని చెప్పి, హోటల్‌గ్రీన్ వైపుకు వచ్చాడు. నరసింహం హోటల్‌గ్రీన్‌లో వుంటాడని జాన్‌కు తెలుసు, జాన్, పాల్ లను అడగండి సార్! నేను యింటికి పోయాను."

"జాన్—పాల్‌లు ఈ రోజు యిక్కడికి వచ్చారా?"

"వచ్చారు, బార్‌లో వున్నారు."

మనోహర్ బార్‌లోకి వెళ్లాడు. జాన్ చిత్తుగా త్రాగి పేకాటలో కూర్చున్నాడు.

"జాన్!?—" అరిచాడు మనోహర్.

జాన్ అ అరుపులకు అదిరిపోయాడు. తిరిగి చూసి "ఇన్‌స్పెక్టర్!?—" అన్నాడు.

మనోహర్ వెంటనే అతని ప్యాంట్ జేబులో చెయ్యి వేశాడు. చేతి నిండా డబ్బు తగిలింది. సుమారు అయిదు వేల రూపాయలు వుండొచ్చనుకున్నాడు మనోహర్. మరో జేబులో చెయ్యి వేశాడు. త్రీకాజిల్స్ సిగరెట్ పాకెట్, ఖరీదైన ఆటోమేటిక్ సిగర్‌లైట్‌తో బాటు ఒక చీటీ చేతి

కొచ్చింది. తెరిచి చూశాడు. అతని కళ్ళు మెరిసేయి. చీటీ మడిచి జేబులో పెట్టుకోబోయాడు.

జాన్ కంగారుపడి ఆ చీటీని గబుక్కున మనోహర్ చేతుల్లోంచి లాక్కొని నోట్లో వేసుకొని నమిలి మ్రింగేశాడు.

"ఇడియట్! నువ్వు చేసిందేమిటి?" అతని దవడ అదిరి పోయింది.

"సార్!?—" చెంప రుద్దుకుంటూ చూశాడు.

మళ్ళీ జాన్ దవడ పగిలేట్టు కొట్టాడు మనోహర్. "పెన్సిలిన్ యింజక్షన్—సిరంజి 'మధు మెడికల్ స్టోర్స్'లో కొన్న బిల్లు నీ దగ్గరెందుకుంది? నాచేతుల్లోని బిల్లును లాగి నమిలి మింగడానికి నీకెంత ధైర్యంరా ఫూల్....చెప్పు! ఎవరెవరు కలిసి నరసింహాన్ని హత్య చేశారు?"

జాన్ మాట్లాడలేదు.

"నీ మిత్రుడు పాల్ ఎక్కడ?"

"అడుగో!" అని, కంగారుగా వెళ్తున్న పాల్‌ను చూపించాడు జాన్. మనోహర్ రెండు అంగల్లో వెళ్ళి పాల్‌ను పట్టుకున్నాడు.

"నన్నెందుకు పట్టుకుంటున్నారు?" పాల్ కోపంగా అన్నాడు.

"జాన్‌తో కలిసి నరసింహాన్ని హత్య చేసినందుకు."

"అబద్ధం!—"

అతని ముఖం మీద గుద్దాడు మనోహర్.

"కొట్టకండి చెబుతాను. ఈ హత్యకు ముఖ్యకారకుడు బుక్కర్ రామేశం!—మేము ముగ్గురం కలిసి డబ్బుకోసం నరసింహాన్ని హత్య చేశాం."

మనోహర్ జాన్, పాల్‌లను పట్టుకొని హోటల్ బయటికి వచ్చాడు అంతలో—హెడ్ కానిస్టేబుల్ 224 రామేశాన్ని పట్టుకుని మనోహర్‌కు ఎదురొచ్చాడు. "సార్!—వీడు బడ్డీమూసి కంగారుగా పరుగెత్తుతుంటే అనుమానం వేసి పట్టుకొచ్చాను సార్. వీడి విషయమేమిటో కనుక్కోండి!" అన్నాడు.

"నరసింహాన్ని హత్య చేసిన హంతకుల్లో మూడో వాడు. వెరీగుడ్! యితన్ని పట్టుకొని నీ నేర్పును చూపిచావ్. ఏరా ఇడియట్? హత్యచేసి తప్పించుకోవాలనుకుంటున్నావా?" ఇన్‌స్పెక్టర్ కఠినంగా.

రామేశం—జాన్, పాల్‌లను చూసి పళ్ళు కొరికాడు. 'దొంగ వెధవలు తప్పు ఒప్పుకున్నారన్న మాట!'—లోలోన గొణిగాడు రామేశం. ***

స్నేహితుణ్ణి కలవడానికి వెళ్ళిన మిత్రుడు, అతడితో "నా సైకిల్ బయట పెట్టాను మిత్రమా! ఉంటుందా లేక ఎవరన్నా దొంగిలిస్తారా?" అని అడిగాడు.

"నీకా భయం అవసరం లేదు మిత్రమా!—కాకపోతే మా ఇంట్లో ఉన్న వస్తువులు పోతే చెప్పలేను కాని, ఇంటిముందున్న సైకిలు మాత్రము ఎక్కడికి పోదు," అంటూ నవ్వాడు మిత్రుడు.

— టి. శ్రీశైల, చండీఘర్.

అపరిచితులు?

శశిభూషణ్

"పోస్ట్!"

పోస్ట్‌మేన్ కేక విన్పించి, ముందు గదిలోకి వచ్చాను.

వీధి తలుపు గడియతీసి తలుపు తెరిచేలోగా "పోస్ట్" అంటూ మరోసారి కేకపెట్టాడు పోస్ట్‌మేన్.

తలుపు తెరిచాను.

గుమ్మం కవతల పోస్ట్‌మేన్ నిలబడున్నాడు. నన్ను చూసి తల పంకించాడు. "వి. పి. వుంది. రు. 5-25లు. తీసుకుంటారా, ఇంటిమేషన్ ఇవ్వమంటారా?" అడిగాడు.

నాకు నెలకు ఒకసారి వస్తుంది వి. పి. పాకెట్. పైకం చెల్లించి, పోస్ట్‌మేన్ చూపించిన కాగితంలో సంతకం చేసి పాకెట్ తీసుకున్నాను.

పోస్ట్‌మేన్ సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

వీధి తలుపు మూసి గడియ వేశాను.

పడగ్గదిలోకి చేరుకొని మంచంమీద వాలిపోయాను!

వి. పి. పాకెట్ విప్పి, అపన—సప్లిమెంట్ తీసుకున్నాను. మొదట శ్యాంబాబుగారి 'కైలాసనగరం' చదవాలి।

చకచక అపన పేజీలు తిప్పి, సీరియల్ చదవటం ప్రారంభించాను.

ఆ వేళ శనివారం. కాలేజీకి శలవు. క్రితంరోజు ఎవరో విద్యార్థి కారుక్రింద పడి మరణించాడట. ఆ సందర్భంగా ఈ వేళ సెలవు ప్రకటించారు ప్రిన్స్‌పాల్. ఆ విద్యార్థి మా కాలేజీలోనే సెకండ్ బి. ఎ. చేస్తున్నాడని ఆ తర్వాత తెల్సింది.

నే నింకా ఫస్ట్ బి. ఎ.తోనే ఫైట్ చేస్తున్నాను.

"టక్....టక్...." మంటూ వీధి తలుపు కొడుతున్నా రెవరో.

వచ్చింది ఎవరో తెలియదుగాని, ఆ వ్యక్తిమీద చెడ్డ కోపమే కల్గింది. అపన అవతల పడేసి, లేచి వెళ్ళి వీధి తలుపు తెరిచాను.

ఎవరో అపరిచితుడు.

"ఏం కావాలి?" విసుగ్గానే అడిగానేమో.

"అమ్మాయ్" అతను ఆగి నా ముఖంలోకి చూశాడు.

"హావంతి....మిస్ కపిలా హావంతి" అన్నాను గబ గబా—ఈ శని ఎంత తొందరగా వదిలితే అంత మంచిదని ఆలోచిస్తూ.

"నన్ను లోపలికి రానిస్తావా?" ఎంతో వినయంగా, నెమ్మదిగా అడిగాడతను. అయినా అతన్ని నేను లోనికి రానివ్వలేదు. అపరిచితుల్ని నమ్మటానికి లేదు. చాలా కథల్లో చదివాను.

"ఎందుకు?" అన్నాను అతన్ని ఎగాదిగా చూస్తూ.

పాంటు, షర్టు ధరించాడు. ఖరీదైనవే.

"నేను పగటి దొంగను కాదమ్మా! భయపడక!" అన్నాడతను నవ్వుతూ.

అతను నా ఆలోచనల్ని పసిగట్టినందుకు కొంచెం సిగ్గుపడక తప్పలేదు. "అబ్బే.... మీరెవరో నాకు తెలియదు. అంతేగాని, మీరు ఆ బాపతు అని ఎవరన్నారు?" అన్నాను ఇంకేమనాలో తెలియక.

"మరైతే నన్ను లోనికి రానివ్వు!"

ఇహ తప్పదురా భగవంతుడా అన్పించింది. ప్రక్కకు తొలిగి దారి ఇచ్చాను.

అతను గంభీరంగా అడుగులేస్తూ లోనికొచ్చాడు. ఓసారి ముందు గది గోడల్ని, ఫర్నీచర్‌ని పరిశీలించాడు. "ఈ ఇంట్లో ఎందరుంటున్నారు?"

వెంటనే సమాధానం చెప్పలేకపోయాను. ఇతని వాలకం చూస్తుంటే పోలీస్ ఆఫీసర్‌లా అన్పిస్తోంది. మఫ్టీలో వున్నాడేమో! ఏదైనా కేసు సందర్భంగా పరిశోధిస్తున్నాడేమో!

"నేను, ఇంకో స్నేహితురాలు వుంటున్నాం సార్" అన్నాను నెమ్మదిగా.

"ఆ స్నేహితురాలు కన్పించదేం?"

"ఊరెళ్ళింది. ఈ వేళ కాలేజీకి సెలవు. రేపు ఆదివారం కదా! అందుకని వెళ్ళింది. రేపుసాయంత్రానికి వచ్చేస్తుంది. వాళ్ళ ఊరు ఇక్కడికి దగ్గరే. ఆ ఊరు...."

అతను సవ్యసాచిలా మెరిశాడు క్షణకాలం. ఎడమ చేత్తో తలుపు మూశాడు నన్నే చూస్తూ. అదే సమయంలో కుడిచేతిని పాంటుజేబులోకి పోనిచ్చి కత్తి తీశాడు. బటన్

ప్రెస్‌చెయ్యగానే "చక్...." మంటూ బయటపడింది ఆరున్నర అంగుళాల బ్లేడ్.

నా పెదవులు కదలటం మానేశాయ్. నిమిషం పట్టింది- ఆ షాక్‌నుండి నేను బయట పడటానికి.

"ఏయ్....ఎవరు నువ్వు?"

"పగటిదొంగను. నెమ్మదిగా మాట్లాడు. ప్రమాదం."

"ప్రమాదమా? ఎవరికి?"

అతనుఒక్క క్షణం ఆలోచించి బదులిచ్చాడు. "ఇద్దరికీ. చూడమ్మాయ్! నువ్వు అరిచి గోల చేశావనుకో! ఏం జరుగుతుంది! ఈ కత్తి నీ గుండెల్లో జారబడుతుంది. ఈ ఈ లోపల ఇరుగు పొరుగువాళ్ళు వచ్చి నన్ను పట్టు కుంటారనుకో! అఫ్‌కోర్స్....అప్పుడు ఇద్దరికీ ప్రమాదం జరిగినట్టేకదా!"

ఏం చెప్పాలో తోచలేదు నాకు. పగటిదొంగలు.... అవన్నీ కట్టుకథలని ఇన్నాళ్ళూ అనుకున్నాను.

"నేను....నేను స్టూడెంట్‌నిసార్" అన్నాను. మొదట పోలీస్ ఆఫీసర్ అయివుంటాడనుకొని 'సార్' అన్నాను. ఇపుడు ప్రాణభయంతో అన్నాను. నా ముఖం ఆ సమ యంలో ఎలా ఉందోగాని, గుండెలు మాత్రం నిమిషానికి 144 సార్లు కొట్టుకుంటున్నాయ్.

"దొంగకు ఎవరైనా ఒక్కటే" అని చటుక్కున అటు తిరిగి, తలుపుకి గడియ బిగించి గిర్రున ఇటు తిరిగాడు. "బుద్ధిమంతురాలివి" అన్నాడు బొమ్మలాగా నిలబడున్న నన్ను చూసి నవ్వి.

"మీరు చెపుతున్నది కూడా నిజమేసార్!" అరనిమిషం శ్రమపడిన తర్వాత నవ్వగలిగాను. "ఇక్కడ బుక్స్‌తప్ప

మరేం చిక్కావు మీకు దోచుకోవటానికి. ఇది స్టూడెంట్స్ వుంటున్న ఫ్లాట్ కదా!"

"బందుకరో మజాక్!"

ఆ కంఠంలోని కరుకుదనానికి అదిరిపడ్డాను. దడదడ కొట్టుకుంటున్నాయ్ గుండెలు.

అతని పెదవులు తిరిగి కదిలాయ్. "మెడలోని గొలుసు చెవుల్లోని రింగులు, వ్రేలికున్న వుంగరం, రిస్ట్‌వాచీ ఇవ్వు. సూట్‌కేసుల్లో బట్టలక్రింద డబ్బులు ఏవైనా దాచుకొని ఉంటే అవి కూడా."

"భయ్యా! నువ్వు అడిగినవి ఇస్తాను. కాని, నా కొక సందేహం" అన్నాను బలవంతంగా నవ్వి. అరిచి గోలచేసి నూరేళ్ళ నిండుజీవితం పాడుచేసుకోవటం అవివేక మనిపించింది ఆ క్షణాల్లో

ఆశ్చర్యపోయాడు దొంగ. "అమ్మాయ్! నీకు భయం వెయ్యటంలేదా?"

"భయమా? ఎందుకు?"

"నేను దొంగను. నా చేతిలో కత్తివుంది."

"నువ్వు చెప్పినట్టు నేను వినకుంటేకదా, ఆ కత్తి గురించి మనం యోచించాల్సింది" మళ్ళీ నవ్వాను. అది ఏడవలేక నవ్వేనవ్వు. బయటి సహాయం అందుతుందనే ఆశలేదు. సహాయానికి కేకలు పెట్టడం నా కిష్టంలేదు. ప్రాణభయంతో గొలుసు తీయబోయాను.

"టక్ ... టక్ ...."మంటూ ఎక్కడో బూట్లు చప్పుడు అవుతోంది. వీధిలో కాబోలు!

"అమ్మాయ్....గొలుసు తియ్యక! నేను పగటిదొంగను కాదు!" అన్నాడతను నవ్వుతూ. వీధిలోని బూట్లు చప్పుడు

విన్న వెంటనే ఆశ్చర్యపోయాను.

అతన్ని నమ్మాలో, నమ్మకూడదో అర్థంకాలేదు. "నువ్వు మీరు దొంగకాదా?"

"కాదు" అంటూ కత్తి మడిచి జేబులో పడేసుకున్నాడతను. "పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని. మఫ్టీలో ఉన్నానమ్మా! ఇలా వచ్చి ఒక దొంగ బెదిరిస్తున్నాడు ఈ ఊర్లో. వాడు ఈ రోజు మా కంట్లోపడ్డాడు. కానిస్టేబుల్స్‌ని నమ్మలేక నేనే దొంగవెంటబడ్డాను. తరిమేసరికి నాకు చిక్కకుండా ఈ వీధిలోకి జారబడ్డాడు ఆ రాస్కెల్. ఏ ఇంట్లో దూరాడో తెలియదు. అందుకే ప్రతి ఇంటికీ వెళ్ళి, ఇలాంటి ప్రమాదం వుందని అందరినీ హెచ్చరిస్తున్నాను."

నా అంచనా పొరబాటు కానందుకు సంతోషించాను. "సార్! మీరు...."

"టక్....టక్...." ఎవరో వీధి తలుపు తడుతున్నారు.

నన్ను అవతలిగదిలోకి లాక్కుపోయాడు మఫ్టీలోనున్న ఇన్‌స్పెక్టర్.

"చూడమ్మా! దొంగ వచ్చినట్లున్నాడు. భయపడొద్దు! వెళ్ళి గడియతీసి తలుపు తెరువు. వాణ్ణి మాటల్లోకి దింపి ముందు గదిలోనేవుంచు. వీలుచూసుకొని నేనువచ్చి అతన్ని పట్టుకొంటాను. జాగ్రత్త!" లోగొంతుకతో హెచ్చరించి, నా చేయివదిలాడు.

"ఓ.కె, సార్! మీరు ఈ తలుపుచాటున దాక్కోండి" ధైర్యంగా వచ్చి వీధి తలుపు తెరిచాను.

ఆరడుగుల ఎత్తున్న ఓ వ్యక్తి కన్పించాడు గుమ్మం వెలుపల. టెరిలిన్ దుస్తులు తొడిగాడు. నల్లగా వున్నాడు.

"ఎవరు కావాలి?" అన్నాను నిర్లక్ష్యంగా.

అతను ఓసారి నన్ను ఎగాదిగా చూశాడు. "ఇంట్లో పెద్దవాళ్ళు ఎవరూ లేరా?"

"లేరు. ఆడపిల్ల ఒక్కతే ఉండటం జీవించటం-నేరం కాదు" అన్నాను బింకంగా. నేను ఒంటరిగా ఉంటున్నానని తెలిస్తే దొంగ మరింత తొందరగా, ధైర్యంగా లోని కొస్తాడని, లోపలున్న ఇన్‌స్పెక్టర్‌కి చిక్కిపోతాడని ఆ విధంగా మాట్లాడాను.

అతను నా అనుమతి అడగకుండా లోనికొచ్చాడు. దొర అయివుంటే కదా నా అనుమతి అడగటానికి!

"అమ్మాయ్! ఎవడైనా అపరిచితుడు ఇటువైపు వచ్చాడా?"

నువ్వు అపరిచితుడు కాక నాకు బంధువా, ఏమిటి? అనాలన్పించింది. అతను పడగ్గదివరకెళ్ళి ఇటు తిరిగాడు. ఆ గదిలోనే ఇన్‌స్పెక్టర్ వున్నాడని తెలియదు పాపం!

"ఎవరూ రాలేదు" అన్నాను. "ఇంతకూ తమరు ఎవరండీ?" హేళనగా అడిగాను.

"పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని."

అతని అవతారం చూసి ఇన్‌స్పెక్టరును అంటే నాకు నవ్వు ఆగలేదు.

నా పడగ్గది తలుపు చాటున దాక్కొనున్న ఇన్‌స్పెక్టర్ హఠాత్తుగా ప్రత్యక్షమయ్యాడు. నన్ను చూస్తూ నిలబడున్న దొంగని చటుక్కున వెనుకనుంచి వాటేసుకున్నాడు.

తృళ్ళిపడ్డాడు దొంగ. గింజుకున్నాడు. ఇన్‌స్పెక్టర్‌ది ఉడుంపట్టులా వుంది. దొంగని అంగుళమైన కదలనీయకుండా బంధించి వుంచాడు చేతుల్తో.

పట్టుబడిన దొంగ ముఖంలోకి చూశాను. "సారీ దొంగ

గా హా!" అన్నాను నవ్వి. కళ్ళలోంచి నిప్పులురాల్చాడు.

ఇన్‌స్పెక్టర్ దొంగని నా పడగ్గదిలోకి లాక్కుపోయాడు-"అమ్మాయ్! నీవు కూడా రావాలి!" అని అరిచి చెప్పి.

పరుగెత్తాను.

"అమ్మాయ్, హవంతీ! వీణ్ణి వదిలితే మన ఇరువురి ప్రాణాలూ తీస్తాడు. నా పాంటు జేబులో క్లోరోఫాంలో ముంచబడిన జేబురుమాలు వుంది. దాన్నితీసి వీడి ముక్కు మీద వేసి నొక్కి పట్టుకో!" గబగబ చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

"అమ్మాయ్.... నేను పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని" అరుస్తున్నాడు దొంగ. అతని చేతుల్ని వెనక్కు విరిచి గట్టిగా పట్టుకొనున్నాడు ఇన్‌స్పెక్టర్.

ఇన్‌స్పెక్టర్ పాంటు జేబులోకి చేతిని పోనిచ్చి, జేబురుమాలు తీశాను. పొలిథిన్ పేపర్‌లో చుట్టబడుంది.

"జాగ్రత్త! కాసేపు ఊపిరి బిగించు. లేకుంటే ముందు నువ్వే స్పృహ తప్పిపోతావ్!" హెచ్చరించాడు ఇన్‌స్పెక్టర్.

ఊపిరి బిగబట్టి, జేబురుమాలను కప్పివున్న పొలిథిన్ పేపర్‌ని విడదీశాను. చటుక్కున జేబురుమాలు దొంగ ముఖం మీద వేసి అదిమాను. అతను ఏదేదో అరుస్తూనే వున్నాడు.

నన్ను తినేసేలా చూస్తూ, రెండు నిమిషాల తర్వాత తల వాల్చేశాడు దొంగ.

జేబురుమాలు దొంగ ముఖం మీద నుంచి తప్పించి, తిరిగి పొలిథిన్ పేపర్లో చుట్టి బల్లమీద పడేశాను.

ఇంతలో స్పృహ తప్పివున్న దొంగను నేలమీద పడుకోబెట్టి, ముందు గదిలోకి వెళ్ళాడు ఇన్‌స్పెక్టర్. నేను

చూస్తూండగానే వీధి తలుపు మూసి గడియవేశాడు.

నా గుండెలు తిరిగి వేగంగా కొట్టుకోవడం ప్రారంభించాయ్. గిర్రున వెనుదిరిగి. నేల మీద స్పృహ తప్పి పడున్న దొంగో, ఇన్‌స్పెక్టరో తెలియని ఆసామి జేబుల్లో తడిమాను, రివాల్వర్ చిక్కింది. మంచం మీదున్న అపన అందుకొని, దాని చాటున రివాల్వర్ దాచుకొని నిలబడ్డాను.

ఆ వ్యక్తి తాపీగా అడుగులేస్తూ పడగ్గదిలోకి వచ్చాడు. అతని చేతిలో బటన్ నైఫ్వుంది, బటన్ అప్పటికే ప్రెస్ చేసివున్నాడు. తెల్లగా మెరుస్తున్న స్టీల్ బ్లేడ్‌ని చూస్తున్నా నాకు భయం వెయ్యలేదు.

"అమ్మాయ్! నేను ఇన్‌స్పెక్టర్‌ని కాను—అతనే ఇన్‌స్పెక్టర్" అన్నాడు లోనికొస్తూనే. ఓసారి చూపుల్ని స్పృహ తప్పివున్న వ్యక్తి మీదకు మళ్ళించి, తిరిగి నన్ను చూస్తూ చెప్పసాగాడు:

"నా పేరు రంగనాథం. పగటి దొంగతనం నా వృత్తి. సాధారణంగా పగలు పది గంటలు దాటితే ప్రతి ఇంట్లోనూ ఆడవాళ్ళు మాత్రమే వుంటారు. వారిని బెదిరించటం, భయపెట్టడం పెద్ద కష్టం కాదు. అలాగే జీవిస్తున్నాను చాలా రోజులుగా.

ఈ రోజు నన్ను చూడగానే వెంటబడ్డాడు ఈ ఇన్‌స్పెక్టర్. ఇతను ఇన్‌స్పెక్టర్ అని నాకు తెల్సు. నాకే కాదు. నావంటి వారి కందరికీ తెలిసేవుంటుంది. మా రెండు జాతుల వాళ్ళు మారువేషాల్లో వున్నా పరస్పరం గుర్తించగలము...." మాటలు ఆపేసి నవ్వాడు రంగనాథం.

"అమ్మాయ్! నేను కోరినవి ఇచ్చావంటే నా దారిన నేను వెళ్తాను" అన్నాడు మళ్ళీ తానే.

"కథ ఇంకా కొంచెం వుంది, బ్రదర్!" చేతిలోని పుస్తకాన్ని జారవిడిచి చటుక్కున రివాల్వర్‌ని రంగనాథం గుండెలకు గురి పెట్టాను. "కత్తి పారేయ్ లేకుంటే నిర్దయంగా చంపేస్తాను కాల్చి!"

ఈసారి షాక్ తినటం రంగనాథం వంతు అయింది. కత్తి జారేస్తూ గొణిగాడు. "నీకు రివాల్వర్ ఎక్కడిది?"

"ఇందాక నువ్వు వీధి తలుపు గడియ వెయ్యటానికి వెళ్ళావ్—గొర్తుందా? అప్పుడు తీసుకున్నాను స్పృహ తప్పివున్న ఇన్‌స్పెక్టర్‌గారి జేబులోంచి....పిచ్చి పనులు చెయ్యక" అరిచాను.

ముందుకు అడుగు వెయ్యబోయిన రంగనాథం టక్కున ఆగిపోయాడు.

"నీ ఎడమచేతి ప్రక్కన గోడవారగా బల్లవుంది. దాని మీద నీ జేబు రుమాలు వుంది. ఊఁ! దాన్ని తీసుకో!" రెండడుగులు వెనక్కి నడిచాను. "లేకుంటే నొక్కేస్తాను. నువ్వు దొంగ అని తెలిసి చంపానని చెపుతాను కోర్టులో. నామీద అఘాయిత్యం చెయ్యబోయావని కూడా చెబుతాను. నువ్వు చావటం .... నా చేతిలో చావటమే జరిగి, నేను కోర్టులో ఆ విధంగా చెప్పగలిగితే, నిన్ను హత్య చేసినందుకు నన్ను మెచ్చుకుంటుంది చట్టం. బ్రతకాలని వుంటే జేబురుమాలు అందుకో!"

నా కంఠంలోని మార్పుకు కంగారు పడ్డాడో, నా మాటలకు బెదిగిపోయాడో తెలియదు గాని, కిక్కురు మనకుండా బల్లమీదున్న జేబురుమాలు అందుకొని వాసన చూశాడు రంగనాథం, పొలిథిన్ పేపర్ తీసి అవతల పారేసి.

ఆ తర్వాత ఏం జరిగుంటుందో మీకు తెల్సు. ***

గూండా చేసిన పెళ్ళి

వసుంధర

అది నిరుపేదలు నివసించే మురికి కాలనీ. అక్కడి మనుషులు చూడ్డానికి డోకొచ్చేలా ఉంటారు. వాతావరణం కంపుకొడుతూ ఉంటుంది. చాలావరకూ పూరి గుడిసెలు. కొన్ని రేకుల షెడ్లు. బహు కొద్దిమాత్రం ఇటిక కట్టడాలు.

ఆ మురికి కాలనీని అందరూ మురికి కూపమని చెప్పుకుంటూంటారు. మనిషి పాపం చేస్తే నరకానికి వెడతాడంటారు. ఆ నరకం బ్రతికుండగానే సంప్రాప్తిస్తుందని కూడా చాలామంది అంటారు. అదే నిజమైతే, ఆ మురికి కూపాన్ని నరకమని కూడా అనవచ్చు. ఎందుకంటే ఆ కాలనీలో ఉన్నవారందరూ కూడా ఇంచుమించు పాపం చేసినవారే!

దొంగతనాలు, వ్యభిచారం, మోసాలు అనర్గళంగా సాగించగల ధీరులెందరో ఆ కాలనీలో ఉన్నారు. వీటివల్ల

వారాట్టే బాగుపడలేదనడానికి సూచనగా వారింకా ఆ కాలనీ లోనే ఆ మురికి కూపంలోనే నివసిస్తున్నారు.

మరో విచిత్రమేమిటంటే, ఆ కాలనీ వాతావరణం మనుషులు నివసించడాని కనువైనది కానప్పటికీ, ఆ కాలనీ మనుషులు పశువులకన్న హీనంగా బ్రతుకుతున్నప్పటికీ, దానికి మనుషుల కాలనీగా ప్రజల్లోనూ ప్రభుత్వంలోనూ గుర్తింపు లభించిందనడానికి సూచనగా ఆ కాలనీకో పేరుంది. ఆ కాలనీ పేరు ధర్మనగర్.

ధర్మనగర్ కాలనీని కొన్ని భాగాలుగా విడదీసుకుని, ఒకో భాగానికి అధిపతిగా ఉంటూండే కొంతమంది గూండా లున్నారు. ఆ గూండాలు పచ్చినెత్తురు త్రాగుతారని ప్రతీతి. ఆ కాలనీలో ఆ గూండాలు మకుటం లేని మహారాజులు. వాళ్ళవాళ్ళ భాగాలలో వారి మాటకు తిరుగులేదు. ఎదురు చెప్పి బ్రతకగలవాడు లేడు.

ఈ మకుటంలేని మహారాజులు, తమ భాగంలోని ప్రజల మీద తోచిన రకంగా పన్నులు, ఆంక్షలు విధిస్తూంటారు. ఆయా ప్రజలు వాళ్ళు చెప్పినవిధంగా మసలుకోవలసిందే. ఇందువల్ల వారికున్న ప్రయోజనం, రక్షణ! తననుంచి తప్ప మరెవ్వరినుంచీ తన ప్రజల కిబ్బంది కలక్కుండా ఆ ప్రభువు చూసుకుంటాడు.

ఇలాంటి కొంతమంది గూండా ప్రభువుల్లో రంగ డొకడు. వాడికి చిన్నప్పుడు తలిదండ్రులు, ఏ రంగనాధ రావనో పేరుపెట్టి ఉండవచ్చు. కానీ ప్రస్తుతం వాడికి స్థిరపడ్డ పేరు రౌడీ రంగడు. రౌడీ రంగడంటే ఆ కాలనీ లోనూ, ఆ నగరంలోనూ మాత్రమేకాక, ఆ జిల్లాలోనూ ఆ రాష్ట్రంలోనూ కూడా పేరుంది.

రంగడు చదువుకుని వుంటే చాలా గొప్పవాడై ఉండే వాడు. వాడి చిన్నతనమంతా ఈ కాలనీలోనే గడిచింది. అందువల్ల వాడు గొప్పవాడు కాకుండా, గొప్పవాళ్ళకు తొత్తుగా ఉండిపోయాడు.

నగరంలోని చాలామంది గొప్పవాళ్ళకు రంగడితో పరిచయమూ, అవసరమూ ఉన్నాయి. తమ తమ గొప్ప తనాలు నిలబెట్టుకోవడానికి, రంగడు చేసే తక్కువ పనులు వారికి తరచుగా అవసరమవుతూంటాయి.

రంగడు తన పనులు నెరవేర్చుకునేందుకు స్వయంగా పథకాలు వేస్తాడు. వాడి పథకాలు చాలా పకడ్బందీగా ఉంటాయి. ఎన్నో నేరాలుచేసినా వాడింతవరకూ క్షేమంగానే ఉన్నాడు. రంగడిచేత దెబ్బలు తినడమంటే సామాన్యం కాదు. అందుచేత సాధారణంగా వాడితోటి ఎవరూ గొడవ పెట్టుకోరు.

ధర్మనగర్ కాలనీలో కేవలం ఒక భాగానికి మాత్రమే రంగడు అధిపతి. అలాంటి భాగా లాకాలనీలో ఇంకా చాలా ఉన్నాయి. కానీ రంగడికున్న పేరెవ్వరికీ లేదు. సరైన సమయం వస్తే, రంగడిమీద దెబ్బతీయాలనుకునే గూండా లాకాలనీలో లేకపోలేదు.

అలా అసూయపడేవారిలో శంకరం అనే వాడొకడు. ఈ గూండా లందరిలోకీ వాడు కొస్త చదువుకున్నవాడు. కుయుక్తుల్ని పన్నడంలో వాడికివాడే సాటి అని చెప్పు కుంటారు. ఉళ్ళోని పెద్ద తలకాయలకి వీడే మెదడని చాలామంది అనుకుంటూంటారు. అయినా గూండాలలో రంగడి తర్వాతే శంకరమని చాలామంది అనుకోవడం మినహాయిస్తే శంకరానికి రంగడిపట్ల కోపముండడానికి

మరే కారణమూ లేదు.

తిరుగులేని గూండాల ప్రభువుగా పేరుకెక్కిన రౌడీ రంగడు తన గుడిసెలో కూర్చుని ఉన్నాడు. పనేమీ ఉన్నట్లులేదు. తీరుబడిగా ఆలోచిస్తున్నాడు. ఆ ఆలోచనల్లో తన జీవితం గురించి విమర్శించుకున్నాడు. తనెందుకు పుట్టాడు? ఏంచేస్తున్నాడు? ఇలా ఎంతకాలం బ్రతుకుతాడు? ఆ తర్వాత తను చచ్చిపోయాక ఏమవుతుంది?

రంగడు తన ఆలోచనల్లో ఉండగా, ఆ గుడిసెలోకి ఎవరో వచ్చారు. రంగడు అలికిడికి తలెత్తిచూసి, "నువ్వా?" అన్నాడు.

"అవున్నా! గిరిబాబుగారు కబురెట్టారు."

"గిరిబాబుగారే! పెద్ద పనా, చిన్న పనా" అడిగాడు రంగడు.

"ఆయనకు పెద్ద పనే! మరి నీకు పెద్ద పనవుతుందో కాదో తెలియదు."

"సర్లే. సాయంత్రాని కొస్తానని చెప్పు" అన్నాడు రంగడు.

"లేదు! కారు తీసుకుని వచ్చా. ఇప్పుడే...." అన్నాడా వ్యక్తి.

రంగడు లేచాడు. ఆ లేవడంలో వేటకు బయల్దేరిన మృగరాజు ఠీవి ఉంది.

2

"శ్యామలను నా కప్పజెప్పాలి" అన్నాడు గిరిబాబు.

"ఎవరా శ్యామల?" అన్నాడు రంగడు.

"ఓ బడిపంతులు కూతురు. డబ్బు లేకపోయినా గర్వానికి లోటులేదు. డబ్బిస్తానన్నా గర్వం ఎక్కువైంది తప్పితే

తగ్గలేదు" అన్నాడు గిరిబాబు.

"అదిసరే! ఇలాంటి విషయాల్లో మీకు శంకరం ఉండాలి కదా" అన్నాడు రంగడు. వాడీప్రశ్న అడగడంలో సబబుంది. ఆడపిల్లల్ని మోసంచేసి గిరిబాబులాంటి వాళ్ళ కప్పగించడంలో శంకరం సిద్ధహస్తుడు.

"దేనికైనా వాడు నీ తర్వాతే కదా! శ్యామల విషయంలో వాడివల్ల పని జరగదు" అన్నాడు గిరిబాబు.

"అన్నీ తెలిసిన మీరే ఇలా అనడం నాకాశ్చర్యంగా ఉంది. వాడికో అవకాశమిచ్చి చూశారా."

"పొగరుబోతు వెధవ!" గిరిబాబు పళ్ళు కొరికాడు. "వాడి కారణంగా వ్యవహారం మరింత కష్టమయింది తప్పితే పని జరగలేదు."

ఏదో జరిగిందని రంగడు పసికట్టాడు. "జరిగినదేమిటో కాస్త వివరంగా చెప్పండి" అన్నాడు.

"పూర్తి వివరాలే ఇస్తాను. విను" అన్నాడు గిరిబాబు.

* * *

"నా పేరు గిరిబాబు. లక్షరూపాయలు ఖర్చుచేయడానికి క్షణమాత్రం సమయం చాలు నాకు. పదిలక్షలు సంపాదించడానికి అరక్షణం చాలు...." అన్నాడు గిరిబాబు.

"నా పేరు శ్యామల. పదిలక్షలు అరక్షణంలో ఖర్చు చేయగలను కానీ, సంపాదించడం మాత్రం చేతకాదు" అంది శ్యామల.

"ఎంతమాట. మీరు ప్రయత్నిస్తే అదంత కష్టంకాదు" అన్నాడు గిరిబాబు.

శ్యామల ముఖం ఎర్రబడింది. "నాకు సంపాదించాలన్న కోరికలేదు."

"అదీ సహజమే. మీ అందం కోట్లకొద్దీ విలువ చేస్తుంది. ఇంత అందమున్న మీకు డబ్బుమీద మోజులేక పోవడంలో ఆశ్చర్యమేముంది?" అన్నాడు గిరిబాబు.

"నా అందాన్ని పొగిడినందుకు చాలా థాంక్స్" అంది శ్యామల.

"కేవలం థాంక్స్ కోసం మీ అందాన్ని పొగడలేదు" అన్నాడు గిరిబాబు.

"అంటే...." అంది శ్యామల.

"నాకు మీరు కావాలి" అన్నాడు గిరిబాబు.

శ్యామల ప్రాన్పడిపోయింది. అంత ఖచ్చితంగా, నిర్మొహమాటంగా తన కోరికను తన ముఖంమీదే గిరిబాబు వెలిబుచ్చుతాడని ఆమె అనుకోలేదు. ఆమెకు నోటమాట రాలేదు.

"డొంక తిరుగుడు వ్యవహారాలు నాకు చేతకావు. అనదల్చుకున్నదేమిటో ముఖంమీదే చెబుతాను. నాకు మీరు కావాలి. నా కోరిక తీరితే అందుకు మీకు తగ్గ ప్రతిఫలం కూడా ఉంటుంది" అన్నాడు గిరిబాబు.

శ్యామల కాస్త తేరుకోగలిగింది. "డొంక తిరుగుడు వ్యవహారాలు నాకూ ఇష్టముండవు. అందుకే మీరింక ఇలా పార్కుల్లో కలుసుకోవడం మానేసి తిన్నగా మా ఇంటికే రండి. అన్ని విషయాలూ మా నాన్నగారితోనే మాట్లాడ వచ్చు."

"కానీ మీ నాన్నగా రిందుకు ఒప్పుకుంటారా అని."

"మా నాన్నగారి గురించి నాకు బాగా తెలుసు" అంది శ్యామల. అందం, డబ్బు ఉన్న యువకుడు కోరి తనను పెళ్ళి చేసుకుంటానంటే తండ్రి కాదంటాడని శ్యామల

అనుకోడం లేదు.

"మీ కింకా లోకజ్ఞానం తెలియదు. మీ నాన్నగారి తరం ఎంత పేదరికాన్నైనా సహిస్తారుకానీ కూతురికి వెలకట్టడం సహించలేదు" అన్నాడు గిరిబాబు తాపీగా.

"వెలకట్టడమా! అంటే?" అంది శ్యామల అర్థంకాక.

"పెళ్ళంటే అది వేరు. కానీ తన కూతురు ప్రతిఫలాన్నాశించి ఎవరికైనా తాత్కాలిక భార్యగా వుండడానికి మీ నాన్నగారంగీకరిస్తారని నేననుకోను" అన్నాడు గిరిబాబు.

శ్యామల నిశ్చేష్టురాలైపోయింది.

"చూడండి! ఈ విషయం మీ నాన్నగారికి తెలియనవసరంలేదు. ఇలాంటి వ్యవహారంలో తెలివిగా ప్రయత్నించాలి. మీమీద ఎవరికీ అనుమానం రాకుండా, మీకే ప్రమాదమూ రాకుండా నేను చూసుకుంటాను. ఫలితంగా మీరు కోరిన ధనమిస్తాను" అన్నాడు గిరిబాబు నెమ్మదిగా.

"యూ స్టుపిడ్!" అంది శ్యామల తేరుకుని.

"స్టుపిడ్ నేను కాదు. క్యుపిడ్ ఈజ్ స్టుపిడ్!" అన్నాడు గిరిబాబు.

మరుక్షణం గిరిబాబు చెంప ఛెళ్లుమంది.

"మిస్టర్ గిరిబాబూ! నాకున్న ధనం అందమొక్కటే కాదు. అభిమానం కూడా." అని శ్యామల అక్కణ్ణించి చరచరా నడిచి వెళ్ళిపోయింది.

* * *

"చెప్పండి బాబూ! ఈ శంకరం మీ ఉప్పు తిని పెరిగాడు. ఏం కావాలన్నా క్షణాలమీద జరిపించేస్తాను" అన్నాడు శంకరం.

"ఒక అమ్మాయి నా ప్రాణాలు తీస్తోందిరా శంకరం!"

అన్నాడు గిరిబాబు.

"ఏ గూటి కూనో చెప్పండి. క్షణాలమీద మీ పాదాల ముందు పడేస్తాను."

గిరిబాబు శ్యామల గురించిన పూర్తి వివరాలు చెప్పి, "ఆ అమ్మాయి నా స్వంతమయ్యేవరకూ నాకు క్షణాలు యుగాలై పోతున్నాయిరా! అంతా నీదే భారం" అన్నాడు.

శంకరం ఒక్క క్షణం ఆగి, "క్షమించండి బాబూ! ఈ పని నావల్ల కాదు" అన్నాడు.

గిరిబాబు తెల్లబోయి, "నీవల్ల కాకపోతే మరెవరివల్ల నవుతుందిరా!" అన్నాడు.

"ఎవరివల్ల అవడమూ కూడా నాకిష్టంలేదు" అన్నాడు శంకరం.

"అంటే?"

"ఆ అమ్మాయి జోలికి వెళ్ళకండి" అన్నాడు శంకరం.

''ఈ సలహా ఇస్తావనా నిన్ను పిలిపించింది!'' అన్నాడు గిరిబాబు కోపంగా.

''కావాలంటే ఆ అమ్మాయి తలదన్నినవాళ్ళని తెచ్చి మీ కాళ్ళమీద పడేస్తాను. కానీ శ్యామలను మాత్రం మర్చిపోవాలి మీరు'' అన్నాడు శంకరం.

''నావల్ల కాదు. ఆ పిల్ల నాక్కావాలి,'' అన్నాడు గిరిబాబు మొండిగా.

"బాబుగారూ! నేనెందుకు చెబుతున్నానో మీరర్థం చేసుకోవడంలేదు. శ్యామల నా చెల్లెలు" అన్నాడు శంకరం. అలా అన్నప్పుడు శంకరం మాట తడబడింది.

"ఆ పిల్ల నీకు చెల్లెలా?" గిరిబాబు నమ్మలేనట్లు అన్నాడు.

"అవును. సుబ్బారాయుడుగారు నాకు చదువు చెప్పారు. ఆయన నాకు గురువు. గురువంటే తండ్రితో సమానం. ఆ గురువు కూతురే కదా శ్యామల!"

ఏదో పెద్ద జోకు విన్నట్లుగా నవ్వేశాడు గిరిబాబు. "ఒరేయ్ శంకరం! కాలేజీల్లో మేస్టర్లు శిష్యురాళ్ళని ప్రేమించి పెళ్ళి చేసుకుంటున్న రోజుల్రా యివి. గూండాగాడివి నీ కిదేం సెంటిమెంటురా!"

"ఏమో! అదేం నాకు తెలియదు. ఆ అమ్మాయి నన్ను న్నయా అని పిలిచేది. ఇప్పటికీ పిలుస్తుంది. నేను చెల్లెమ్మా అంటాను. నా అన్నవాళ్ళెవరూ లేని నాకేర్పడ్డ ఈ బంధం తెంచుకోగలిగింది కాదు."

గిరిబాబు క్షణం ఆలోచించి, "నువ్వు కాకపోతే పోనీ ఇంకెవరివల్లనైనా ఈ పనవుతుందేమో చెప్పు." అన్నాడు.

"బాబుగారూ! ఆ పిల్లని మీరు మర్చిపొండి. ఆ పిల్ల జోలికి ఎవరు వెళ్ళినా నేను సహించను" అన్నాడు శంకరం హెచ్చరిస్తున్నట్లు.

"నీ బ్రతుకేమిటో తెలుసుకునే మాట్లాడుతున్నావా?"

శంకరానికి ఒళ్ళు మండినట్లుంది. "ఇందులో తెలుసు కోవడానికేముందండి? మీ బ్రతుకు నాకు తెలుసు. నా బ్రతుకు మీకు తెలుసు" అన్నాడు.

* * *

"పొగరుబోతు వెధవ! అంత మాటనేశాడు" అన్నాడు గిరిబాబు.

"రంగా! ఈ పని నువ్వే చేసిపెట్టాలి."

"అలాగే బాబూ? కానీ ముందొకసారి నేను శంకరాన్ని కలుసుకుని మాట్లాడాలి" అన్నాడు రంగడు.

"అలాగే! అయితే నాతో రా!" అంటూ ఇంట్లోకి దారి తీశాడు గిరిబాబు.

"ఏమిటీ! శంకరం ఇక్కడే ఉన్నాడా?" ఆశ్చర్య పడ్డాడు రంగడు.

"శంకరం ఎక్కడున్నాడో, ఏ పరిస్థితుల్లో ఉన్నాడో నువ్వు కూడా చూసి తెలుసుకోవడం అవసరం" అన్నాడు గిరిబాబు.

రంగడు గిరిబాబుని అనుసరించాడు. అలా ఇద్దరూ నడిచి మేడ మెట్లెక్కి, ఓ మూల గది దగ్గరకు వెళ్ళారు. గదికి తాళం వేసివుంది. గిరిబాబు తలుపు తాళం తీశాడు.

ఇద్దరూ గదిలో ప్రవేశించారు. గదిలో ఏమీ లేవు. ఎవరూ లేరు. ఆ గదిలోంచి మరెక్కడికో వెళ్ళడానికి కాబోలు తలుపు ఒకటుంది. గిరిబాబు నెమ్మదిగా ఆ తలుపు తోశాడు. రంగడు కుతూహలంగా తొంగిచూశాడు.

లోపల గోడకు ఇనుప హుక్కు ఉన్నాయి. ఆ హుక్కు నుంచి ఇనుపగొలుసులు వ్రేలాడుతున్నాయి. ఆ గొలుసులతో బంధింపబడివున్నాడు శంకరం!

3

"నువ్వా రంగా! నావల్ల కాని పని చేయడానికి నిన్ను పిలిచాడా ఈ బాబు?" అన్నాడు శంకరం. వాడి మాటల్లో కసి ఉంది. కానీ అసహాయత, నీరసం కూడా ఉన్నాయి.

"అవును శంకరం! పెద్దబాబుల మాట కాదంటే మన బ్రతుకేమిటో తెలుసుకున్నావు గదా!" అన్నాడు రంగడు.

"తెలిసిందిరా!" అన్నాడు శంకరం. అంతకుమించి మరేమీ మాట్లాడలేరు.

రంగడు గిరిబాబుతో బయటకు వచ్చి, "బాబుగారూ!

శ్యామల తప్పక మీకు దక్కుతుంది. అందుకు నేనో పథకం వేయదలిచాను. దానికి నాకు శ్యామలకు సంబంధించి కొన్ని వివరాలు కావాలి. అవి శంకరంనుంచే తెలుసుకోవాలి. వాడితో కాసేపు ఏకాంతంగా మాట్లాడే అవకాశమిప్పించ గలరా?" అనడిగాడు.

రంగడికీ, శంకరానికీ ప్రొఫెషనల్ జెలసీ ఉన్న సంగతి గిరిబాబుకు తెలుసును. అతను ఏమాత్రమూ సందేహించ కుండా రంగడిని లోపలకు వెళ్ళనిచ్చాడు.

"శంకరం! ఎందుకురా రాజులా బ్రతికేవాడివీ స్థితి తెచ్చుకున్నావు?" అన్నాడు బాధగా రంగడు.

"చెల్లెమ్మా అని పిలిచే పిల్లని ఒక రాత్రికి ఎవడికో అప్పజెప్పే బ్రతుకు రాజులాంటి బ్రతుకేనంటావా?" అనడి గాడు శంకరం.

రంగడు సూటిగా శంకరం కళ్ళలోకి చూసి, "ఒరేయ్ శంకరం! ఆ పిల్లకోసం నువ్వీ స్థితికి వచ్చావు. కానీ ఆ పిల్లని రక్షించగలిగేవా? నేనా పిల్లని గిరిబాబుగారి కప్ప జెప్పబోతున్నాను. దాన్ని నువ్వాపగలవా?" అనడిగాడు.

శంకరం దీనంగా రంగడి కళ్ళలోకి చూసి, "రంగా! అంతపని చేయకురా! శ్యామలకు పెళ్ళి చేయాలని వాళ్ళ నాన్న చాలా ప్రయత్నిస్తున్నాడు. నువ్వు చేసే పనివల్ల ఆ పిల్ల నూరేళ్ళ బ్రతుకూ నాశనమైపోతుంది" అన్నాడు.

"మన బ్రతుకులకంటే ముఖ్యమైనదంటావా ఆ పిల్ల బ్రతుకు?" అన్నాడు రంగడు.

"మనసు కిష్టంలేని పని చేయాల్నొచ్చిన వెధవ బ్రతుకు బ్రతికి మాత్రం ఏం ప్రయోజనం?" అన్నాడు శంకరం నిస్పృహగా.

"శంకరం! మనదెప్పుడూ వెధవ బ్రతుకేరా! అలా బ్రతకడం తప్ప మనకు చేతకాదు. మనం చేస్తున్నవన్నీ వెధవపనులే! ఆ సంగతి నీకూ తెలుసు. నాకూ తెలుసు. ఉన్నపళంగా మనమిలా మంచివాళ్ళమైపోతే గిరిబాబులాంటి వాళ్ళెలా సహిస్తారు? కాబట్టి కాస్త బుద్ధితెచ్చుకుని నువ్వే స్వయంగా గిరిబాబుకా పిల్ల నప్పజెప్పు. ఇది నీ పని. నీ పనిలో కలగజేసుకోవడం నా కిష్టంలేదు" అన్నాడు రంగడు.

"ఇది చెప్పడానికా నా దగ్గర కొచ్చావ్? చేతనైతే నీ తోటిమనిషి చెల్లెల్ని నువ్వు కూడా రక్షించడానికి ప్రయ త్నించు" అన్నాడు శంకరం.

"ప్రయత్నించిన నీ గతి చూస్తూనే ఉన్నాను కదా!" అన్నాడు రంగడు వెటకారంగా.

"రంగా! నేను నీ సహాయాన్నెన్నడూ కోరలేదు. నిన్నేమీ అడగనురా! శ్యామలను రక్షించరా!" అన్నాడు శంకరం దీనంగా.

"నాకేం అవసరం" అన్నాడు రంగడు నిరసనగా.

"నీక్కూడా ఇలాంటి అనుబంధం ఏర్పడి నీ చెల్లెల్ని తెచ్చిపెట్టమని గిరిబాబులాంటి వాళ్ళడిగినప్పుడు తెలుస్తుందిరా నీకు బాధ!" అన్నాడు శంకరం నిస్సహాయంగా.

"నా చెల్లెల్నైతేనా! అడిగేదమ్ముంటాయా గిరిబాబుకి!" అన్నాడు రంగడు గర్వంగా.

శంకరం చటుక్కున అన్నాడు. "అయితే ఈ క్షణం నించీ నువ్వు నా తమ్ముడివి. శ్యామల నీకు చెల్లెలు! నీ చెల్లెల్నెలా రక్షించుకోగలవో నిరూపించి చూపించు. ఊరికే కబుర్లు చెప్పడంకాదు. నేనూ నీకులాగే అనుకుని ఈ

గొలుసుల బంధంలోపడ్డాను. నీ గతి అంతకంటే విశేషంగా ఉంటుందనుకోను."

రంగడు, శంకరంమాటలకు ఆశ్చర్యపడ్డాడు.

4

"విన్నావుగదా శంకరం మాటలు వాడు మారడు" అన్నాడు గిరిబాబు, బయటకువచ్చిన రంగడిని పరిశీలనగా చూస్తూ.

"ఎవడికర్మకెవరు కర్తలుబాబూ! ఈ క్షణంనించీ నా ప్రయత్నాలలో ఉంటానుమరి" అన్నాడు రంగడు.

"ఎంతఖర్చయినా ఫరవాలేదురా" అన్నాడు గిరిబాబు. ఇద్దరూ గది బయటకువచ్చారు. గిరిబాబు గదికి తాళంవేశాడు. ఇద్దరూ మెట్లుదిగి క్రిందకువచ్చారు.

"దీనికి రెండు పద్ధతులున్నాయి బాబూ. ఒకటి బలవంతం. చిన్న మోసంచేసి ఇక్కడికి ఎత్తుకొచ్చేస్తాము. ఆ తర్వాత మీరా అమ్మాయినేం చేసుకుంటారో మీ ఇష్టం- ఇది ఖర్చు తక్కువ పని. రెండోది కాస్త ఖర్చుతో కూడిన పనే కానీ—అమ్మాయి ఏ బలవంతం లేకుండా మీ కౌగిట్లో ఒదిగిపోతుంది" అన్నాడు రంగడు.

గిరిబాబు కుతూహలంగా రంగడివంక చూసి "రెండోదే నా కిష్టం. ఖర్చంటే ఏ మాత్రముంటుందేమిటి?" అన్నాడు.

"పాతికవేలు దాటవచ్చు" అన్నాడు రంగడు.

"ఓస్ ఇంతేగదా! శ్యామలలాంటమ్మాయి తనకు తానై నన్ను చేరవస్తానంటే అదో లెక్కల్లో ఖర్చుకాదు" అన్నాడు గిరిబాబు.

"అయితే సరే. ముందుగా నాకో రెండువేలు అడ్వాన్సిప్పించండి" అన్నాడు రంగడు.

"యిస్తానుగానీ నీ పథకం ఏమిటో వివరించి చెప్పరా" అన్నాడు గిరిబాబు.

"ఏమీలేదు. మీరు శ్యామలను పెళ్ళిచేసోక్కావాలి?" అన్నాడు రంగడు.

"ఛీ—ఇదా నువ్వు చెప్పదల్చుకున్నది. ఈ మాత్రందానికి నీ బోడిసలహా ఎందుకు!" అన్నాడు గిరిబాబు.

"అలా కంగారుపడకండి బాబూ! పూర్తిగా వినండి. మీరు శ్యామలను నిజంగా పెళ్ళిచేసుకోరు. దొంగపెళ్ళి జరుగుతుంది. దానికి ఏ విధమైన సాక్ష్యమూ ఉండదు. కానీ పెళ్ళి జరిగిందనే శ్యామల నమ్ముతుంది. కావాలంటే ఒక నెలరోజులు మీరు సరదాగా హనీమూన్‌కుకూడా వెళ్ళవచ్చు. ఆ తర్వాత ఏదో ఊళ్ళో ఆ పిల్లను వదిలేసిరావచ్చు—" అన్నాడు రంగడు.

"రంగా! నీ అయిడియా అద్భుతం" అన్నాడు. అతని ముఖంలో అంతులేని ఆనందం కొట్టుకొచ్చినట్లు కనిపిస్తోంది.

"అన్ని ఏర్పాట్లూ నేను చేస్తాను. ఇందులో ఎవరి ప్రమేయమూ ఉండదు. మీ ఇంటికి సంబంధించినంతవరకూ మీరూ నేనే. ముందుగా రెండువేలివ్వండి" అన్నాడు రంగడు.

గిరిబాబు రెండువేలూ రంగడికి అందించేక "ఈ పెళ్ళికి నేను పెద్దనుకాబట్టి రౌడీ రంగడిగా ఉండడానికి వీల్లేదు. శ్యామలకు సంబంధించినంతవరకూ కొంత కాలంపాటు నన్ను మీ అన్నయ్యగా చెప్పుకోనివ్వండి"అన్నాడురంగడు.

5

"ఒక్కక్షణం శ్యామలగారూ?" అన్నాడు రంగడు.

"ఫరవాలేదు. ఇంకా ఎక్కువ క్షణాలే మాట్లాడవచ్చు.

కానీ త్వరగా చెప్పండి" అంది శ్యామల.

"నా పేరు రంగారావు" అన్నాడు రంగడు నీళ్ళు నములుతూ.

"చూశారా! అప్పుడే పదిక్షణాలకు పైగా అయిపోయింది ఇంకా మీ పేరు చెప్పడమొక్కటే అయింది. అందుకే యిలాంటి సమయాల్లో ఎంతసేపు మాట్లాడబోతున్నదీ ముందుగానే చెప్పేయకూడదు" అంది శ్యామల అదోలా నవ్వుతూ.

"క్షణమంటే క్షణమేనా?" అన్నాడు రంగడు.

"కాదని నాకు తెలుసు. యిలాంటి పదాలు నా జీవితంలో చాలాసార్లు ఎదురయ్యాయి. తెలిసినవాళ్ళూ, అపరిచితులూ కూడా క్షణం పలకరింపుకోసం నన్ను పార్కుకిపిలిచి గంటకు తక్కువకాకుండా మాట్లాడి వెడుతూంటారు. అందులో కొందరు ఇష్టంగురించి మాట్లాడతారు. ఇష్టమంటే ఇష్టంకాదు. ఏదో కొద్దిరోజుల ఇష్టం. మరికొంతమంది ప్రేమగురించి మాట్లాడతారు. అందుకే క్షణమంటే క్షణం కాదని నాకు తెలుసు!" అంది శ్యామల.

రంగడు తడబడ్డాడు. పెళ్ళి అంటే పెళ్ళికాని-పెళ్ళి గురించి తనామెతో మాట్లాడాలని వచ్చాడన్న విషయం గుర్తుకు రావడం—వాడు తడబడడానికి కారణమయి ఉండవచ్చు.

"మీకు చాలా తెలిసినట్లు కనబడుతోంది—నేనెవరో మీకు తెలుసా?" అన్నాడు రంగడు.

"తెలుసు" అంది శ్యామల. "మీ పేరు రంగారావని మీరే చెప్పారు. మీ దగ్గర బాగా డబ్బుండి ఉంటుంది. ఆ డబ్బుతో నా అందాన్ని కొనాలనుకుంటున్నారు."

రంగడు నవ్వి "ఇలాంటనుభవం మీకు రోజూ జరుగుతున్నట్లనిపిస్తోంది. అయితే ఎవరైనా పిలవగానే పార్కుకెందుకు వస్తారు మీరు—మాబోటివాళ్ళు మాట్లాడబోయేది మీకు ముందుగా తెలిసినదే కదా" అన్నాడు.

"ఏం చేయను? దేవుడు నా కందాన్ని ఇచ్చాడు. అది శాపమో, వరమో తెలియడంలేదు. చాలామంది నన్ను పలకరించి ప్రేమించామని చెబుతున్నారు. ప్రేమను పెళ్ళిదాకా నడిపిస్తామని హామీ ఇచ్చేవాళ్ళుకూడా ఉన్నారు. కానీ పెళ్ళి తర్వాత ప్రేమ అంటే ఎవరికీ నచ్చడంలేదు. కానీ ఏ పుట్టలో ఏ పాముందో—ఏ రోజన్నా ఎవడైనా నన్ను పలకరించి నిజంగానే పెళ్ళి చేసుకుంటాడేమో? అనవసరంగా ఆ అవకాశం పోతుందేమోనన్న భయంకొద్దీ...." అని ఆగి నవ్వింది శ్యామల.

ఆమె కావాలని వెటకారంగా ఆ మాటలన్నదని రంగడికి తోచింది. అందుకే వాడు వెంటనే "అయితే మీరెదురు చూస్తున్నరోజు వచ్చేసింది. అందుకే మిమ్మల్ని నేను తెలుసుకున్నాను" అన్నాడు.

శ్యామల కాస్త ఆశ్చర్యపడ్డట్లు కన్పించింది. "నన్ను మీరు పెళ్ళాడుతారా?" అంది సూటిగా.

రంగడు లెంపలు వేసుకుని "మిమ్మల్ని—నేనా?" అన్నాడు.

శ్యామల మాట్లాడలేదు. రంగడేం చెబుతాడోనని ఆశ్చర్యంగా వాడివంకే చూస్తోంది.

"నా తమ్ముడిదివరలో మిమ్మల్ని కలుసుకున్నాడు. వాడు మిమ్మల్ని పరీక్షిస్తున్నాడని తెలియక—మీరు వాడిని నానా మాటలూ అన్నారుట. ఆ తర్వాత మిమ్మల్నింకా పరీక్షిం

చడంకోసం రోజుకొకర్ని చెప్పిన మనుషుల్ని పెట్టాడు. అందరూకూడా మీ గొప్పతనాన్ని తెలుసుకుని వాడికి తెలియ బర్చారు. వాడింక మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలని తయా రయ్యాడు. అన్నగా నేను రాయబారానికి వచ్చాను" అన్నాడు రంగడు.

శ్యామల తెల్లబోయినట్లు రంగడివంక చూసి—"మీ తమ్ముడెవరో నాకు తెలియదు" అంది.

"ఈ ఊళ్ళో గిరిబాబుని తెలియని వాళ్ళుండరని వాడన్నాడు. నే నీ ఊళ్ళో ఉండక పోవడంవల్ల వాడన్న మాటల్లో నిజానిజాలు మీరే చెప్పాలి—" అన్నాడు రంగడు.

"గిరిబాబు నాకు తెలుసు" అంది శ్యామల. అతన్ని తను స్టుపిడ్ అని తిట్టడం ఆమెకు బాగా గుర్తుంది.

"మీ కభ్యంతరం లేనిపక్షంలో గిరిబాబు మిమ్మల్ని పెళ్ళి చేసుకుని తన ఆస్తికి వారసురాలిని చేయబోతున్నాడు" అన్నాడు రంగడు.

శ్యామల నమ్మలేకపోయింది. ఎవడీ రంగారావు? గిరి బాబు తన్ను నిజంగా వివాహం చేసుకుంటాడా?

తన భావి జీవితం గురించి శ్యామల రంగుల కలలు కంటున్న మాట నిజం. సినిమాలలోలా ఎవరో రాజ కుమారుడు వచ్చి తనను వివాహం చేసుకుంటాడని ఆమె ఆశిస్తోంది. రంగడి మాటలు తాత్కాలికంగా ఆ కలల కొలనులో అలలు సృష్టించాయి.

"పెళ్ళి విషయంలో నా అభ్యంతరాల ప్రసక్తి లేదు. అన్నీ మా నాన్నగారితో మాట్లాడండి. ఆయనకిష్టమైతే నాకూ ఇష్టమే!" అంది శ్యామల.

"మీరు తండ్రిచాటు పిల్ల అని నాకు తెలుసును. కానీ ఈ విషయంలో కొన్ని ఇబ్బందులున్నాయి. అందుకే ముందుగా మీతో మాట్లాడవలసొచ్చింది—" అన్నాడు రంగడు.

శ్యామల అనుమానంగా "చెప్పండి!" అంది.

"గిరిబాబుకు పెళ్ళికూతురు సిద్ధంగా ఉంది. తన ఎత్తు బంగారంలో వచ్చే ఆ అమ్మాయి పేరు బంగారు. ఆ పిల్లను కాదని మరెవ్వరినన్నా చేసుకుందుకు అమ్మానాన్నా ఒప్పుకోవడంలేదు. స్వతంత్రించి తన నిర్ణయాన్ని తెలియ బరిస్తే—తన తలిదండ్రులు మీకేదైనా ప్రమాదాన్ని తల పెడతారేమోనని గిరిబాబు భయపడుతున్నాడు. అందువల్ల ఈ పెళ్లి రహస్యంగా జరిగిపోవాలి. మీ అమ్మా, నాన్నా—రహస్యపు పెళ్లికి ఒప్పుకుంటారని నాకు తోచదు. అందు కని—ఇటు మీ తలిదండ్రులకీ అటు మా తలిదండ్రులకీ తెలియకుండా ఈ పెళ్లి జరిగిపోవాలి. అందుకు మీరే సహకరించాలి" అన్నాడు రంగడు.

"చాలా తిరకాసుందే" అంది శ్యామల ఆలోచిస్తూ.

"బాగా ఆలోచించండి. మీరు చాలా తెలివైనవారు. మీ కోసం ప్రాణాలైనా ఇచ్చే గిరిబాబును భర్తగా పొందడం కోసం మీరు కాస్త తెగువ చూపించాలి. ఆపైన భోగ భాగ్యాలతో తులతూగవచ్చు."

"అంతా బాగానే ఉంది. కానీ ఇందులో ఏమాత్రం మోస మున్నా ఆడదాన్ని కాబట్టి నష్టపోయేది నేనొక్కర్తినే" అంది శ్యామల.

"శ్యామలా! మీరనవసరంగా భయపడుతున్నారు. గిరి బాబు ప్రేమ ననుమానిస్తున్నారు. గిరిబాబు తలచుకుంటే

ఏ గూండాకో డబ్బిచ్చి మిమ్మల్ని రప్పించుకోలేడా—వాడు కోరుతున్నది మీ ప్రేమను...." అన్నాడు రంగడు గంభీరంగా.

"ఆలోచించుకునేందుకు వ్యవధి కావాలి...." అంది శ్యామల.

"మళ్ళీ రేపు మిమ్మల్ని పార్కులో కలుసుకుంటాను" అన్నాడు రంగడు.

6

శ్యామల మంచంమీద అటూ ఇటూ దొర్లుతోంది. ఆమెకు కన్ను మూసినా తెరిచినా—గిరిబాబు కనబడుతున్నాడు.

గిరిబాబు అందంగానే ఉంటాడు. కానీ అందానికి మించిన ఆకర్షణ అతని డబ్బు. అతని భార్య కాగలిగితే భోగ భాగ్యాలకు లోటుండదు. తన జీవితమే మారిపోతుంది.

రంగారావు మళ్ళీ పార్కులో కలుసుకుంటానన్నప్పుడు అతను మళ్ళీ నిజంగా వస్తాడా అనుకుందామె. నిజం చెప్పాలంటే ఆరోజు పార్కులో అతనికోసం ఎదురుచూసిందామె. అతను నిజంగానే వచ్చినప్పుడు ఆమె ఆనందానికి అంతులేదు. అతను పథకం వివరించినప్పుడు మాత్రం ఆమె ఒడలు జలదరించింది.

ఇక్కడికి పదిమైళ్ళ దూరంలో ఒక కొండమీద జనార్దన స్వామి గుడి ఉన్నదట. ఆ గుడిలో తనకూ గిరిబాబుకూ పెళ్ళి అని రంగారావు చెప్పాడు. అన్ని ఏర్పాట్లూ రంగారావు చేస్తున్నాడట.

శ్యామల మంచంమీద మరో పక్కకు దొర్లింది. ఇంట్లో

ఏమని చెప్పాలి? తను చేయబోతున్న ఈ పని తలిదండ్రుల మీద ఎటువంటి ప్రభావం చూపిస్తుంది?

గిరిబాబులాంటి సంపన్నుడు మన కల్లుడవడం తలిదండ్రులకు అయిష్టంగా ఉంటుందని శ్యామల భావించడం లేదు. కానీ ఏదో మూల ఆమె మనసు కీడును శంకిస్తోంది.

అప్పటికీ రంగారావు చెప్పనే చెప్పాడు—ఎల్లుండి ఉదయం తొమ్మిదిన్నర ప్రాంతాలకు తను ఇందిరా పార్క్—ఇన్ గేట్ దగ్గర నిలబడాలి. టాక్సీలో అతను వస్తానన్నాడు. ఆ టాక్సీలోనే పెళ్ళిచేయించే పురోహితుడూ—అవసరమైన సామగ్రి ఉంటాయి. అంతకుముందే గిరిబాబు మిగతా సరంజామాతో, అవసరమైన మందీమార్బలంతో గుడి చేరుకుని ఉంటాడు.

ఈ ఏర్పాటు కాస్త భయం కలిగించే విధంగా ఉన్నమాట నిజమే. అయినా శ్యామలకు వెళ్ళాలని ఉంది. ఆమె తన కూడా ఎవరైనా నమ్మకస్తులను ఒకరిని తీసుకురావచ్చునని రంగారావు చెప్పాడు.

శ్యామలకు చెప్పుకోదగ్గ స్నేహితులెవ్వరూ లేరు. ఒకే ఒక్క స్నేహితురాలుంది. ఆమె పేరు లీల. లీలకీ విషయం చెప్పవచ్చునా చెప్పకూడదా అని సందిగ్ధంలో పడి చివరకు చెప్పాలనే నిర్ణయించుకుంది శ్యామల. అలా చెప్పడం మంచిదే అయింది. లీలకూడా ఈ వ్యవహారంలో ప్రమాదాన్ని శంకించింది కానీ ధైర్యేసాహసేలక్ష్మి అని ముందడుగు వేయాలంది.

లీల మాటలు శ్యామలకు ధైర్యాన్నిచ్చాయి. తను కూడా తోడు వస్తాననడం శ్యామల కుత్సాహాన్ని కలిగించింది. తను భయపడకుండా వెళ్ళిపోవచ్చు ననిపించింది.

"నాకు తెలిసినవాళ్ళకో కెమేరా ఉంది. తప్పకుండా ఇస్తారు. మీ పెళ్ళికి ఫోటోలు తీస్తాను" అంది లీల.

శ్యామల మంచంమీద అటూ ఇటూ దొర్లుతూ ఆలో చిస్తోంది. కళ్ళముందు—గిరిబాబు, తను—పెళ్ళి బట్టల్లో కనబడుతున్నారు. లీల ఫోటోలు తీస్తోంది. బ్రాహ్మణులు మంత్రాలు చదువుతున్నారు.

7

"చూడండి, మీ పేరేమిటన్నారూ?"

"నన్ను జనార్దనాచార్యులంటారండి."

"అంటారా—నా పేరు గిరిబాబండి...." అన్నాడు గిరిబాబు.

"చిత్తం. శ్రీవారు చెప్పదల్చుకున్నది...."

"అదే, అన్నీ మీకు రంగారావిదివరలోనే చెప్పి ఉంటా డనుకుంటాను."

"చెప్పేరండి! పెళ్ళికి అన్ని ఏర్పాట్లు చేసేశామండి" అన్నాడు జనార్దనాచార్యులు.

"ఈ కొండమీదకు జనం బాగా వస్తుంటారా" అన్నాడు గిరిబాబు.

"ఉత్తరోజుల్లో బాగా తక్కువండి. సెలవు రోజుల్లో అయితే బాగా వస్తారండి. పెళ్ళిళ్ళు కూడా ఏటా అయిదారు దాకా జరుగుతూంటాయండి" అన్నాడు జనార్దనాచార్యులు.

"చూడండి ఆచార్యులుగారూ! మా పెళ్ళి దేవుడి ముందు జరుగుతుంది కదా! అంటే నేను దైవసాక్షిగా వివాహం చేసుకుంటున్నానన్నమాట" అన్నాడు గిరిబాబు.

"అవునండి! అది చాలా అదృష్టమండి" అన్నాడు జనార్దనాచార్యులు.

"ఆచార్యులుగారూ! మీకు జీతం బాగా వస్తుందా."

"ఏం జీతం లెండి. తిండికే గడవదు" అన్నాడు నీళ్ళు నములుతూ జనార్దనాచార్యులు.

జేబులోంచి కొన్ని వందరూపాయల నోట్లు తీసి ఆయన కందించాడు గిరిబాబు, "వీటిని లెక్కపెట్టండి."

ఆచార్యులు లెక్కపెట్టి, "రెండువేలు" అన్నాడు.

"లెక్క సరిగ్గానే పెట్టారు. అవి రెండువేలే! ఆ డబ్బు మిమ్మల్ని తీసుకోమంటే మీ కభ్యంతరమా?"

ఆచార్యులు ఉలిక్కిపడ్డాడు. నోటమాటరాలేదు. "శ్రీవా రేమంటున్నదీ నా కర్థంకావడంలేదు" అన్నాడు తడబడుతూ.

"అబ్బే ఏమీలేదు. ఆ డబ్బు మీ కిచ్చేస్తానంటున్నాను. కానీ ఉత్తినేమాత్రం కాదు. మీరు నాకో చిన్న సాయం చేయాలి" అన్నాడు గిరిబాబు.

ఆచార్యులు నీళ్ళు నములుతూ, "నావల్లనయ్యేదైతే...." అన్నాడు.

"అయ్యేదేనండీ! ఈ రోజిక్కడ నా పెళ్ళి జరుగుతుందా! అది మీ దేవస్థానం రికార్డులో ఉండకూడదు. దైవసాక్షిగా జరిగే నా పెళ్ళికి దేవుడొక్కడే సాక్షిగా మిగలాలి. మీరు ఘటనాఘటన సమర్థులని విన్నాను. మీ కొక్కరికే ఈ పెద్ద మొత్తం. మిగతా వాళ్ళందరికీ తలో వందా పారేద్దాం. ఆ కాగితంతో వాళ్ళు నోరుమూసుకోవాలి" అన్నాడు గిరిబాబు.

ఆచార్యులు ముఖంలో కంగారు కనపడింది. "దైవ సాన్నిధ్యంలో ఈ ఘోరకార్యాన్ని...." అని ఏదో అనబోగా గిరిబాబాయన్ను వారించాడు.

"ఆచార్యులుగారూ! వైష్ణవులు! మీకు నేను కృష్ణుడి గురించి వేరే చెప్పాల్సిన పనిలేదు. అర్జునుడితో ఆ లీలా

మానుష విగ్రహుండేమన్నాడు. అర్జునా! భయపడకు. రాగ ద్వేషాల కతీతుడవై శత్రువులను వధించు. జీవుని జనన మరణాలకు, సర్వకర్మలకు బాధ్యుణ్ణి నేను. చేసేదీ, చేయించేదీ, అన్నీ నేనే.... ఇదే గీతాసారం. మనకు తోచిన పని మనం చేయడానికి ఆలోచించకూడదు. అన్నిం టికీ ఆ భగవంతుడే ఉన్నాడు" అన్నాడు గిరిబాబు. అప్పటికీ ఆచార్యులేం మాట్లాడకపోవడం చూసి, "ఏమండీ, మాట్లా డరు!" అన్నాడు.

"గీతాసారాన్ని వివరించి చెప్పారు. ఇంకేం మాట్లా డను" అన్నాడు జనార్దనాచార్యులు.

8

"ఏమిటే! స్నేహితురాలి పెళ్ళికే ఇంత సంతోషంగా ఉన్నావ్" అంది శ్యామల తల్లి. ఆవిడ మాటల్లో, కళ్ళలో శ్యామలకింక పెళ్ళి చేసేయాలన్న భావం కన్పించింది.

"అవునమ్మా! అది నా ప్రాణంలో ప్రాణం! అదే నేను, నేనే అదీ అనుకో!" అంది శ్యామల.

శ్యామల తల్లి విని ఊరుకుంది. తండ్రిదగ్గర సెలవు తీసుకుంటూ, ఆమె "రాత్రికి వచ్చేయడానికి ప్రయత్నిస్తాను నాన్నా. రాలేని పక్షంలో టెలిగ్రాం ఇస్తాను" అంది.

"క్షేమంగా వెళ్ళిరా" అన్నాడు శ్యామల తండ్రి సుబ్బా రాయుడు.

శ్యామల ఇందిరా పార్క్ చేరుకునేసరికి టైము తొమ్మిదిన్నర కాలేదు కానీ లీల అప్పటికే వచ్చేసి ఉంది. ఆమె భుజానికి అందమైన కెమేరా వ్రేలాడుతోంది. స్నేహితు రాండ్రిద్దరూ ఒకరినొకరు పలకరించుకున్నారు. ఇద్దరూ పైకి మేకపోతు గాంభీర్యాన్ని చూపిస్తూ, లోలోపల భయ పడుతున్నారు.

అప్పుడే టాక్సీ ఆగింది వాళ్ళముందర. టాక్సీ తలుపులు తీసుకుని రంగడు ముందుకు వచ్చాడు. టాక్సీలో డ్రైవరు పక్కనే ఒక పిలక బ్రాహ్మణుడు కూర్చుని ఉన్నాడు.

ఒక చిన్న అట్టపెట్టె ఆమెకు అందించి, "చూడండి శ్యామలా! ఇది మీకు నా చిన్న కానుక. ప్రస్తుతాని కింత కంటే ఏమీ చేయలేకపోతున్నాను. ఒక్కసారి ఇందులోని వజ్రాల హారాన్ని మీ మెడలో వేసుకోండి" అన్నాడు రంగడు.

అట్టపెట్టె తెరచిన శ్యామల కళ్ళు జిగేల్‌మన్నాయి. అపురూపమైన వజ్రాలహారమది. ఆ వజ్రాలహారాన్ని తాక డానికి కూడా క్షణంపాటు భయపడిందామె. తర్వాత నెమ్మదిగా పెట్టెలోంచి తీసి లీలకు అందించింది. లీలకూడా ఆ హారాన్ని చూసి, "అద్భుతం" అంది అప్రయత్నంగా. తర్వాత శ్యామల ఆ హారాన్ని ధరించింది.

రంగ డామెవంకే అపురూపంగా చూసి, "నిజంగా ఈ హారంలో మీరు దేవకన్యలా ఉన్నారు. నా తమ్ముడు నిజంగా చాలా అదృష్టవంతుడు" అన్నాడు.

శ్యామల చటుక్కున వంగి రంగడికి పాదాభివందనం చేసింది. రంగడది ఊహించని కారణంగా తెల్లబోయి, "ఇదేమిటి?" అన్నాడు.

"పెద్దలేదైనా కానుక ఇచ్చినప్పుడది ధరించి పాదాభి వందనం చేయాలి" అంది లీల.

రంగడు ఫ్రంట్‌సీట్లోనూ, శ్యామల, లీల బాక్‌సీట్లోనూ కూర్చోవడం జరిగేక కారు మళ్ళీ బయల్దేరింది.

"వ్యవహారం చాలా తమాషాగా ఉంది. మంచి జరుగు తుందో, చెడు జరుగుతుందో తెలియడంలేదు" అంది లీల

శ్యామల చెవిలో. కానీ శ్యామల అనుమానాలు క్రమంగా తొలగిపోతున్నాయి.

9

గిరిబాబులో అసహనం పెచ్చుమీరిపోతోంది. శ్యామలను పెళ్ళిచేసుకొని, రాత్రికి రాత్రి హనీమూన్‌కి బయల్దేరడానికి అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాడతను. శ్యామలతో అనుభవాల నూహించుకుంటూ అతను పరవశించిపోతున్నాడు. ఆ పర వశంలోంచి బయటపడినప్పుడల్లా అసహనం పట్టలేక పోతున్నాడు.

మొత్తానికి గిరిబాబు కళ్ళకు విందుచేస్తూ రంగడు, పురోహితుడు కనిపించారు. ఏరా రంగా అనబోయి తమా యించుకుని, "ఏం అన్నయ్యా! పెళ్ళికూతురు వచ్చిందా!" అన్నాడు.

"పెళ్ళికూతురూ, ఆ పిల్ల స్నేహితురాలూ కూడా వచ్చేరు. మెట్లక్రిందున్నారు. పైన ఏర్పాట్లెలా ఉన్నాయో చూద్దామని వచ్చాను" అన్నాడు రంగడు.

"అన్నీ సక్రమంగానే ఉన్నాయి. ఇంక పెళ్ళి కావడమే తరవాయి" అన్నాడు గిరిబాబు చాలా ఉత్సాహంగా. అతని మనసు శ్యామలను చూడ్డానికి ఉరకలువేస్తోంది.

రంగడు నవ్వి, "శ్యామల స్నేహితురాలి పేరు లీల. పెళ్ళి ఫోటోలు తీద్దామని కెమేరా తెచ్చింది. నేను కెమేరా అడిగి తీసుకుని అందులోని రీలు బయటకు తీసేశాను. తెల్ల పోయింది. వాళ్ళిద్దరూ చాలా కంగారుపడుతున్నారు. నువ్వే శ్యామలకు ధైర్యం చెప్పాలి" అన్నాడు. వాడి నోటిమాట పూర్తికాకుండానే గిరిబాబు కొండమీంచి కిందకు పరు గెత్తాడు.

మెట్ల క్రింద కారు దగ్గర నిలబడి ఇంకో అమ్మాయితో మాట్లాడుతున్న శ్యామలను చూసి గిరిబాబు కళ్ళు మెరిశాయి. "శ్యామలా!" అన్నా డతనుత్సాహంగా.

గిరిబాబు కనపడగానే శ్యామలకు మళ్ళీ ధైర్యం వచ్చింది. వ్యవహారంలో అట్టే మోసమున్నట్లు లేదు. కనీసం ఇంత వరకూ అన్నీ సక్రమంగానే జరుగుతున్నాయి. లీలకు గిరిబాబు నచ్చాడు. "మీ ఆయన బాగున్నాడే!" అంది లీల నవ్వుతూ.

శ్యామల, గిరిబాబు కూడా సిగ్గుపడ్డారు. హఠాత్తుగా గిరిబాబు దృష్టి శ్యామల మెడలోని వజ్రాలహారంపైన పడింది. చూస్తూనే అతను దాని ఖరీదు అంచనా వేయగలిగాడు. దాని ఖరీదు రెండు లక్షలకు పైగా ఉంటుంది. శ్యామల మెడలో అంత ఖరీదైన హారం ఎలా వచ్చింది?

"ఆ హారం...." అన్నాడతను వాక్యం పూర్తి చేయకుండా.

"రంగారావుగారిచ్చారు ..." అంది శ్యామల.

గిరిబాబు తనలో తను నవ్వుకున్నాడు. బహుశా అది నకిలీ వజ్రాలహారమయుండవచ్చు. లేకుంటే అంత ఖరీదైన వజ్రాలహారం రంగడి కెక్కణ్ణించి వస్తుంది?

"అన్నీ ఏర్పాట్లూ ముగిశాయి. పైకి రండి చూద్దురుగాని" అన్నాడు గిరిబాబు.

ముగ్గురు నడచుకుంటూ కొండమీదకు వెళ్ళారు.

జనం ఎక్కువ లేకపోవచ్చుకానీ ఫరవాలేదు. భజంత్రీలు, పురోహితులు, పూజారులు అంతా పాతికమందిదాకా ఉన్నారు. ఇంతమందీ నోళ్ళుమూసుకుని ఉంటారా! వీళ్ళలో ఎవరో ఒకరు తన కెదురుగుతిరుగుతారేమోనన్న అను

మానాలు గిరిబాబునోపక్క బాధిస్తున్నాయి. కానీ వీళ్ళెవరికీ తన పూర్తి ఉనికి తెలియదు. తనెవరో తెలుసుకుని ఆరాలు తీసి ఈ పెళ్ళి గురించి సాక్ష్యాలనిచ్చి నిరూపించడం అంత సాధ్యపడే విషయం కాదు.

అనుమానాల బాధ అలా ఉండగానే శ్యామల అందం గిరిబాబుని కవ్విస్తోంది. అనుభవించబోయే సుఖాలతని అనుమానాలను కొంతవరకూ అరికట్టాయి.

అక్కడి వాతావరణం చూసేక శ్యామలకు క్రమంగా ధైర్యం పెరిగింది. గిరిబాబు తన్ను మోసంచేసే ఉద్దేశ్యంలో లేడనీ, అన్నీ సక్రమంగానే జరుగుతున్నాయనీ ఆమెకు తోచింది. లీల కెమేరాలోని ఫొటో రీలు తీసేయడం మాత్రం అర్థంకాలేదామెకు. రంగారావు చెప్పిన ప్రకారం గిరిబాబు కలర్ ఫొటోలు తీయడాని కేర్పాటుచేశాడనీ, తన పెళ్ళి విశేషాలు తెలుపునలుపు ఫొటోలుగా రావడానికి గిరిబాబు ఒప్పుకోవడంలేదనీ ఆమెకు తెలుసు. కానీ ఆ సమాధానం శ్యామలకంత సబబుగా అనిపించలేదు. ఇంకా బలమైన కారణాలేవో ఉన్నాయేమోనని ఆమెకు తోస్తోంది. కానీ మరీ దూరం ఆలోచించడానికామెకు భయంగా ఉంది. దేవుడి మీదనే భారంవేసి ఆమె మౌనంగా ఊరుకుంది.

వధూవరులు పెళ్ళిపీటలమీద కూర్చున్నారు. తంతులు నడుస్తున్నాయి. వధూవరులిద్దరూ మధుపర్కాలు మార్చుకున్నారు. బ్రాహ్మణులు చెప్పిన ప్రకారం మంత్రాలుచ్చరిస్తున్నారు. తంతులు నడుపుతున్నారు.

చూసేవాళ్ళు చాలామంది "చూడ చక్కని జంట" అనుకుంటున్నారు. తంతు చూస్తున్న లీల హృదయంలో రవంత అసూయ కలగకపోలేదు. పెళ్ళి ముస్తాబులో శ్యామల చాలా

అందంగా ఉంది. ఆ దుస్తులలో తననూహించుకుని, తనకూ ఆ రోజెప్పుడోనని లీల తనలో తను నిట్టూర్చింది.

ముహూర్తం సమయం వచ్చింది. జీలకర్ర, బెల్లం కలిపి నూరిన ముద్దను శ్యామల తలమీద గిరిబాబూ, గిరిబాబు తలమీద శ్యామలా ఉంచారు. మంగళవాద్యాలు మార్మోగాయి,

మరికొద్ది క్షణాలలో గిరిబాబు శ్యామల మెడలో మూడు ముళ్ళూ వేశాడు.

మరికొద్ది క్షణాలకా ఆవరణలో "పోలీసులు-పోలీసులు!" అన్న కలకలం వినిపించి గిరిబాబు ఉలిక్కిపడ్డాడు.

10

గిరిబాబు తనను గురించిన పూర్తి వివరాలు చెప్పాడు.

"అయామ్ ఎక్స్ట్రీమ్‌లీ సారీ సార్! మీకు ట్రబులివ్వాల్సొచ్చింది. కానీ మా డ్యూటీ అలాంటిది!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్.

"ఫరవాలేదు. మీ డ్యూటీ మీరు చేయండి" అన్నాడు గిరిబాబు. తన పెళ్ళి వ్యవహారంలోకి పోలీసులు రావడం అతనికి నచ్చలేదు. అదో అపశకునంలా అతనికి తోచింది. మనసులో ఆందోళన బయల్దేరింది. ఎందుకంటే ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గురించి అతను వినివున్నాడు. డబ్బు అతనిమీద ఏ విధమైన ప్రభావమూ చూపదనీ, చట్టాన్ని నిర్భయంగా అమలుపరుస్తాడనీ అంతా చెప్పుకుంటూంటారు.

"ఏమీ లేదు. ఈ అమ్మాయెవరో మీకు తెలుసా?"

పక్కనే ఉన్న రంగడు "తెలియకుండానే ఎలా పెళ్ళి చేసుకుంటారండీ! ఇది అక్షరాలా ప్రేమవివాహం. వధూ

వరులు ఒకరినొకరు పూర్తిగా అర్థంచేసుకున్నాకనే ఈ వివాహానికి తలపడ్డారు" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ కోరిన మీదట శ్యామల తనకు సంబధించిన వివరాలు పూర్తిగా చెప్పింది. అన్నీ నోట్ చేసుకున్నాక శ్యామలవంక అదోలా చూస్తూ ఇన్‌స్పెక్టరిలా అన్నాడు. "మిసెస్ గిరిబాబూ ఇలా అడుగుతున్నామని మరోలా అనుకోకండి. మీరు బీదిపంతులు కూతురని చెప్పారు. కానీ మీ మెడలోని వజ్రాలహారం సుమారు రెండులక్షల యాభై వేలు చేస్తుంది. ఎలా వచ్చిందో చెప్పగలరా?"

రంగడు కలగజేసుకుని "ఆ పిల్ల గిరిబాబు భార్య అని మరిచిపోతున్నారు. అది అత్తవారి తరపుకానుక" అన్నాడు.

"అయితే ఇదిమీరే ఆమెకిచ్చారా?" అనడిగాడు చంద్రశేఖర్.

"ఊఁ" అన్నాడు గిరిబాబు.

"ఆ వజ్రాలహారాన్ని ఒకసారిలాగిస్తారా?" అన్నాడు చంద్రశేఖర్.

గిరిబాబు తడబడ్డాడు. శ్యామల వెంటనే మెడలోని హారాన్నితీసి ఇన్‌స్పెక్టర్‌కందజేసింది. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ దాన్ని పరిశీలనగా చూసి అటూ ఇటూ తిప్పాడు. హారం వెనకాల—"రతన్‌లాల్" అని వ్రాసి ఉంది. ఆ పేరు వధూవరులకు చూపిస్తూ "ఈ హారం రతన్‌లాల్ దనడానికి ఇది మొదటి ఋజువు. మిగతా ఋజువులు తర్వాత చూపిస్తాను. కానీ దీనికి మీ సమాధానం కావాలి నాకు" అన్నాడు.

గిరిబాబు నిశ్శబ్దమైలాడు. ఏం చెప్పాలో అతనికి తోచ లేదు. పొరపాటున తను అది తనే శ్యామలకిచ్చానన్నాడు

ఇన్‌స్పెక్టర్‌తో.

రంగడు, గిరిబాబు చెవిలో నెమ్మదిగా "బాబూ! అను కోనికష్టం వచ్చింది. పదికాలాలపాటు మీరు వర్ధిల్లితేనే మాకు బ్రతుకుంటుంది. నేనన్నదానికల్లా అవుననండి. నా గురించి బాధపడకండి. వ్యవహారం నేను చూసుకుంటాను" అన్నాడు.

గిరిబాబుకేం జవాబివ్వాలో కూడా తోచలేదు. రంగ డిప్పుడేం చేయబోతున్నాడో కూడా అతనికి తెలియలేదు.

"ఏమిటి మీ మంతనాలు" అన్నాడు చంద్రశేఖర్ తీవ్రంగా.

"ఇన్‌స్పెక్టర్‌గారికి ధర్మనగర్ కాలనీ గురించి తెలిసే ఉంటుంది-" అన్నాడు రంగడు.

చంద్రశేఖర్ ఆశ్చర్యంగా ఆ వ్యక్తివంక చూసేడు. అతను రౌడీరంగణ్ణి చూడలేదు. కానీ వాడిగురించి విని ఉన్నాడు. "అయితే ఇప్పుడేమంటావ్?" అన్నాడు చంద్ర శేఖర్.

"అనడానికేమీలేదండి. నిజం ఒప్పేసుకుంటాను. గిరిబాబు పెద్దలకి తెలియకుండా శ్యామలను పెళ్ళిచేసుకుందా మన్నారు. అందుకు నేనాయనకు సాయపడ్డాను. ఆయనకు పైకములేక పాతికవేల రూపాయలు నాకిచ్చి రతన్‌లాల్ షాపులో పెళ్ళికూతురికి ఏదో ఒక నగ బేరంచేసి తెమ్మన మన్నారు. బేరానికి వెళ్ళిన నాకు ఆ షాపు చూస్తే తల తిరిగి పోయింది. ఆ రాత్రే మొట్టమొదటిసారిగా దొంగతనం చేశాను. పాతికవేల రూపాయలకోసం ఈ దొంగతనం చేశాను. అన్నింటికీ నాదే బాధ్యత. పెద్దవాళ్ళనల్లరిపెట్టకండి ఇందులో గిరిబాబుగారికేమీ తెలియదు" అన్నాడు రంగడు.

చంద్రశేఖర్ ఆశ్చర్యంగా! "అంతా బాగానే ఉంది మరి ఆ పాతికవేలూ ఏం చేశావ్?" అన్నాడు.

రంగడు తనాడబ్బును దాచిన స్థలం చెప్పాడు. చంద్రశేఖర్ అక్కడున్న అందరిదగ్గరా వాట్మూలాలు తీసుకుని. "గిరిబాబూగారూ! మిమ్మల్నిబ్బంది పెట్టినందుకు క్షమించండి. అయితే ఇంతటితో మీ పని పూర్తికాలేదు. మీరూ మీభార్యా కోర్టుకువచ్చి సాక్ష్యమివ్వాల్సి ఉంటుంది" అన్నాడు.

* * *

జైల్లోఉన్న రంగడ్ని కలుసుకుందుకు వచ్చాడు శంకరం. "ఎలా జరిగిందిరా రంగా ఇది. గిరిబాబు శ్యామలను పెళ్ళిచేసుకున్నాడు" అన్నాడు.

రంగడు వివరించాడు. "అంతా నేను కావాలనే చేశాను. గిరిబాబుదగ్గర పాతికవేలు తీసుకుని ఒకచోట దాచిపెట్టాను. మన కేడీ కృష్ణగాడున్నాడుకదా-వాణ్ణి బ్రతిమాలి రతన్‌లాల్ షాపులో హారం పట్టపగలే మాయం చేయించాను. అది శ్యామల మెడలోవేసి ముహూర్తానికింకా అరగంట పైముందనగా పోలీస్ స్టేషన్‌కు అందులోనూ యముడిలాంటి చంద్రశేఖర్‌కు ఫోన్‌చేసి హారం వివరాలు చెప్పాను. శ్యామలను మోసం చేద్దామనుకున్న గిరిబాబు పెళ్ళికి పోలీసులే సాక్ష్యమయ్యారు. కోరి ఎవడూ జైలుపాలు కాడని ఆయనకు తెలుసుగదా! సమయానికి తనను రక్షించానని మాత్రమే అనుకుంటున్నాడు. గిరిబాబు భార్యగా శ్యామల కోర్టులో కూడా నిలబడింది. ఇంక ఆ పెళ్ళికి తిరుగులేదు."

శంకరం కళ్ళొత్తుకుని "రంగా నువ్వుచేసిన త్యాగం సామాన్యమైనదికాదురా! పులిలాంటోడివి కావాలని జైల్లోకి వెళ్ళావు. ఎందుకు చేశావురా ఇదంతా?" అన్నాడు.

"శ్యామల నాకు చెల్లెలైతే ఏంచేస్తానని అన్నావుకదురా? నా చెల్లెల్ని నేనెలా రక్షించుకుంటానో, నా చెల్లెలికోసం నేనేంచేస్తానో చేసి చూపించానురా! నీకులా గదిలో ఇనుప గొలుసులతో కట్టబడలేదురా! గిరిబాబుకి తెలియకుండానే ఆయనకూ శ్యామలకూ విడదీయలేని బంధం వేసేశాను!" అన్నాడు రంగడు.

"కానీ నువ్వు జైలుపాలైనందుకు నాకు చాలా బాధగా వుంది." అన్నాడు శంకర్.

"నాకు మాత్రం చాలా సంతోషంగా ఉంది. ఒక మంచి పనికోసం ఎంతకష్టపడినా పని సక్రమంగా అయితే మనకు ఆనందమే మిగుల్తుంది. ఈ జైలు శిక్షలో నా పాపాలన్నీ కడిగేసుకుని తిరిగివచ్చేక కొత్తజీవితం ప్రారంభిస్తాను. నా కొత్తజీవితం పాపాలకు దూరంగా, ఎవరికీ బాధ కలిగించని దారిలో ఉంటుంది" అన్నాడు రంగడు.

రంగడి కళ్ళలో కొత్తమెరుపు చూపిన శంకరం ఆలోచనలోపడ్డాడు. ***

హిప్పీ పెళ్ళికొడుకు షరతులన్నిటికీ తల వూపారు మామగారు.

అంతా అయిన తరువాత మామగారు ఇలా అన్నారు—

"కాని అల్లుడుగారూ, నాదీ ఒక షరతు వుంది. అదేమిటంటే పెళ్ళికి ముందే మీరు మీ జుట్టంతా నా కూతురు సవరానికి ఇచ్చివేయాలి!"

—'జ్యోత్స్న', ఆలేరు.

కైలాసనగరం

సీరియల్

(గత సంచిక తరువాయి)

చెట్లకు వ్రేళ్ళాడుతూ స్లీపింగ్ బ్యాగ్స్‌లో వున్న మేము దాని దృష్టిలో శ్రేష్ఠమైన ఆహారంగా కనిపించివుండాలి. కొండచిలువ ఉదరంలోని జీర్ణరసాలు ఎముకల్తోసహా కరిగించివేయగలవట. అందుకనే నా ముఖం మండుతూ వుండివుండాలి.

ఆందోళనతో క్షణంపాటు ఏం చెయ్యాలో తోచలేదు. కొండచిలువలు తమ ఆహారం తీసుకొన్న తరువాత చెట్టు కొమ్మలకు చుట్టుకొంటాయట. అలా చుట్టుకొన్నప్పుడు ఉదరంలో జీవాలు నలిగి పిప్పయి త్వరగా జీర్ణమవుతా

యట. ఈ కొండచిలువ కొమ్మలకు చుట్టుకోవడం మొదలెడితే నా పని ఆఖరు.

చకచక కుడిచేతిని కాళ్ళవైపు పోనిచ్చాను. నేను నా హంటింగ్ నైఫ్ నిద్రలో కూడా మేజోడులో ఆట్టే పెట్టుకొంటాను.

చేతికి హంటింగ్‌నైఫ్ దొరగ్గానే కొండంత ధైర్యం వచ్చింది. శరీరంమీద వత్తిడి తగ్గినా చేయి అటూ ఇటూ బలంగా కదపడానికి సరిపడా స్థలంలేదు లోపల. బలవంతంగా చేతిని పైకి తెచ్చి శక్తికొలదీ దాని ఉదరాన్ని చీల్చి గాయపరచసాగాను.

ఉన్నట్లుండి దాని శరీరంలో విపరీతమైన చలనం ప్రారంభమైంది. దాని శరీర కండరాలు గట్టిగా నన్ను వత్తడం మొదలుపెట్టాయ్, కొండచిలువ శక్తి నిజంగా అపూర్వం. నా చుట్టూ ఆ ఇన్‌స్యులేటెడ్ స్లీపింగ్ బ్యాగ్ గాని లేకపోయినట్లయితే పిప్పి అయివుండేవాణ్ణేమో!

ఇక ఉపేక్షిస్తే లాభంలేదనుకొన్నాను. శక్తికొద్దీ కత్తిని పైకి పొడిచాను. కొండచిలువ మెలికపడడానికి చేస్తున్న ప్రయత్నం నాకు స్పష్టంగా తెలుస్తోంది. కత్తి దాని చర్మంలో ఇరుక్కొంది. మరింత బలంగా పైకి పొడిచాను.

కత్తి దాని చర్మాన్ని దూసుకొని బయటికి వెళ్ళినట్లు అనిపించింది. అదే సమయంలో కొండచిలువ తన కండరాల కదలిక ద్వారా నన్ను తన కడుపులో మరింత లోపలికి నెట్టడానికి ప్రయత్నం చేసింది.

మెల్లిమెల్లిగా నేను క్రిందికి జారుతున్నట్లు నాకు తెలుస్తూనేవుంది. ఓ విధంగా అది ఈ రకంగా చేయడంవలననే నేను రక్షించబడ్డానని చెప్పాలి. కత్తిని దాని శరీరంలో

గుచ్చి పట్టుకోవడంవలన అది నన్ను మరింత లోపలకు నెడుతోంటే నాతోపాటు కత్తి కూడా దాని చర్మాన్ని నిలువునా చీల్చుకొంటూ వెనక్కి జరగసాగింది.

కొండచిలువ రక్తం, ఇతర ద్రవాలు నా ముఖాన్ని తడుపుతున్నాయ్. ఊపిరాడక గిలగిల్లాడాను. పైకి లేవడానికి ప్రయత్నం చేశాను.

చిత్రంగా నేను లేస్తోంటే నా తల దాని శరీరానికి తగిలి సాగసాగింది. ఉన్నట్లుండి చల్లటి గాలి తగిలింది నా ముఖానికి.

క్షణంపాటు ఏమీ తెలియలేదు. చెవులకు ఏవేమో అరుపులు వినిపించాయి. కంటినిండా రక్తం, జిగటలాంటి ద్రవం వుండడంవలన స్పష్టంగా ఏమీ కనిపించడంలేదు.

సర్రున దాని కడుపులోనుండి జారి క్రింద పడ్డాను. శరీరం భూమిని తాకకముందే స్పృహపోయింది నాకు.

22

మళ్ళీ మెలకువ వచ్చేప్పటికి బారెడు పొద్దెక్కి వుంది.

డాక్టర్ మిత్రా ముఖం నవ్వుతో కనిపించింది,

"ఆర్ యు ఓ.కె. విశాల్?" అన్నాడు నాడి చూస్తూ.

నవ్వడానికి ప్రయత్నించినా ముఖమంతా బిగుసుకుపోయినట్లు వుంది. ఏం జరిగిందీ రెండు నిముషాలసేపు గుర్తు రాలేదు. ఆలోచించడానికి ప్రయత్నించాను కళ్ళు మూసుకొని.

"డోన్ట్ మూవ్ ఎట్!" అన్నాడు మిత్రా హెచ్చరికగా.

మెల్లిమెల్లిగా జరిగిన సంఘటన గుర్తు రాసాగింది. రాత్రి కిట్‌లో స్లీపింగ్ బ్యాగ్‌లో నిద్రపోవడం, మధ్య రాత్రిలో కొండచిలువ నన్ను మింగడం, హంటింగ్‌నైఫ్‌తో

దాని పొట్ట చీల్చి క్రిందకు దూకడం, అన్నీ వరసగా గుర్తొచ్చాయి. జరిగిన సంఘటన గుర్తొచ్చి గుండె దడదడలాడింది.

మెల్లిగా లేచి కూర్చోవడానికి ప్రయత్నించాను. ఒళ్ళంతా విపరీతంగా నొప్పులుగా వుంది. గాడ్సన్, డాయిగ్‌ల సహాయంతో చెట్టుకొదె నానుకొని కూర్చొన్నాను.

మెల్లి మెల్లిగా ఒక్కొక్క అవయవమూ స్వాధీనంలోకి వచ్చాయి. ముఖమూ, చేతులమీద చర్మం ఇంకా మంటగానే వుంది.

"కంగ్రాచ్యులేషన్స్ విశాల్! పైథాన్‌చే మింగబడి పొట్ట చీల్చుకు వచ్చినవాళ్ళ కథలు విన్నానేగాని ఇంతవరకూ అలాంటి మనిషిని చూళ్ళేదు. ఈరోజు నిన్ను చూస్తున్నాను. యు ఆరె లక్కీ గై!" అన్నాడు గాడ్సన్.

"అటు చూడు. ఆ చచ్చిన కొండచిలువ ఆ చెట్టునుండి ఇంకా అలాగే వ్రేలాడుతోంది" అన్నాడు డాయిగ్ దూరంగా వున్న చెట్టును చూపెడుతూ.

మెల్లిగా లేచి ఆ చెట్టుదగ్గరికి నడిచాను. సగం శరీరం కొమ్మలకు చుట్టుకొనే వున్నా, తల, మెడ, కడుపుభాగం చెట్టునుండి వ్రేలాడుతూనే వున్నాయి. క్రింద ఓ పెద్ద మడుగులా దాని రక్తం, శరీర ద్రవాలుకారి నేలలో ఇంకిపోయాయి.

సాటో నవ్వుతూ చూశాడు. "నువ్వు దాని పొట్టచీల్చుకు రావడం స్పష్టంగా చూశాను నేను. దాదాపు దాని శరీరంలో మూడడుగులు పొడవున చీల్చావు. హఠాత్తుగా జరిగిన సంఘటనవలన నువ్వు శరీరంలోనుండి బయటపడుతూ వుంటే మతి చలించినవాళ్ళకు మల్లే చూస్తూ వుండి

పోయాము" అన్నాడు.

నిజమే! దగ్గరినుండి చూస్తే తెలుస్తోంది. దాని కడుపులో దాదాపు మూడడుగుల పొడవున నేను హంటింగ్ నైఫ్‌తో చీల్చినభాగం కనబడుతోంది. నేను దాని చర్మాన్ని కత్తితో పొడిచినప్పుడది నన్ను మరింత లోపలకు మింగాలని ప్రయత్నించి వుండకపోతే అంతపెద్ద చీలిక ఏర్పడి వుండేది కాదేమో!

అన్నిటికన్నా నాకు ఆశ్చర్యం కలిగించిన విషయం మరోటి. దాని తల అడుగుకన్నా ఎక్కువలేదు. దాదాపు మూడడుగులు వ్యాసం వున్న స్లీపింగ్ బ్యాగ్‌ని లోపల మనిషితో సహా ఎలా మింగగలిగిందా అని? బహుశా దాని నోట్లో సాగుడు గుణం గలిగిన కండరాలు వుండి వుంటాయి.

ఆరోజు మధ్యాహ్నం పన్నెండుగంటలకి, అన్ని పాక్ చేసుకొని దూరంగా కనిపిస్తోన్న పర్వతాల వైపు బయలు దేరాము.

ఒళ్ళంతా నొప్పులుగా వున్నా మెల్లిగా ప్రయాణం చెయ్యడంవలన పెద్ద అలసట అనిపించలేదు.

మొదట ఈ కైలాసనగర యాత్రకు బయలుదేరినప్పుడు అసలు కైలాసనగరాన్ని చూడగలుగుతానా అనే అనుమానం నన్ను మనసు మూలల్లో ఎక్కడో పీడించేది. కాని ఈ రోజు.... కొండచిలువ గర్భంలో ఓ చావు పొంది తిరిగి బ్రతికినట్లయ్యాక అదృష్టం నా పక్షాన వుందనీ.... కైలాస నగరాన్ని చేరుకోగలననీ ఎందుకో దృఢంగా అంతరాత్మకు అనిపించింది.

23

సూర్యాస్తమయానికి వ్యవధి ఇంకా కొద్ది గంటలే వుంది.

మేము ఆగిన కొండపై నుండి చుట్టూవున్న ప్రాంతాలను జాగ్రత్తగా పరిశీలించి చూశాము. మా మాప్ ప్రకారం గుర్తుగా వుండే కొండలుగాని, శిఖరాలుగాని చుట్టుప్రక్కల ఏమీ కనిపించలేదు.

కొండ అవతలి భాగమంతా మళ్ళీ దట్టంగా పెరిగిన అడవితో నిండివుంది. అందరి ముఖాల్లోనూ ఆతృత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

"హే! లుక్ దేర్!" అన్నాడు ముల్లరి పశ్చిమ దిశగా చూపెడుతూ.

అందరం తలలు ఆ వైపు తిప్పాము.

దూరంగా ఎక్కడో ఆకాశంలోకి తెల్లని, సన్నని పొగ వస్తోన్నట్లు కనిపిస్తోంది

"బహుశా ఏ కొండజాతి గూడెమో అయివుంటుంది" అన్నాడు శంఖా.

"ఫర్ గెట్ ఇట్!" అన్నాడు గాడ్సన్ గత అనుభవాన్ని గుర్తుతెచ్చుకొని.

"నో!" అన్నాను నేను. "దారితప్పి వున్నాము. అరుణా నది రెండు పాయలు కలిసే ప్రదేశం చేరేమార్గం తెలిస్తే కాని మనం ముందుకు పోలేము. ఆ దారంటూ వుంటే ఈ ప్రాంతాల వుండేవారికే తెలియాలి."

"వద్దు విశాల్! ఆ ఆటవికుల జోలికి మనం పోవద్దు. సాధుస్వభావులని పేరుబడిన వాళ్ళదగ్గరే మనమోసారి ప్రాణాలమీదకు తెచ్చుకొన్నాం" అన్నాడు మిత్రా. చాంగా

గూడెంలో ఆనాటి అనుభవం ఎవ్వరూ మరిచిపోలేరు.

కాని,ఈ మహాపర్వతశ్రేణుల్లో, కీకారణ్యాల్లో దారితప్పిం తరువాత తిరిగి సరైన మార్గంలో పడడం గడ్డివామిలో సూది వెదకడంలాంటిది.

చిన్నగా నవ్వాను నేను. "కాని తప్పదు మై డియర్ ఫ్రెండ్స్! ఎవరో ఒకరి సహాయం లేకపోతే మనమీ ప్రాంతాల్లో శాశ్వతంగా దారితప్పిపోయే ప్రమాదం వుంది. ఇలా తోచిన వైపుకు పోతూ దారి వెతుక్కొంటూ ఎంత కాలం తిరుగుతాం?" అన్నాను.

పదినిముషాలు తర్జనభర్జనలు జరిగేక, మరోమార్గం లేదని నిశ్చయించుకొని ఆ ప్రాంతానికి వెళ్ళడానికి నిశ్చయించుకొన్నాం.

మేము నిలబడ్డ ప్రదేశానికి అట్టే దూరం లేదది. బహుశా మూడుమైళ్ళుంటుందేమో. చెట్లమధ్యన చాటుగా వుండడంవలన ముందు మాకేమీ కనిపించలేదు.

అది ఓ పురాతన భవనం. సరిగ్గా వర్ణించాలంటే చిన్న సైజు కోటలా వుంది. దట్టమైన అడవిలాంటి చెట్లమధ్య చతురస్రంగా కట్టబడిన కోటలా వుంది. చుట్టూ పది పన్నెండు ఎకరాల మేర చెట్లు నరకబడి, వరిచేలు ఉన్నాయి.

ఆశ్చర్యపోయాము మేము. ఆ భవనం దగ్గరికి వెళ్ళడానికి దారిలాంటిది ఏమీలేదు. పైరు గట్టమ్మటే నడిచి కోట గుమ్మంలా వున్న పెద్దతలుపు దగ్గరికి నడిచాము.

మేము తలుపుకు ఇంకా పదిపదిహేను గజాల దూరంలో వుండగానే ఎక్కడో పెద్ద చేగంట మ్రోగుతున్న చప్పుడు వినిపించింది. మెల్లిగా కోట తలుపులు తెరుచుకొన్నాయి.

ఆశ్చర్యంగా ముఖాలు చూసుకొన్నాము మేము. తెరిచిన

కోట తలుపుల మధ్యనుండి ఆవరణలో వున్న పెద్ద బుద్ధ విగ్రహం కనిపిస్తోంది.

"లుక్స్ లైక్ బుద్ధిస్ట్ మాన్‌స్టరీ" అన్నాడు గాడ్సన్.

"అవును! బౌద్ధ ఆరామంలానే వుంది. ఎవరూ కనిపించరే?" అన్నాడు శంఖా.

తలపాగాలు చుట్టుకొన్న నలుగురు మనుషులు మావైపు రావడం కనిపించింది. భుజాల దగ్గరనుండి పాదాలవరకూ జీరాడుతోన్న అంగీలు ధరించివున్నారు వాళ్ళు. వాళ్ళు నవ్వుతూ మాకు ఎదురొచ్చారు.

బాగా దగ్గరగా వచ్చింతరువాతగాని వాళ్ళు స్త్రీలని గుర్తించలేదు నేను. వయసులో పెద్దవాళ్ళు. దాదాపు అరవై ఏళ్ళు వుంటాయనుకొంటాను వాళ్ళకు.

వాళ్ళు దగ్గరికి వచ్చేవరకూ తెరుచుకొన్న తలుపుల దగ్గరే నిలబడిపోయాము. మాకు దగ్గరగా వచ్చి చేతులు చాపి ఏదో అన్నారు వాళ్ళు. వెంటనే అర్థమయింది నాకు ఆ భాష టిబెటన్ భాష అని.

శంఖా ముఖంలో చిరునవ్వు మెదిలింది. "వాళ్ళు టిబెటన్ భాషలో మాట్లాడుతున్నారు. లోపలికి దయచేసి వాళ్ళ ఆతిథ్యం స్వీకరించమంటున్నారు."

మాతో వున్న పాశ్చాత్యులు ముగ్గురికీ తప్ప మిగిలిన అందరికీ టిబెటన్ భాష వచ్చు. షారాపెన్ ప్రాంతంలో పదిహేనవ శతాబ్దంలో కేవలం బౌద్ధభిక్షుణులకోసం కట్టబడిన ఆరామం అట అది.

మేము ప్రాంగణంలో అడుగుపెడుతోంటే ఆరామం గదుల్లోనుండి, పై అంతస్థు స్తంభాల చాటునుండి అనేక కళ్ళు మమ్మల్ని చూడడం గమనించాను. కొందరు గిలి

గింతలుగా నవ్వుకోవడం, గుసగుసలాడుకోవడం విని పిస్తూనే వున్నాయి.

ఆరామం ప్రాంగణంలోనే ఓ మూల నీటితొట్టి వుంది. గుర్రాల్ని అక్కడ వదలమని చెప్పి మమ్మల్ని ఓ గదిలోకి తీసుకెళ్ళారు ఆ నలుగురు.

విశాలమైన హాలది. పురాతనపు ఫర్నిచరు వుంది. గోడలకు కంచుతోనూ, వెండితోనూ చేసిన బుద్ధదేవుడి బొమ్మలు, నగిషీలు వ్రేలాడుతోన్నాయి. అందరం పురాతనపు కుర్చీల్లో కూర్చున్నాం. ఎక్కడో గంట మ్రోగింది.

ఆరామానికంతటికీ ప్రధాన భిక్షుణి మమ్మల్ని కలుసుకోడానికి వస్తోందని చెప్పారు. బౌద్ధభిక్షుణులు తలవెంట్రుకలు వుంచుకోరు. వాటిని విధిగా తీసివేస్తారు. అతిథులు వచ్చినప్పుడు కపాలం కనిపించకుండా గుడ్డ కడతారు.

మేము కూర్చున్న ప్రదేశానికి ఎదురుగా తలుపుంది. తలుపు వెనుక అలికిడయింది. తలుపులు తెరుచుకొన్నాయి. క్షణంసేపు ఊపిరి బిగబట్టి చూస్తూవుండిపోయాను.

దాదాపు ఆరడుగులు వుంటుందామె. అయితేనేం అంత అందాన్ని నేనింతవరకూ చూడలేదు. తెల్లని సిల్కు అంగీ, తలకు నల్లని తలపాగా, పెద్ద కళ్ళు, తీర్చిదిద్దినట్లున్న ముఖ రేఖలు, అంగిలోనుండి పొడుచుకువస్తోన్న చనుద్వయం. అంగిలోపల వేరే వస్త్రాలు లేవని స్పష్టంగా తెలుస్తోంది.

అందరం లేచి నిలబడ్డాము. నలుగురు ముసలి భిక్షుణులు నమ్రతగా తలలు వంచి నిలబడ్డారు.

"మీరు విశ్రాంతికోసం మా ఆరామానికి వచ్చినందుకు సంతోషం. మాకున్నదంతా మీది. అతిథి మాకు దేవుడు" అన్నదామె గంభీరంగా.

ఆమెను చూస్తోంటే గుండెల్లో ఏ మూలో గంటలు మ్రోగసాగాయి నాకు.

అమె తిరిగి, ఆ నలుగురివైపు తిరిగి, "అతిథులకు ప్రత్యేక బస ఏర్పాటుచేసి, వాళ్ళ అవసరాలు తీర్చండి. ఆతిథ్యానికి లోటు రానివ్వకండి" అంది మాతో శెలవు పుచ్చుకొంటూ.

"గ్వాడ్! షి యీజె రియల్ చిక్!" అంటున్నాడు గాడ్సన్ గుటకలు మింగుతూ.

"మోర్ చార్మింగ్ దేన్ దోజ్ చౌంగా బిచ్చెస్!" అన్నాడు మిత్రా.

"కంట్రోల్ యువర్ సెల్ఫ్స్!" అన్నాను నేను నా భావాల్ని దాచుకొంటూ.

తర్వాత మా నలుగుర్నీ వేర్వేరు గదుల్లోకి తీసుకెళ్లారు. పది నిముషాల్లో స్నానశాలకు తీసుకెళతాననీ, సిద్ధంగా వుండమని చెప్పి వెళ్ళింది ముసలి భిక్షుణి.

ఉత్సాహంగా తల వూపాను నేను. బయటికి నడిచి తలుపు మూసింది ముసల్ది. గదిలోవున్న రాతి మంచంమీద నడుం వాల్చాను.

24

పావుగంట తర్వాత ముసల్ది మళ్ళీ తిరిగొచ్చి వెంట రమ్మని సైగ చేసింది. నేను ఛేంజ్ ఆఫ్ డ్రెస్‌కోసం మా సామాన్లు ఎక్కడ వున్నాయని అడిగాను. నవ్వి అవసరం లేదులే అన్నది. అర్థం కాలేదు నాకు.

మౌనంగా ఆమె వెంట బయలుదేరాను. చిత్రంగా వుంది ఈ ఆరామం కట్టడం. అన్నీ వరసగాకట్టిన పెద్ద పెద్ద గదులు. వరండామీదనుండి చివర గదిలోకి తీసుకెళ్ళింది.

నున్నని పాలరాతిలా వున్న పింగాణీ నేల. శుభ్రంగా, తెల్లగా మెరిసిపోతోంది. గది మధ్య తెల్లని రాతితొట్టి వుంది. తొట్టి ప్రక్కనే చిన్న రాతిబల్ల. దానిమీద చిన్న చిన్న పింగాణీ జాడీలు, పీచుతో చేసిన బ్రష్ వగైరా లున్నాయి.

గోడకు చిన్న అల్మెరా వుంది. చూడగానే స్నానాల గదని తెలుస్తోంది. నా వెనకే మరో ఇద్దరు భిక్షిణులు లోపలకు వచ్చారు. వాళ్ళు కూడా తెల్ల అంగీలు ధరించి వున్నారు. తలకు తెల్లని బట్ట కట్టుకొన్నారు. శరీరంలో వంపులు అంగీలలో దాచేసినా, ముఖాల్లో మాత్రం దాగడం లేదు. బహుశా ముప్పైఏళ్ళు వుంటుందేమో వాళ్ళ వయసు. ఇంకా తక్కువా వుండొచ్చు.

వాళ్ళు స్నానాల గదిలోకి వస్తూనే లోపలికి వచ్చే ద్వారాన్ని మూసి గడియపెట్టారు. ముసలి భిక్షణి తొట్టికి ఎదురుగా వున్న ఓ రాతి స్టూలుమీద కూర్చుంది.

నేను చిత్రంగా చుట్టూ చూశాను. "ఇతరుల ముందు స్నానం చెయ్యాలంటే సిగ్గుగా వుంటుంది నాకు" అన్నాను.

నవ్వింది ముసల్ది. "ఈ పర్వతాలలో ప్రయాణంచేసి అలిసివున్నావు. సరిగ్గా స్నానంచేసి ఎన్నో రోజులైనట్లు నీ ఒంటిరంగు చూస్తోంటే తెలుస్తోంది. ఆ మురికంతా నీ అంతట నీవు వదిలించుకోవడం కష్టం."

"మైగాడ్! అయితే వీళ్ళిప్పుడు నాకు స్నానం చెయ్యి స్తారన్నమాట" అన్నాను ఆశ్చర్యపోతూ.

"అవును! కంగారుపడవలసిన పనిలేదు. సర్వసంగ పరిత్యాగులం మేము. మాకు ఆడామగా భేదం లేదు" అన్నది ముసల్ది.

ఎందుకో ముసల్దాని మాటలు నమ్మ బుద్ధికాలేదు. వయసులో వున్న ఆ భిక్షిణుల చూపులు నన్ను ఆ మాటల్ని నమ్మనివ్వడంలేదు. స్త్రీ సుఖం తెలియని బ్రహ్మచారిని కాను నేను. ఆ అనుభవం, ఆనందం చవిచూసినవాణ్ణి.

ఈ వారంరోజుల ప్రయాణంలో అలసట మరచి కాసేపు జల్సా చేద్దామనిపించింది మనసుకి. ఎంత బౌద్ధభిక్షుణులైనా స్త్రీపురుషుల మధ్య అగ్ని ఆరేదికాదని నా మనసుకు తెలుసు.

టాప్‌కోటూ, బనియనూ, ఉన్ని జీన్సూ, మేజోళ్ళు, చేతికున్న గడియారం వగైరా తీసేసి బల్లమీద పెట్టాను. వంటిమీద లంగోటా తప్ప మరేమీ లేదు.

ఆ ఇద్దరు యువతుల కళ్ళు ఆకలిగొన్న పులిచూపుల్లా వున్నాయి. ఎందుకో బౌద్ధభిక్షిణులు అనాలనిపించడంలేదు వాళ్ళను. వాళ్ళ ముందు అలా నగ్నంగా నిలబడాలంటే కాస్త సిగ్గనిపించింది.

"అలా నిలబడి చూస్తారేం! అతనికి స్నానం చేయించండి" గసిరింది ముసలిది.

వాళ్ళిద్దరూ కలలోంచి బయటపడ్డ మనుషులకు మల్లే తల విదిలించి నా దగ్గరగా వచ్చారు.

"తొట్టెలో కూర్చోండి" అన్న దొకతె వణికే గొంతుతో.

రెండవది నా చెయ్యిపట్టుకొని తొట్టెలోకి కూర్చోపెట్టింది. ఆమె చెయ్యి నన్ను తాకినప్పుడు ఎందుకో షాక్ కొట్టినట్లయింది. నాలో బలహీనతో లేక ఆమెలోని కోరిక తీవ్రతో అర్థంకాలేదు.

"అదికూడా ఎందుకు?" అన్నది ముసల్ది పరిహాసంగా నవ్వుతూ.

ఆ స్త్రీల చేతులు ఆత్రంగా నా శరీరంమీదకు పాకాయి. క్షణంలో నన్ను పూర్తి నగ్నంగా తయారుచేశారు. వివేకం హెచ్చరిస్తోన్నా, ఇంద్రియాలు నాకు ఎదురుతిరిగి వాళ్ళ స్పర్శలో వున్న ఆనందాన్ని తనివితీరా అనుభవించ సాగాయి.

మొదట గంధపు నూనెతో శరీరమంతా మర్దన చేశారు. సున్నితమైన ప్రదేశాలను, కంపిస్తున్న చేతుల్తో ముట్టు కొన్నారు. తొట్టినిండా నీరునింపి, దాంట్లో ఏదో సువాసన చూర్ణాన్ని కలిపారు. నీటిలో ఏదో రసాయనం కొంత వేసి గిలకొట్టగానే తెల్లని నురుగు వచ్చింది. లిక్విడ్ సోప్‌లాంటి ద్రవం అయింటుందది.

దాదాపు అరగంటసేపు సాగిందీ తతంగం. నీటితొట్టెలో వాళ్ళ చేతులు నాలో వీణానాదాన్ని మ్రోగిస్తున్నాయి. కళ్ళు మూసుకొని ఆ చల్లని సుగంధ పరిమళంతో నిండిన నీటిలో పడుకొని ఆనందం అంచుల్లోకి వెళుతూ, క్షణంలో పాతాళం లోకి దిగజారుతూ గడిపాను.

మా చేష్టల్ని ముసల్ది తనివితీరా చూస్తూ కూర్చొంది. వాళ్ళ చేతులు నా శరీరంమీద ప్రాకాక, నా చేతులు వూరికే వుండలేకపోయాయి. వాళ్ళు ఆ తెల్లని అంగీలలోపల ఏమీ ధరించరని తెలిసిపోయింది. నా చేతులు వాళ్ళమీద పడగానే పరవశంతో మూలగసాగారు వాళ్ళు.

"ఇక చాలు" అన్నది ముసల్ది నన్ను తొట్టెలోంచి బయటికి రమ్మని సైగచేస్తూ.

నేను తొట్టెలోంచి లేచి క్రిందకు దిగి నిలబడగానే గొల్లున నవ్వారు వాళ్ళు ముగ్గురూ నా శరీరంలో వచ్చిన మార్పుకు.

తెల్లని మల్లెపువ్వుల్లాంటి తువ్వాలుతో నా వంటిని పొడిగా తుడిచింతరువాత. అలమరాలోనుండి పొడవాటి తెల్లని అంగీ ఒకటి తీసి నాకు తొడిగారు.

స్నానం అయిపోగానే ఆ ఇద్దరు యువతులు తలుపు తెరుచుకొని వెళ్ళిపోయారు. రెచ్చకొట్టబడిన పులిలా వుంది నా పని. అప్పుడే వెళ్ళిపోవద్దన్నాను వాళ్ళను. వాళ్ళు గట్టిగా నవ్వుతూ, వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయారు.

ముసల్ది నన్ను మళ్ళీ వెంటబెట్టుకొని నా గదిలోకి తీసుకు వెళ్ళింది. చుట్టూవున్న గదుల్లోంచి, స్థంభాల చాటునుండి అనేకమంది యువతులు నన్ను రహస్యంగా చూస్తూ వుండడం గమనించాను నేను. ఎందుకో ఆ ఆరామమంతా చెప్పలేని ఎక్సయిట్ మెంట్ లో మునిగిపోయి వున్నట్లనిపించింది నాకు.

ఇలాంటి ఫీలింక్స్‌కి కారణం ఇదని నిశ్చయంగా చెప్పలేము. కాని ఆ వాతావరణాన్ని మనసు చిత్రంగా పసిగడుతుంది.

మనుష్య సంచారంలేని ప్రదేశంలో, మారుమూలలో వుంది ఈ ఆరామం. అందరూ ఆడవాళ్ళే ఇందులో వున్నది అనడంలో సందేహంలేదు. అందులో కొంతమంది 'మగాడు' అనే ఆకారం చూసి కొన్ని సంవత్సరాలై పోయి వున్నా ఆశ్చర్యంలేదు.

నా మిత్రులు ఎవరైనా కనబడతారేమోనని చూశాను. ఎవ్వరి జాడా లేదు. బహుశా నాకు జరిగిన సత్కార్యం లాంటిదే వాళ్ళకు జరుగుతుండడమో, జరగబోతూ వుండడమో అయివుంటుంది. ముసల్దాన్ని అడిగాను.

సమాధానం చెప్పలేదది. అర్ధవంతంగా నవ్వింది.

గదిలోకి వచ్చేటప్పటికి ఓ పింగాణీ గ్లాసులో పొగలు కక్కుతోన్న ద్రవమేదో టేబిల్ మీద పెట్టబడి వుంది. ఏమిటానని చూశాను.

"పాలు!" అన్నది ముసల్ది త్రాగమని సైగచేస్తూ.

నోటితో వూదుతూ చిన్న గుటక వేశాను. తియ్యగా వున్నాయి. కాని రుచిలో ఏదో మార్పు వున్నట్లనిపించింది.

"ఏం పాలు ఇవి?" అన్నాను.

"అంగోరా మేకవి" అన్నది.

త్రాగడం పూర్తిచేశాక గ్లాసు తీసుకొని బయటికి నడిచింది. గది బయటకువెళ్ళి తలుపులు మూసింది. మెల్లిగా మంచంమీద నడుం వాల్చాను నేను.

25

రాతి మంచమే అయినా మెత్తని పరుపు వుండడం వలన హాయిగా వుంది. తలక్రింద చేతులు పెట్టుకొని వెల్లికిలా విశ్రాంతిగా పడుకొన్నాను.

ప్రతి క్షణం నాకు స్నానం చెయ్యించిన ఆ ఇద్దరు యువతులు, వాళ్ళ చిలిపి చేష్టలు గుర్తుకి వస్తోన్నాయ్. వళ్ళంతా తియ్యని బాధ కమ్ముకొంటూంది.

చెప్పలేని ఉద్రేకం కలుగుతోంది. నా పరిధులు నాకు తెలుసు. జీవితంలో అంత ఉద్రేకం ఎప్పుడూ పొందలేదు నేను. శరీరం గాలిలో తేలిపోతున్నట్లు వుంది. నరాలు జివ్వుమని ఘోషిస్తున్నాయి. వాళ్ళిద్దరిలో ఎవరు కనిపించినా గదిలోకి లాక్కురావాలనిపించింది.

చటుక్కున పడకమీదనుండి క్రిందికి దూకి తలుపు దగ్గరికి పరిగెత్తాను. లోపలవైపుకున్న కొక్కెంలాంటిది పట్టుకొని లాగాను. తెరుచుకోలేదు. బహుశా ముసిల్ది బయట

గెడపెట్టి వుంటుంది.

శరీరంమీద వున్న అంగీ రాపిడికి నరాలు తెగిపోతున్నట్లు అనిపించసాగాయి. అంగీ విప్పి ఓ మూలకు విసిరేసి నగ్నంగా నిలబడ్డాను.

నా శరీరంలో మొదలయిన ఈ ప్రకోపానికి అర్థం ఏమిటాని ఆలోచించగలిగే స్థితిలోలేదు మనసు. ఇందాక త్రాగిన పాలు గుర్తుకు వచ్చాయి. వాటి రుచి క్రొత్తగా వుంది. బహుశా శరీరంలో కామోద్రేకం రెచ్చగొట్టే పదార్థమేమయినా కలిపారేమో అందులో.

పిడికిళ్ళు బిగించి తలుపులమీద దబదబ బాదాను. చేతులు కందిపోయి నెప్పిపుట్టేవరకూ అలా బాదుతూనే వున్నాను. అయినా ఎవరూ తలుపులు తెరవలేదు. రాలేదు.

నాలోని కామోద్రేకం క్షణక్షణానికీ పెరిగిపోతోంది. మెదడుకు ఏదో పొరకమ్మి బాహ్యప్రపంచంతో తెగతెంపులు చేసుకొన్నట్లు అనిపించసాగింది.

కిలకిల నవ్వు వినిపించింది. చటుక్కున వెనుదిరిగాను.

గదిలో ఓమూల నిలబడి నవ్వుతోందామె. క్షణంసేపు తేరిపార జూశానామెను. నేను నగ్నంగా వున్నానన్న సంగతి, నా శరీరం పరిస్థితి ఏమీ గుర్తురాలేదు. కళ్ళప్ప గించి అలానే చూశాను.

తెల్లని ఒంటిరంగు, ఆలు చిప్పల్లాంటి పెద్ద కళ్ళు, గుండ్రని ముఖం, సూది ముక్కు, ఎర్రగా తడిగా కవ్విస్తోన్న అధరాలు, అంగిలోనుండి సవాల్ చేస్తున్నట్లు పొడుచు కొస్తున్న వక్షోజాలు, పొడుగూ, పొట్టీకాని ఎత్తు, నా అవస్థ చూసి పగలబడి నవ్వుతోందామె.

"డోన్ట్ లాఫ్ యు బిచ్! కమ్‌హియర్ క్విక్!" అరిచాను కోపంగా.

ఆమె చేతిలో పొగలు కక్కుతోన్న మరో పింగాణి గ్లాసు వుంది. మెల్లిగా అడుగులు వేస్తూ ముందుకు కదిలిందామె. సహించలేకపోయాను ఆ ఆలస్యాన్ని. పులిలా ముందుకు దూకాను. మెరుపులా ప్రక్కకు జరిగి నాకు అందకుండా మంచం దగ్గిరికి పరిగెత్తింది. గ్లాసు బల్లపై వుంచింది.

"తొందరపడకు! నీ కోసమే వచ్చాను!" అంది.

కాలయాపన చెయ్యదలచుకోలేదు నేను. ఆమెను రెండు చేతుల్తో ఎత్తి దగ్గరకులాగి గుండెలకు హత్తుకొన్నాను.

"ఉష్! అలాకాదు! ముందు పాలుతాగాలి" అందామె నా కౌగిలిలోనుండి వెనక్కి వంగిపోతూ.

"ఆ పాలల్లో ఏం కలిపారు?" అన్నాను క్షణం నా కోరిక మరచి.

"మనల్ని ఈ ప్రపంచంనుండి స్వర్గానికి తీసుకుపోయే అమృతం!" అన్నది ఆమె నన్ను మంచం దగ్గరికిలాగి గ్లాసు నా పెదిమలకు ఆనిస్తూ.

ఐ డోన్ట్ కేర్! అనుకొన్నాను. స్వర్గానికెళ్ళినా, నరకానికెళ్ళినా ముందీ ఆడదికావాలి నాకు. దానికి మధ్యలో ఎన్ని అడ్డంకులున్నా అవలీలగా దాటేస్తాను. చటుక్కున గ్లాసు ఎత్తి ఆ పాలను నోట్లో పోసుకొన్నాను.

"కాల్తాయి!" అన్నదామె భయంగా.

"సిల్లీ!" అన్నాను కాలుతోన్న పాలును గుటకలు వేస్తూ. నోరు భగ్గుమంటోంది.

అపరాధ పరిశోధన పోటీ-103 [ఫలితాలు]

ఫిబ్రవరి '77 నెల 'అపరాధ పరిశోధన పోటీ_103' కి సరియైన సమాధానాలు :

1. డి. ఎమ్. కె.
2. హిప్పీలు.
3. సర్కస్.
4. బెంగుళూరు.
5. హత్యలు.

పై జవాబుల ప్రకారం ముగ్గురు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి మే '77 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేతలు :

(1) శ్రీ డి. గోవిందు, (అసిస్టెంట్)
కె. ఐ. బి. పవర్ హౌస్,
రాయచూరు_584 101.

(2) శ్రీ సి. హెచ్. నాగేశ్వరరావు,
కేరాఫ్_శ్రీ కనకదుర్గ దాల్ అండ్ ఫ్లోర్ మిల్,
జైహింద్ మార్కెట్,
విజయవాడ_1.

(3) శ్రీ ఎన్. కె. జ్ఞానేశ్వరబాబు,
తండ్రిపేరు_ఎన్. సత్యనారాయణ,
(రైస్ మర్చంట్)
పెనుగొండ_534 320,
ప. గో. జిల్లా.

ఖాళీ అయిన గ్లాసును ఓ మూలకు విసిరేశాను. గ్లాసు భళ్ళున పగిలింది. ఇద్దరం ఒకేసారి పరుపుమీద పడ్డాము....

ఆ రాత్రి ఎలా గడిచిందీ, ఎలా గడిపాము అని దయ చేసి నన్నెవరూ అడగకండి. చెప్పగల ఓపికా, శక్తి నాలో లేవు.

శరీరంలో శక్తి అంతా లావాలా బయటికి ప్రవహించినా, శరీరాల రాపిడికి అవయవాలు కందిపోయి బాధిస్తోన్నా, తిరిగి తిరిగి ఆ అనుభవం కోసమే శరీరం అర్రులు చాస్తోంది. నాతోపాటు ఆ పాలు త్రాగిన ఆమె స్థితి అలాగే వుంది. ఒకరి కౌగిలిలో ఒకరు ఎప్పుడు మైమరచి నిద్ర పోయామో తెలియదు.

నిన్నటి ముసల్ది వచ్చి మా ఇద్దరినీ కుదిపి లేపేవరకూ మెలకువరాలేదు. కళ్ళు తెరిచాను. మత్తుగా, భారంగా వుంది. అయినా ఆకలి అనిపించలేదు. ఓ పళ్ళెంలో ఏవో పదార్థాలు బల్లమీద వుంచి మా నగ్నశరీరాలను నవ్వుతూ చూసి గది లోంచి వెళ్ళిపోయింది. పోతూ పోతూ తలుపు మూసి వెళ్ళింది.

26

నాలుగురోజులు గడిచాయి.

అసలు నాలుగురోజులు గడిచినట్లు నాకు తెలియనే తెలియదు. ఎప్పుడు తింటున్నామో, ఏమి తింటున్నామో, ఏమి త్రాగుతున్నామో గుర్తేలేదు నాకు. ఆ నాలుగురోజుల సంఘటనలు నిజంగా గుర్తులేవు నాకు.

నాలుగవరోజు రాత్రి చీకట్లో ఎవరో నన్ను తట్టి లేపు తున్నట్లనిపించింది.

సప్లిమెంట్ పోటీ-29 [ఫలితాలు]

ఫిబ్రవరి '77 నెల "సప్లిమెంట్ పోటీ_29" కి సరియైన జవాబు:

107	105	103	106	104

పై విధంగా సరియైన జవాబును ఇద్దరు మాత్రమే వ్రాశారు. వీరికి మే '77 నెలనుండి ఒక ఏడాది పాటు "సప్లిమెంట్" ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేత:—

(1) శ్రీమతి సుశీలా కల్యాణి,
24, నామదార్ మంజిల్,
4వ పస్తాలెన్, కొలాబా
బొంబాయి — 400 005.

(2) శ్రీమతి అరుంధతి జ్యోతి,
(బి. ఎస్. సి.)
రామానాయుడు పేట,
మచిలీపట్టణం — 1.

"విశాల్! విశాల్!" ఎవరో రహస్యంగా నా చెవిదగ్గిర పిలుస్తోన్నారు.

"గో ఎవే! డోన్ట్ డిస్టర్బ్" అన్నాను ఆమెను మరింత దగ్గరగా లాక్కొంటూ నిద్రలో మునిగిపోతూ.

చెవిమీద సర్రున మంట పుట్టింది. క్షణం మత్తు విడి బాహ్యప్రపంచంలోకి వచ్చాను.

"గెటప్ యు మగ్! ఊయార్ ఇన్ డేంజర్!" శంఖా కంఠం అది.

తాత్కాలికంగా చెవినెప్పివలన విడిన పొర మళ్ళీ మనసును ఆక్రమించుకోసాగింది.

"ఐ డోన్ట్ కేర్! గో ఎవే!" అన్నాను మత్తుగా.

బహూశా శంఖా నన్ను బలవంతంగా ఆ రాతి మంచం మీదనుండి క్రిందకు లాగివుంటాడు. ఎవరో నన్ను ఈడుస్తున్నట్లు తెలుస్తూనే వుంది. అయినా ఏమిటో తెలుసుకొనే ప్రయత్నం చెయ్యాలనిపించలేదు. గాఢసుషుప్తి వదలి బాహ్యప్రపంచంలోకి రావడానికి మనసు నిరాకరిస్తోంది.

ఈసారి మరింత ఎక్కువగా చెవి మండింది. తర్వాత తెలిసింది శంఖా సన్నని సూదితో నా చెవిమీద పొడిచినట్లు. క్షణం మత్తు విడిచిపోయింది.

"విశాల్! డ్రింక్ దిస్! కమాన్ మాన్!" శంఖా కంఠంలో ఆతృత. నోటికి ఏదో పాత్ర తగిలింది.

మళ్ళీ మత్తు ఆవరిస్తోంది. శంఖా బలవంతంగా ఏదో నా నోట్లో పోసి ముక్కు మూశాడు. ఓ గుటక వేశాను. గొంతు మండింది. గొంతునుండి జీర్ణకోశంవరకూ చర్రున మండుతోంది. ఆ మంటతో పాటు మెదడుకు ఆవరించిన

అపరాధ పరిశోధన పోటీ-105

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో **75** పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ **75** పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో౦. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 30-4-'77 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జూన్'77 నెల సంచికలో ప్రకటిస్తాము.*

1. భారతీయులు దీనికి అలవాటు పడిపోయారు__? (యాంత్రిక జీవనం, కర్మసిద్ధాంతం.)

2. వీరికి డబ్బువిలువ తెలియదు__? (కష్టపడని వారికి, పసిపిల్లలకు.)

3. మన పొరుగునున్న యీ దేశంలో కూడా ఎన్నికల హడావిడే__? (శ్రీలంక, పాకిస్థాన్.)

4. దేశంలో యీ సమస్యను తొలిగిస్తే అన్ని సమస్యలు వాటంతట అవే చక్కబడతాయంటారు కొందరు__? (నిరుద్యోగ సమస్య, ఆర్థిక అసమానత.)

5. ప్రతి వ్యక్తికీ ఇది వుండాలి__? (సంపాదన, ఆత్మగౌరవం.)

మత్తుగూడా ఆవిరైపోసాగింది. గట్టిగా మూల్గాను.

"ఆర్ యు ఓకె విశాల్?" శంఖా కంఠంలో ఆతృత.

గదిలో వెలుగుతోన్న సన్నని నూనెదీపం కాంతిలో శంఖా ముఖంలో ఆతృత స్పష్టంగా కనిపిస్తోంది.

"యస్ శంఖా! వాట్ హేపెన్డ్? టైమెంతయింది ఇప్పుడు?" అడిగాను.

"ష్! గట్టిగా మాట్లాడకు! వెంటనే మనం ఇక్కడినుండి పారిపోవాలి" అన్నాడు శంఖా.

నేను మంచంమీది స్త్రీవంక చూశాను. ప్రశాంతంగా నిద్రపోతున్నట్లు ఆమె ఉచ్ఛ్వాశ నిశ్వాసాలవల్ల తెలుస్తోంది. ఆమె ముఖంవైపు పరీక్షగా చూశాను. ఒక్కక్షణం ఉలిక్కిపడ్డాను. ఆమె ముఖంలో ఏదో మార్పు కనిపిస్తోంది. చటుక్కున లేచి దగ్గరగా వెళ్ళాను.

నా దగ్గరకు మొదట వచ్చిన స్త్రీ కాదు. ఇంకెవరో.... చూడ్డానికి చైనా స్త్రీలా వుంది. వయసుకూడా ఎక్కువే. నలభై ఏళ్ళుంటాయేమో! ముందు పళ్ళు ఎత్తుగా వున్నాయి. ఆదమరచి నిద్రపోతూండడంవలన నిద్రలో ముందుపళ్ళు రెండూ బయటికి పొడుచుకువచ్చి ముఖం వికృతంగా కనిపిస్తోంది.

"మైగాడ్! హౌకుడ్ ఇట్ బి" అన్నాను ఆశ్చర్యంగా.

"బికాజ్ షి యీజ్ నాట్ ది సేమ్ ఉమన్. అసలు విషయం తెలిస్తే ఇంకా ఆశ్చర్యపోతావు నువ్వు" అన్నాడు శంఖా.

"ఏమిటది?" మెదడులో ఎక్కడో అలారం మ్రోగసాగింది.

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెలనెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5-25 లకే మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు రు. 5/- లు పంపవలసి వుంటుంది. పైకం మనియార్డరు ద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. సభ్యులకు పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5-25 (అన్నిఖర్చులతో)లకే ప్రతినెలా వి.పి. ద్వారాగాని, మా ఏజెంట్ ద్వారాగాని పంపుతాము. మీ ఇంటిదగ్గరే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చు.

4. కాపీలు మీకు నెలనెలా రెగ్యులర్‌గా పంపబడతాయి. ఏ నెలలోనైనా మీరు కాపీలు తీసుకోక పోతే, వి. పి. తిరిగొస్తే మీ సభ్యత్వము రద్దవుతుంది.

5. మీ చిరునామా మారితే వెంటనే తెలియజేయాలి.

6. సభ్యులకు ఏవైనా పాతకాపీలు కావలిస్తే వాటిని అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకుంటే కొంత కన్సెషన్ కూడా లభిస్తుంది.

7. నెలనెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునే వారు, ఏడాది పైకము రు. 60/-లు ముందుగా పంపితే వారికి కాపీలు 'రిజిస్టర్డ్ డెలివరీ'లో పంపగలము. కాపీలు మీకు గ్యారంటీగా చేరుతాయి. ఖర్చులుకూడా కొంత తగ్గుతాయి.

నేడే మీరు సభ్యులుగా చేరండి!

"ఈ రోజు తారీఖు ఎంతో తెలుసా?" అడిగాడు.

ఆలోచించాను. "సాయంత్రం ఆరింటికి వచ్చాము. ఈ రోజు తేది ఆగస్ట్ ఇరవైఆరు" అన్నాను.

నవ్వాడు శంఖా, "తప్పు నీదికాదు. నీవు త్రాగుతున్న పాలది. ఈరోజు ఆగస్టు ముప్పై. ఈ రాత్రి గడిస్తే ముప్పై ఒకటి. మనం ఈ ఆరామంలో అడుగుపెట్టి ఇప్పటికి సరిగ్గా నాలుగు రోజులు అయింది" అన్నాడు.

"మైగాడ్! కాలం తెలియకుండా వుండడానికి ఆ పాలల్లో ఏదో మత్తుమందు కలుపుతున్నారన్నమాట."

"నో! మత్తుమందు కాదు. సంగామొక్క వేరు. ఆ వేరు పాలల్లో వేసి కాచిత్రాగితే.... మనసు సెక్స్‌మీద తప్ప దేనిమీదా నిలువదు. ఇరవైనాలుగ్గంటలూ రతికోసం శరీరమూ, మనసూ అల్లలాడతాయి. ఆ వేరుతో కాచిన పాలు వరుసగా కొన్నిరోజులు త్రాగితే మనిషి, మానసికంగా, శారీరకంగా దుర్బలుడై మరణిస్తాడు."

జరిగిన విషయమేమిటో అర్థమయింది నాకు. ఈ నాలుగురోజులబట్టీ వరుసగా ఈ సంగాపాలను ఇచ్చి నన్నో రతియంత్రంగా తయారుచేసుకొన్నారీ ఆరామభిక్షుణులు.

"ది డర్టీ బుద్ధిస్ట్ బిచెస్!" అన్నాను కోపంగా.

"అసలు విషయం వింటే కోపం రాదు నీకు. మతిపోయి, గుండె ఆగుతుంది?"

"ఏమిటది?"

(సశేషం)

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, ఈ నెల 10వ తేదీలోపల మాకు చేరేట్లు పంపండి.

ఇదే విధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హో౦.డె. సభ్యులు తమ నెంబరును స్పష్టంగా వ్రాయాలి. ఇతరులు తమవ్యాఖ్యలతో 30 పైసల స్టాంపులు జతపర్చి పంపాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 20/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు వచ్చే సంచికలో చూడండి. ★

గత నెల పోటీ ఫలితాలు

(1) మార్చి '76 నెల "అపరాధ పరిశోధన" మాసపత్రిక ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

చేరువైన మృత్యువు!
బలియైన శత్రువు!!

పంపినవారు: శ్రీమతి సుశీలా హెర్బర్ట్, తండ్రి పేరు డాక్టర్ జి. ఎఫ్. ఎబెంజర్, వాండివాష్ (తమిళనాడు.)

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

గుండె ఝల్లుమంది!
అందె ఘల్లుమంది!!

పంపినవారు: శ్రీ ముద్దార మేష్, చాగల్లు-534 342.

లేఖలు

బానిసలపట్ల యజమానుల ప్రవర్తన ఏ విధంగా ఉంటుందో, కన్నులకు కట్టినట్లుగా, ఈ నెల సప్లిమెంట్‌లో ప్రచురించబడ్డ నవల 'ముప్పది ముగ్గురు బానిసలు'లో ప్రస్ఫుటంగా వివరించబడింది. ఆ నవల చదువుతున్నంత సేపు మా హృదయాలు ఆవేదనతో నిండిపోయాయి. విక్రమ్ పాఠకుల సానుభూతిని అతిగా చూరగొంటాడని చెప్పకతప్పదు.

ఇక పోతే కథల విషయంలో 'కొత్త నెక్లెస్' అన్న కథ. అత్యాశకు పోతే అసలుకు మోసం వస్తుందనే నగ్న సత్యాన్ని, మరో కథ 'సాక్షి' ఎంత తెలివిగలవారయినా పప్పులో కాలెయ్యక మానరని, నేరం చేసినవారెవ్వరు ఎలాంటి పరిస్థితుల్లోనూ తప్పించుకోలేరనే నిజాన్ని చక్కగా వివరించేలా ఉన్నాయి.

ప్రతి నెలా వజ్రపు తునకల్లాంటి కథలు మా కందిస్తూ, తద్వారా మాలో ఎనలేని కుతూహలాన్ని, పఠనాసక్తిని పెంపొందిస్తున్న మీకు మా కృతజ్ఞతాభివందనలు తెలుపకుండా ఉండలేకపోతున్నాము.

—కరణం శివానందరావు, బెక్కెం.

మార్చి '77 నెల అపనలో కథలన్నీ ఒక ఎత్తు, 'కైలాస నగరం' సీరియల్ ఒక ఎత్తు. ఊహాకందని మలుపులతో, వినూత్నంగా సాగుతూ దిగ్భ్రాంతుల్ని చేస్తూంది. మేము వచ్చే నెల పత్రికకొరకు వేచివుండాలంటే భరింప శక్యం

గావడంలేదు. రచయితకు నా అభినందనలు.

—వి. లక్ష్మణ్, లాలాగూడగేట్.

కథలలో 'త్రిమూర్తులు', నవలలో 'పాముకాటు' ఎక్స్‌లెంట్! —వేమన సత్యప్రసాద్, రాజమండ్రి.

ఫలానా రచయి(త్రి)త వ్రాసిన ఫలానా కథలు మాత్రమే బాగున్నాయి—అని కాకుండా, సర్వాంగసుందర, భావ గర్భిత, విజ్ఞానదాయకంగా వుంది ఈ నెల అపన. అపనకు అపఖ్యాతి తెచ్చే కథ 'అజ్ఞాత దీవులు' మాత్రమే. ఈ కాకమ్మ కథలు చాలా ఘోరంగా ఉన్నాయి. ప్లీజ్! ఇక నుండైనా ఈ శీర్షిక కట్ చెయ్యండి.

—ఎల్. సత్యం, కొత్తూరు.

మార్చి నెల 'సప్లిమెంట్'లో నాకు నచ్చిన నవల యం.కె.వి. శాస్త్రిగారి 'దొంగనోట్లు-దొరబిడ్డలు'. ఎల్. రామగోపాల్‌గారి 'ముప్పది ముగ్గురు బానిసలు' వెరైటీగా వుంది. —యం. కృష్ణకుమార్, సికింద్రాబాద్.

త్రిమూర్తులు, సాక్షి, డబ్బు మనిషి, అజ్ఞాత దీవుల కథలు హర్షదాయకంగా వున్నాయి. బహుళ ప్రజాదరణ గాంచిన 'అపన'లో అసలు దాగున్న రహస్యం ఏమిటో ఒకసారి చదివిన ఏ క్రొత్త పాఠకుడైనా ఇట్టే గ్రహించ గలడు. నవలల్లో హుస్సేన్‌బాషా, అజీజ్‌గార్ల నవలలు హుషారుగా వున్నాయి. ఎల్. రామగోపాల్‌గారి 'ముప్పది ముగ్గురు బానిసలు' ఆద్యంతమూ పాఠకుల్ని కళ్ళనీళ్ళ పర్యంతము చేయగలదు. శ్యాంబాబుగారి 'కైలాస నగరం' పిటీ ట్రెయిన్‌లా పరుగు లంకించుకుంటూంది. ఇటీజ్ ఏ వండర్‌ఫుల్ సీరియల్.

—సి.హెచ్. రాజా, బొంబాయి-75.

ప్రభాకర్ దేవ్‌గారి 'ఎడారి ప్రయాణం' చాలా ఆసక్తి కరముగా ఉన్నది. వెంకట్రామ్‌గారి 'అజ్ఞాత దీవులు' ఆశించి నం కి బాగాలేదు. ఎల్. రామగోపాల్‌గారి 'ముప్పది ముగ్గురు బాని 'లు' మాకు బాగా నచ్చిన నవల.

—ఆర్. వి. రాఘవరావు, తిరుమల.

మార్చి సప్లిమెంట్‌లో అజీజ్‌గారి 'మాయమైన సైంటి స్టులు' చాలా బాగుంది. కథనం క్లుప్తంగా, సూటిగా, వేగంగా నడచింది. వెంకట్రామ్‌గారి 'అజ్ఞాత దీవులు' పేజీలు దండగ. పాఠకుల సహనాన్ని పరీక్షిస్తున్నట్లుంది. బొత్తిగా వెరైటీలేని కథ. కథలు దాదాపు అన్నీ బాగానే ఉన్నాయి. —డాక్టర్ ప్రభాకర్, తిరు...-14.

ఈ నెల అపనలో త్రిమూర్తులు, శవాల స్వాగతం, ఎడారి ప్రయాణం కథలు బాగున్నాయి. ' ... ంరి సీరియల్ ఉత్సాహకరంగా సాగుతుంది. ...ంట్‌లో అజీజ్‌గారి 'పారిపోయిన సైంటిస్టులు' నవల బహుమతి గెలుచుకోవచ్చనుకుంటాను.

—యం. మధురవాణి, వనపర్తి.

మార్చి నెల ముఖచిత్రం అద్భుతంగా వుంది. త్రిమూర్తులు, కొత్త నెక్లెస్, ఎడారి ప్రయాణం కథలు ఎంతో బాగున్నాయి. సప్లిమెంట్‌లో ముప్పది ముగ్గురు బానిసలు, పారిపోయిన సైంటిస్టులు నవలలు మాకు బాగా నచ్చాయి. 'శానోర్యరా' సీరియల్ మమ్మల్ని ముగ్ధుల్ని చేస్తుంది. —పి. రాజేంద్రకృష్ణ, పోచన్నపేట.

Edited and Published by S. DAMODAR REDDY, (phone: 36959) 3-4-554 Narayanaguda, Hyderabad-500029, and Printed at Kranti Press Madras-600001.

Blank Page


Regd. no: H/ND-48
"PRABHAKAR"